27-03-2024
బుధవారం
హైదరాబాద్
సంపుటి 26, సంచిక: 279
పేజీలు: 8 | ఖమ్మం : 8+8
కరీంనగర్ : 8+8 | మహబూబ్‌నగర్: 8
వెల రూ. 5.00
Published from:
Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar

www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM

తర తరాల పిల్లల కథలు
రూ॥ 70/-
పేజీలు:64

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



## ఎంఎల్‌సి కవిత తీహార్ జైలుకు

### వచ్చేనెల 9 వరకూ జ్యుడీషియల్ కస్టడీ
### ఏప్రిల్ 1న బెయిలుపై విచారణ
### కడిగిన ముత్యంలా తిరిగొస్తా : కవిత

**న్యూఢిల్లీ :** ఢిల్లీ మద్యం అవినీతి కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) విచారణ ముగియడంతో తెలంగాణ ఎం ఎల్ సి కల్వకుంట కవితను తీహార్ జైలుకు తరలించారు. తీహార్ జైలు అధికారులు మంగళవారం సాయంత్రం ఈ విషయం ధృవీకరించారు. మహిళలకోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విభాగంలో ఉన్న ఆరో నెంబరు జైలు గదిలో ఆమెను ఉంచారు. తర్వాత ఆమె వైద్య నివేదిక విడుదల అవుతుంది. ఇడి విచారణ ముగిసిన తర్వాత మంగళవారంనాడు ఆమెను న్యూఢిల్లీ రౌస్ అవెన్యూలో ఉన్న ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరిచారు. ఆమెను వచ్చేనెల 15 వరకూ తమ కస్టడీలో ఉంచాలని ఇడి తరపు న్యాయవాది కోరారు. ఐతే కోర్టు ఆమెకు 14 రోజులపాటు జ్యుడీషియల్ కస్టడీ విధించింది. దీంతో ఆమెను తీహార్ జైలుకు తరలించారు. ఇదిలా ఉండగా, కవిత మధ్యంతర బెయిలు కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ఏప్రిల్ 1వ తేదీన విచారణ చేపడతామని కోర్టు తెలియజేసింది. ఆమెను బాహ్య ప్రపంచంలోకి వదిలేస్తే సాక్ష్యాలను తారుమారు చేస్తారని, సాక్షులను బెదిరిస్తారని భావించిన కోర్టు తీహార్ జైలుకు తరలించింది. తన కుమారుడికి పరీక్షలు దగ్గరపడ్డాయని, బెయిలు కావాలని ఆమె కోర్టులో కోరారు. ఆమెకు బెయిలు ఇవ్వాలా? వద్దా? అనే విషయంపై వచ్చే సోమవారంనాడు కోర్టులో విచారణ జరుగుతుంది. ఈనెల 15వ తేదీన కవితను ఇడి అధికారులు అరెస్టు చేసి ఢిల్లీకి తరలించారు. ఆమెను విచారించారు. ప్రత్యేక తరువాయి 2లో

# కదులుతున్న డొంక

### ఫోన్ ట్యాపింగ్ విచారణలో రోజుకో కొత్తకోణం వెలుగులోకి
### మరికొందరి పోలీస్ అధికారుల పేర్లు తెరపైకి
### ఓ ఎసిబి అధికారి పాత్ర కూడా ఉన్నట్లు విచారణలో వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్





'ఫోన్ ట్యాపింగ్'రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. రాజకీయ,పౌర సంఘాల నాయకుల ప్రైవేటు సంభాషణలు కూడా రికార్డ్ చేయడం చర్చనీయశంగా మారింది. ఫోన్ ట్యాపింగ్ విచారణలో రోజుకో కొత్త కోణం వెలుగులోనికి వస్తోంది. తాజాగా మరి కొందరు పోలీసు అధికారుల పేర్లు తెరమీదకు వచ్చినట్లు సమాచారం. ఫోన్ ట్యాపింగ్‌లో హైదరాబాద్‌లోని ఒక ఎసిబి అధికారి పాత్ర కూడా ఉన్నట్లు విచారణలో వెల్లడైంది. ముఖ్యంగా ఫోన్ ట్యాపింగ్ జరిగిన సమయంలో ఇది వరకు ఎస్ఐబిలో పని చేసిన అధికారులతో పాటు వివిధ జిల్లాలోని అధికారుల్లో కూడా ఆందోళన వ్యక్తం అవుతోంది. ప్రస్తుతం అదనపు ఎస్‌పి రమేష్ ఫిర్యాదు మేరకు ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణకొనసాగుతోంది. సాంకేతిక తరువాయి 2లో

## సమగ్ర విచారణ
### కూనంనేని

రాజకీయ ప్రత్యర్థులను బలహీనపరిచేందుకు గత ప్రభుత్వ హయాంలో జరిగిన టెలిఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో వెలుగు చూస్తున్న విషయాలు దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. రాష్ట్రంలో ట్యాపింగ్ వ్యవహారం కేవలం పోలీసులు స్వంతంగా చేసింది కాదని, దీని వెనుక ఉన్న వ్యక్తులు , కారణాలపై ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించి, దోషులు ఎంతటి వారైనా బైటికి తీయాలని, వారిని చట్టప్రకారం శిక్షించాలని డిమాండ్ చేశారు. నాడు టిపిసిసి అధ్యక్షుడు, నేటి సిఎం రేవంత్‌రెడ్డి నివాసానికి సమీపంలో ఇళ్ళు అద్దెకు తీసుకొని ఆధునిక పరికరాలతో వారి ఇంట్లో తరువాయి 2లో

## 'నా ఫోన్' కూడా...
### యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

'ఫోన్ ట్యాపింగ్'పై సమగ్ర విచారణ జరిపించేలా రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లాకు ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ మహబూబ్‌నగర్ ఎంఎల్ఎ యెన్నం శ్రీనివాస్ రెడ్డి కోరారు. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మాజీ మంత్రి ఆదేశాలతో పోలీసు అధికారులు తన ఫోన్‌ను కూడా ట్యాపింగ్ చేశారని, దీనిపైన కూడా విచారణ చేపట్టాలని డిజిపిని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు యెన్నం శ్రీనివాస్ రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో డిజిపి కార్యాలయంలో డిజిపి రవిగుప్తాను కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రతిపక్షాలకు చెందిన నాయకులు, పౌరహక్కుల, జర్నలిస్టుల స్వేచ్ఛను హరించిందని, తరువాయి 2లో

## ఉన్నతస్థాయి దర్యాప్తు
### కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

గత బిఆర్ఎస్ పాలనలో ఫోన్ ట్యాపింగ్ ద్వారా బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడి కోట్లాది రూపాయలు వసూలు చేయడం దుర్మార్గమని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై ఉన్నతస్థాయి దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ రాజకీయ నాయకులు, అధికారులు, వ్యాపారస్తుల వ్యక్తిగత జీవితాల కార్యకలాపాలపై పోలీసు అధికారులు ఒక మాఫియాగా ఏర్పడి ఫోన్ ట్యాపింగ్ చేశారని మండిపడ్డారు. బిఆర్ఎస్ పాలనలో ఒక వెలుగువెలిగిన తరువాయి 2లో

## దేశం కోసం ఓటును విజ్ఞతగా ఉపయోగించండి

### వాతావరణ కార్యకర్త సోనం 21 రోజుల దీక్ష విరమణ – లఢఖ్‌లో మూడోరోజుకు చేరిన సమ్మె



**లేహ్ :** వాతావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌ఛుక్ 21 రోజులుగా లఢఖ్‌లో చేస్తున్న నిరాహార దీక్షణు మంగళవారం నాడు విరమించారు. ఐతే మరోవైపు ప్రధాన సమస్యలపై ఆయనకు మద్దతుగా ప్రారంభించిన సమ్మె మంగళవారం మూడో రోజు కూడా కొనసాగింది. ఇన్ని రోజులుగా ఆయన కేవలం నీరు మాత్రమే తాగుతూ ప్రాణం నిలబెట్టుకుని నిరాహార దీక్ష కొనసాగించారు. లఢఖ్‌లో వాతావరణానికి ప్రమాదం కలిగిస్తున్నారనీ, లఢఖ్ పర్యావరణం, వాతావరణం నాశనమైపోతున్నదనీ, వాతావరణ రక్షణ కరువైపోయిందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ సోనం వాంగ్‌ఛుక్ ఈ నిరాహార దీక్ష చేపట్టారు. లఢ్‌ఖ్‌లో ఉన్న అత్యుత్తమమైన వాతావరణాన్ని సరంక్షించాలన్నదే ఆయన ప్రధానమైన డిమాండ్. "మేం మోడీ తరువాయి 8లో

## అటల్ పెన్షన్ యోజనపై మాటల యుద్ధం

### అది పేపర్ టైగర్ పథకం : జైరామ్ రమేశ్
### మంచి ప్రయోజనాలతో రూపొందించిన పథకం : నిర్మలా సీతారామన్



**న్యూఢిలీ :** అటల్ పెన్షన్ యోజన పథకం (ఎపివై)పై కాంగ్రెస్, కేంద్ర ప్రభుత్వం మ ధ్య మాటల యుద్ధం జరిగింది. దీనికి సోషల్ మీడియా ప్లాట్ ఫాం 'ఎక్స్' వేదికైంది. ఇది ఘోరంగా రూపొందించిన, పేపర్ టైగర్ పథకమని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ ట్వీట్ చేయగా, ఈ పథకం కనీస ఉద్దేశ్యాలు ఆయనకు తెలియవని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కౌంటర్ ట్వీట్ చేశారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తరువాయి 8లో

# ఢిల్లీలో ఉద్రిక్తత

### కేజ్రీవాల్ అరెస్టును నిరసిస్తూ ఆప్ ఆందోళన
### పంజాబ్ మంత్రి సహా పలువురు నాయకులు, కార్యకర్తలు అరెస్టు





**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఆప్ అధినేత, సిఎం కేజ్రీవాల్‌ను ఇడి అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ.. పటేల్ చౌక్ వద్ద గుమిగూడిన పంజాబ్ మంత్రి హర్జోత్ సింగ్ బెయిన్స్ సోమనాథ్ భారతి సహా పలువురు ఆప్ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఢిల్లీలోని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇంటి ముట్టడికి ఆప్ పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. అందులో భాగంగా ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కార్యకర్తలు, నాయకులు 'విప్లవం వర్ధిల్లాలి', కేజ్రీవాల్ జిందాబాద్' అంటూ నినాదాలు చేస్తూ గ్రూపుల వారీగా మోడీ నివాస ప్రాంతంలో తరువాయి 2లో

## జైలు నుంచి కేజ్రీవాల్ రెండవ ఉత్తర్వు జారీ


**న్యూఢిల్లీ :** ఢిల్లీ మద్యం పాలసీ కేసులో అరెస్టయిన ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ జైలు నుంచి మరో ఉత్తర్వును జారీ చేశారు. ఇప్పటికే కస్టడీ నుంచి తొలిసారి ఇచ్చిన ఆదేశాలపై ఇడి దర్యాప్తు చేస్తున్న సమయంలో తాజాగా మరోసారి ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం తరువాయి 2లో

## పథకాలపై వదంతులు నమ్మొద్దు
### ప్రజలకు ఢిల్లీ ప్రభుత్వం విజ్ఞప్తి

**న్యూఢిల్లీ :** ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు రద్దైపోయాయంటూ వస్తున్న వదంతులను నమ్మవద్దని ఢిల్లీ ప్రభుత్వం ప్రజలకు విజ్ఞప్తి చేసింది. పథకాలు రద్దు అయ్యాయంటూ తప్పుడు ప్రచారం ప్రజల్లో జరుగుతోందనీ, కొన్ని దుష్టశక్తులు తరువాయి 2లో

## ఆజ్ఞలతో వార్తా ప్రచురణ ఆపలేం

### అది భావ ప్రకటన హక్కుకు విఘాతం : సుప్రీంకోర్టు స్పష్టీకరణ



**న్యూఢిల్లీ :** వార్తా ప్రచురణకు ముందుగానే నిషేధాజ్ఞలు విధించడం భావ వ్యక్తీకరణ హక్కుకు తీవ్రమైన ఆటంకాలు సృష్టించినట్లే కాగలదనీ, అందువల్ల న్యాయస్థానం ఈ విషయంలో ముందస్తు నిషేధాజ్ఞలు విధించలేదని సుప్రీంకోర్టు మంగళవారం స్పష్టం చేసింది. ఒక వ్యాసం, ఒక వార్త ప్రచురితం కాకుండా ముందుగానే అడ్డుకుంటూ నిషేధాజ్ఞలు కోర్టు జారీ చేయలేదని, దీనివల్ల పరిపరి విధాలుగా భావ ప్రకటనా స్వాతంత్ర్యానికి తీవ్ర విఘాతం కలుగుతుందని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ అన్నారు. ఆయన సారథ్యానగల జస్టిస్ జె.బి.పార్థీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం ఒక వ్యాసాన్ని ప్రచురించకుండా అడ్డుకోవడంపై దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిపింది. ఈ సందర్భంగా జస్టిస్ చంద్రచూడ్ పై విధంగా వ్యాఖ్యానించారు. ప్రజలకు సమాచారం తెలుసుకునే హక్కు ఉందని ఆయన అన్నారు. ఈ కేసులో ట్రయల్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సుప్రీంకోర్టు ధర్మాసనం పక్కకు నెట్టేసింది. జీ ఎంటర్‌టైన్ మెంట్‌కు వ్యతిరేకంగా ఉద్దేశపూర్వకంగా ప్రతిష్టను భంగం కలిగించేవిధంగా బ్లూమ్ బెర్గ్ న్యూస్ ఒక ఆర్టికల్‌ను ప్రచురించకుండా ట్రయల్ కోర్టు ముందస్తు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విధంగా ఉత్తర్వులు ఇవ్వడాన్ని బ్లూంబెర్గ్ ఢిల్లీ కోర్టులో సవాలు చేసింది. ఐతే మార్చి 14న ఢిల్లీ కోర్టు కూడా ట్రయల్ కోర్టు ఉత్తర్వులను తరువాయి 2లో



## ట్రిపుల్ ఆర్ రాకుండా బిజెపి మోకాలడ్డు

### పదేళ్లుగా రాష్ట్రానికి ఏమి చేశారని మోడీకి ఓటువేయాలి?
### వందరోజుల పరిపాలనకు పార్లమెంటు ఎన్నికలు రిఫరెండం
### చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ స్థాయి ముఖ్యనేతల సమావేశంలో టిపిసిసి చీఫ్, సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/ హైదరాబాద్

పదేళ్లు ప్రధానిగా ఉన్న మోడీ రాష్ట్రానికి ఏమి చేశారని, ఏమి చూసి మూడోసారి మోడీకి ఓటు వేయాలని బిజెపి నేతలు అడుగుతున్నారని టిపిసిసి అధ్యక్షులు, సిఎం ఎ.రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. రీజనల్ రింగ్ రోడ్డు రాకుండా బిజెపి ఎందుకు మోకాలడ్డుతోందని విమర్శించారు. హైదరాబాద్‌లోని సిఎం నివాసంలో మంగళవారం తరువాయి 2లో

## ఏప్రిల్ 6 లేదా 7న తుక్కుగూడ సభ

తుక్కుగూడ రాజీవ్ గాంధీ ప్రాంగణంలో అసెంబ్లీ ఎన్నికలకు ఆరు గ్యారంటీలను ప్రకటించుకున్నామని, మళ్లీ అక్కడే ఏప్రిల్ 6 లేదా 7న జాతీయస్థాయి గ్యారంటీలను ప్రకటించుకోనున్నామని రేవంత్ రెడ్డి వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా నుంచే దేశ రాజకీయాలకు శంఖారావం పూరించనున్నామని తెలిపారు. ఈ జనజాతర సభకు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే హాజరవుతారని చెప్పారు.

## గత బిఆర్ఎస్ ప్రభుత్వ అవినీతిపై చర్చకు సిద్ధమా?

### మాజీమంత్రి హరీశ్‌కు ఎక్సైజ్ శాఖమంత్రి జూపల్లి సవాల్
### సమయం, తేదీ, వేదిక చెప్పాలని డిమాండ్



ప్రజాపక్షం/హైదరాబాద్

రైతు సమస్యలు, నీటి పారుదల ప్రాజెక్ట్ లు, గత బిఆర్ఎస్ ప్రభుత్వ అవినీతిపై చర్చించడానికి సిద్ధమా అని మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎంఎల్ఎ హరీశ్‌రావుకు రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సవాల్ విసిరారు. సమయం, తేదీ, వేదిక ఏదో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. గాంధీ భవన్ లో మంగళవారం కాంగ్రెస్ ఎంఎల్ఎలు కసిరెడ్డి నారాయణ రెడ్డి, శంకర్, వంశీకృష్ణ, రాజేష్ రెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పంట నష్ట పరిహారం ఇవ్వకుంటే సచివాలయాన్ని ముట్టడిస్తామన్న హరీశ్‌రావు వ్యాఖ్యలను మంత్రి జూపల్లి తీవ్రంగా తరువాయి 2లో

## రష్యాలో చిక్కుకున్న కేరళవాసులను సురక్షితంగా తీసుకురండి

### విదేశాంగ మంత్రి జైశంకర్‌కు సిపిఐ పార్లమెంటరీ పార్టీ నాయకులు, సిపిఐ కేరళ కార్యదర్శి బినొయ్ విశ్వం లేఖ



**న్యూఢిల్లీ :** రష్యన్ – ఉక్రెయిన్ యుద్ధ వాతావరణం నేపథ్యంలో రష్యాలో చిక్కుకున్న కేరళకు చెందిన కొంతమంది భారతీయ పౌరులను సురక్షితంగా భారత్‌కు తిరిగి తీసుకురావడానికి తగిన చర్యలు తీసుకోవాలని సిపిఐ పార్లమెంటరీ పార్టీ నాయకులు, సిపిఐ కేరళ కార్యదర్శి బినొయ్ విశ్వం కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమస్యపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని భారత విదేశాంగ విధానం, అంతర్జాతీయ చట్టాల ప్రకారం వారు తిరిగి వచ్చే విధంగా చూడాలన్నారు. ఈ మేరకు రష్యాలో చిక్కుకున్న కేరళకు చెందిన కొంతమంది భారతీయ పౌరుల పట్ల సంబంధిత భారత రాయబార కార్యాలయంలోని అధికారులు ప్రదర్శించిన అనుచిత ప్రవర్తన గురించి బినొయ్ విశ్వం మంగళవారం ఒక లేఖ ద్వారా కేంద్ర విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్.జైశంకర్ దృష్టికి తీసుకువచ్చారు. నిరుద్యోగులు, పేదరికంలో ఉన్న యువ పౌరులు రష్యన్ – ఉక్రెయిన్ వార్ ఫ్రంట్‌లో బాగా జీతంతో కూడిన ఉద్యోగ అవకాశాలతో వారిని ఆకర్షించిన ఏజెంట్ల చేత మోసగించబడ్డారని, వారి కుటుంబాలతో రష్యాలోని భారత రాయబార కార్యాలయ అధికారులు నిర్లక్ష్య వైఖరి తరువాయి 2లో

## భువనగిరి, వరంగల్, ఖమ్మం సీట్లపై కాంగ్రెస్ ఆశావహుల్లో ఉత్కంఠ

### నేడు తేలనున్న టికెట్ల కేటాయింపు
### అభ్యర్థుల ఎంపికలో కాంగ్రెస్ మల్లగుల్లాలు
### ఢిల్లీలో మకాం... ఎవరి ప్రయత్నాలు వారివి...

ప్రజాపక్షం /జనగామ/ హన్మకొండ / ఖమ్మం



లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ నుండి భువనగిరి, వరంగల్, ఖమ్మం నియోజకవర్గాల టిక్కెట్లను ఎవరికి కేటాయిస్తారోనని ఆశావహులలో ఉత్కంఠ నెలకొంది. ఎఐసిసి సిఈసి సమావేశం బుధవారం జరగనున్న నేపథ్యంలో ఈ మూడు నియోజకవర్గాలకు టిక్కెట్లు ఎవరికి దక్కనున్నాయో తేలనుంది. దీంతో టిక్కెట్ కోసం ఢిల్లీ స్థాయిలో లాబియింగ్ చేస్తున్న నాయకులు టెన్షన్ పడుతున్నారు. తెలంగాణలో ఇప్పటికే 8 స్థానాలకు అభ్యర్థులను ఫైనల్ చేసిన కాంగ్రెస్ సిఈసి మరి కొన్ని స్థానాలను తరువాయి 2లో

## తీహార్ జైలుకు

(మొదటి పేజీ తరువాయి)

కోర్టు న్యాయమూర్తి కావేరీ బవేజా ఈ కేసు విచారణ చేశారు. సాధారణ నేరాల కంటే ఆర్థిక నేరాలలో విచారణ అత్యంత సంక్లిష్టమైనవనీ, చాలా జాగ్రత్తగా ఈ కేసులు విచారణ చేయవలసి ఉందని, ఆర్థిక నేరస్తులు చాలా తెలివిగా జాగ్రత్తగా నేరాలు చేస్తున్నారని, అందువల్ల దర్యాప్తు ప్రక్రియ చాలా సంక్లిష్టంగా మారిందని, ఈ కేసుల్లో నిందితులు సాక్ష్యాలను చెరిపివేసి, సాక్షులను తారు మారు చేసే ప్రమాదం ఉందని న్యాయమూర్తికి ఇడి తన దరఖాస్తులో వెల్లడించింది. "ఇడి ఈ కేసులో ఇంకా దర్యాప్తు కొనసాగిస్తున్నది, అవినీతిలో కవిత పాత్ర మరింత స్పష్టం కావాల్సి ఉంది, ఇతర వ్యక్తులను కూడా గుర్తించే ప్రక్రియ కొనసాగుతున్నది అని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు కుమార్తె, ఎం ఎల్ సి కవిత సౌత్ గ్రూపులో కీలక సభ్యురాలు. ఈ గ్రూపు నుండి రూ.100 కోట్లు ముడుపులు ఆప్ పార్టీకి అందటంలో ఆమెకు తెలిసే జరిగిందని ఆరోపణ. ఆమె సిబ్బంది అభిషేక్ బోయినపల్లి, బుచ్చి బాబుల ద్వారా ఆప్ నాయకులకు కవిత రూ.100 కోట్లు ముడుపులు సమర్పించారన్నది ఇడి అధికారుల ప్రధాన ఆరోపణ. ఈనెల 16న కవితను ఇడి అధికారులు తమ కస్టడీలోకి తీసుకుని ఏడు రోజులు విచారణ జరిపారు. తర్వాత మరో మూడు రోజులు విచారణ పొడిగించారు.

### కడిగిన ముత్యంలా బయటకొస్తా

తన అనుచరుల ద్వారా రూ.100 కోట్లు ఆమ్ ఆద్మీ పార్టీకి ముడుపులు ఇచ్చిన కేసులో అరెస్టైన ఎం ఎల్ సి కవిత, తాను కడిగిన ముత్యంలా బయటకు వస్తానని అన్నారు. ఢిల్లీలో ఇడి కస్టడీ నుండి కోర్టుకు హాజరైన సందర్భంగా కోర్టు రూమ్ వెలుపల మాట్లాడుతూ, ఇవన్నీ నకిలీ కేసులని అన్నారు. ఎన్నికల ప్రయోజనాలకోసం తనను అరెస్టు చేశారన్నారు. "ఇది తప్పుడు కేసు, మనీ లాండరింగ్ కేసు కాదు, పొలిటికల్ లాండరింగ్ కేసు" అని ఆమె విమర్శించారు. బిజెపి నిందితులకు టిక్కెట్లు ఇస్తోంది, ఒక నిందితుడు ఇప్పటికే బిజెపిలో చేరాడు, మరో నిందితుడికి బిజెపి ఎపి సీటు దక్కుతోంది, మూడో నిందితుడు రూ.50 కోట్లు ఎన్నికల బాండ్ల ద్వారా బిజెపికి ముడుపులు సమర్పించారు, ఇవన్నీ ఉద్దేశపూర్వకంగా నాపై పెట్టిన కేసులు" అని కవిత విమర్శించారు. 46 ఏళ్ళ వయసుగల కవితను మంగళవారం ఉదయం 11.30 గంటలకు ఇడి అధికారులు కోర్టులో హాజరుపరిచారు. ఆమెకు ఏప్రిల్ 9 వరకు జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. తర్వాత ఆమె కుటుంబ సభ్యులు ఆమెను కలిశారు.

## వదంతులు నమ్మొద్దు

(మొదటి పేజీ తరువాయి)

ఈ విధమైన ప్రచారం చేసి ప్రయోజనాలు పొందాలని ప్రయత్నం చేస్తున్నాయని, ఈ విధమైన వందంతులు నమ్మవద్దని ఢిల్లీ ప్రభుత్వ ప్రజాశిక్షా విభాగం కార్యదర్శి నిహారికా రాయ్ ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టుతో ఏర్పడిన పరిస్థితిని కొందరు తమకు అనుకూలంగా మలచుకునేందుకు యత్నిస్తున్నారని పేర్కొంది. రాష్ట్రంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సబ్సిడీలు రద్దు కాలేదని వివరణ ఇచ్చింది. "నేర విచారణకు సంబంధించి చట్టం తన పని తాను చేసుకుపోతుందని, పథకాలను అమలు చేయడంలో, పరిపాలనలో ఏనాడూ వ్యక్తులు సాధారణ పరిస్థితులను మార్చలేరని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజాసేవలు అన్నీ కొనసాగుతున్నాయని, సాంఘిక సంక్షేమ పథకాలు, సబ్సిడీలు ప్రస్తుతం ఢిల్లీ ప్రభుత్వం కొనసాగిస్తోందని, నిరాఘాటంగా అవన్నీ కొనసాగుతాయని ప్రజాశిక్షా విభాగం ప్రకటన చేసింది. వదంతులను దూరంగా ఉంచాలని ప్రజలను కోరింది. ఈనెల 21న కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడంతో ఈ వదంతులు వెలువడ్డాయి. ఈ విధమైన వదంతులు సాధారణ ప్రజానీకంగా భయాలను సృష్టించేందుకే కొందరు పుట్టిస్తున్నారని నిహారికా రాయ్ విమర్శించారు. సాంఘిక కార్యక్రమాలకు చేసే ఖర్చు ప్రభుత్వ సొమ్మే తప్ప వ్యక్తుల సొంత ఖర్చు కాదని, ఈ పథకాలు యథాతథంగా కొనసాగుతాయని పేర్కొన్నారు.

## సమగ్ర విచారణ

(మొదటి పేజీ తరువాయి)

ఏమి మాట్లాడుకునేవారో రికార్డు చేసారనే వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ముగ్గురు పోలీసు ఉన్నతాధికారులు అరెస్టు కావడం, ఇంటెలిజెన్స్ మాజీ ఛీఫ్ పేరు రావడం దారుణమని పేర్కొన్నారు. నాటి అధికార పార్టీ తమ ప్రత్యర్థి పార్టీల ఫోన్‌లను ట్యాపింగ్ చేయిస్తుందనేది అందరికీ తెలిసిందేనని, ఎందుకంటే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏ నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చినా నాయకులందరిని రాత్రికి రాత్రే ఎక్కడ ఉన్నా హౌజ్ అరెస్టులు చేసేవారని గుర్తు చేశారు. అయితే నిఘా వ్యవహారం ఇంత లోతుగా ఉండడం ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత ఆందోళనకరమైనదని అన్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వం కూడా ఇజ్రాయెల్ సాఫ్ట్‌వేర్ పెగాసస్‌తో రాజకీయ ప్రత్యర్థులు, జర్నలిస్టుల ఫోన్లు ట్యాపింగ్ చేయించిన విషయం తెలిసిందేనని, గత రాష్ట్ర ప్రభుత్వం కూడా అదే బాటలో నడిచిందని స్పష్టమవుతోందన్నారు. గతంలో రాజకీయ అవసరాల కోసం ఫోన్ ట్యాపింగ్ చేసిన కేసులో నాటి కర్నాటక ముఖ్యమంత్రి రామకృష్ణ హెగ్డే రాజీనామా చేయాల్సి వచ్చిందని గుర్తు చేశారు. భవిష్యత్తులో రాజకీయ నాయకులు, ప్రత్యర్థులు, ప్రజాసంఘాలు పై ఫోన్ ట్యాపింగ్ చేయకుండా వ్యవస్థలు సక్రమంగా నడిచే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు.

## ప్రచురణ ఆపలేం

(మొదటి పేజీ తరువాయి)

సమర్థించింది. దీంతో బ్లూంబెర్గ్ న్యూస్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సుప్రీంకోర్టు ఈ ఉత్తర్వులను తోసి పుచ్చుతూ ఈ విధమైన ముందస్తు ఉత్తర్వులు భావ ప్రకటనా హక్కుకు భంగం కలిగిస్తాయని పేర్కొంది. ఈ విధంగా చేయడం ప్రచురణను ముందుగానే వార్తకు "మరణ శిక్ష విధించడం" లాంటిదేనని జస్టిస్ చంద్రచూడ్ వ్యాఖ్యానించారు. దీనిపై బ్లూంబెర్గ్ న్యూస్ ప్రతినిధి స్పందిస్తూ, సుప్రీంకోర్టు తీర్పు ఎంతో ప్రోత్సాహకరంగా ఉందని, తాము తమ కథనాన్ని మరింత ఉత్సాహంతో ముందుకు తీసుకువెళతామని అన్నారు. ట్రయల్ కోర్టు ఈ కేసులో తీర్పు చెప్పడంలో తప్పు చేసిందని, హైకోర్టు కూడా ఈ ఉత్తర్వుల పర్యవసానాలపై సమతుల్యం పాటించకుండా సమగ్రంగా చర్చించలేదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఈ విధమైన కేసుల్లో ముందస్తు ఉత్తర్వులు జారీ చేసేటప్పుడు ట్రయల్ కోర్టు న్యాయమూర్తి సమగ్ర విశ్లేషణ చేయవలసి ఉంటుందని వ్యాఖ్యానించింది.

## సురక్షితంగా తీసుకురండి

(మొదటి పేజీ తరువాయి)

ప్రర్థించినట్టు వార్తా నివేదికలు, కమ్యూనికేషన్ల ద్వారా వెల్లడైందని ఆయన తన లేఖలో వివరించారు. సమస్యల్లో ఉన్న యువకులకు రాయబార కార్యాలయ అధికారులు 'వేచి ఉండండి.' అని సమాధానం చెప్పడం తప్ప వారి సంక్షోభాన్ని పరిష్కరించలేదని, భారతదేశానికి తిరిగి తీసుకురావడానికి ఎటువంటి ఖచ్చితమైన చర్యలు తీసుకోలేదని, వారి బాధాకరమైన పరిస్థితిని వివరించినప్పటికీ, భారత రాయబార కార్యాలయం వారికి ఏ విధంగానూ సహాయం చేయడంలేదని ఆయన తెలిపారు. తాజా సమాచారం ప్రకారం, వారిలో ఒకరు వార్ ఫ్రంట్‌లో గాయపడ్డారని, అతని బాధాకరమైన పరిస్థితి తెలిసినప్పటికీ ఎంబసీ అధికారులు అతనిని మరి కొన్ని ధృవీకరణ పత్రాలను సమర్పించాలని కోరారన్నారు. సమస్యల్లో ఇరుక్కున్న వారు తమను తాము కాపాడుకోవడానికి డబ్బు లేదా ఇతర నిత్యావసర వస్తువులు లేవని, మరోవైపు ఆకలి, గాయాలు, మంచు వారి పరిస్థితిని నిత్యం మరింత దుర్భరం చేస్తున్నాయని వివరించారు. ఇతర దేశాల ప్రజలు వారి సంబంధిత రాయబార కార్యాలయాల నుండి సత్వర సహాయం పొందినప్పటికీ, భారత పౌరులు మాత్రం ఇప్పటికీ భారత రాయబార కార్యాలయం నుండి దయతో కూడిన సహాయం కోసం ఎదురుచూస్తున్నారన్నారు. బాధితుల కుటుంబాలు ఇక్కడ తీవ్ర వేదనలో ఉన్నాయని, వారి పిల్లలు సురక్షితంగా తిరిగి వస్తారని ఆత్రుతగా ఎదురుచూస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో వారు భారత్‌కు తిరిగి వచ్చే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని బినోయ్ విశ్వం కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

# ముట్టచెప్పేదెప్పుడో?

**పథకాల పేరిట గత ప్రభుత్వ హయాంలో భారీగా వసూళ్లు**

**డబుల్ ఇళ్లు, దళితబంధుకు చెల్లించిన వారి ఆందోళన**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** గత ప్రభుత్వం హయాంలో జనం నుండి నాయకులు వసూళ్లు చేసిన ముడుపులు ఇంత వరకు ముట్టచెప్పనే లేదు. దీంతో డబుల్ బెడ్రూం ఇళ్లు, దళిత బంధు, బిసి బంధు పథకాల కోసం డబ్బులు చెల్లించిన వారు నాయకుల చుట్టూ తిరుగుతున్నా ముఖం చాటేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో జనం లబోదిబో మంటున్నారు.

**పథకాల పేరిట:** గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం చాలా మంది కొందరికి రూ.1 లక్ష నుండి రూ.2 లక్షల వరకు చెల్లించారు. ఇళ్లు వస్తుందనే ఆశతో డబ్బులు చెల్లించినప్పటికీ నిరాశే మిగిలింది. ప్రభుత్వం మారటంతో పరిస్థితి అయోమయంగా మారింది. మరో ప్రక్క దళిత బంధు కోసం ఒక్కొక్కరి వద్ద నుండి రూ.2 లక్షల నుండి రూ.3 లక్షల వరకు వసూళ్లు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఐదు నియోజకవర్గాల పరిధిలో సుమారు రూ.40 కోట్లకు పైగానే వసూళ్ల పర్వం సాగినట్లు తెలుస్తోంది. ప్రతిష్ఠాత్మకంగా బిఆర్ఎస్ ప్రభుత్వం దళిత బంధు పథకాన్ని తీసుకొచ్చి అర్హులకు రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందించేందుకు సిద్ధమైంది. తొలిదశ పథకం ద్వారా జిల్లా వ్యాప్తంగా దళితబంధు పథకాన్ని అందించారు. రెండో దఫా అమలయ్యే నాటికి ఎన్నికలు రావడంతో తాత్కాలికంగా రద్దు చేశారు. తిరిగి బిఆర్ఎస్ అధికారంలోనికి వస్తుందని, పథకం ద్వారా నగదు అందుతుందని భావించిన చాలా మంది దళారులకు డబ్బులు చెల్లించారు. తీరా సీన్ రివర్స్ అయ్యింది.

**ముఖం చాటేస్తున్న నాయకులు:** దళితబంధు, డబుల్ బెడ్రూం ఇళ్లు, బిసి బంధు పేరిట డబ్బులు వసూళ్లు చేసిన నాయకులు వాటిని తిరిగి చెల్లించక పోగా ప్రస్తుతానికి ముఖం చాటేస్తున్నారు. తెల్లవారు ఝామునే డబ్బులు ఇచ్చిన వారి ఇళ్లకు జనం వెళ్లి మరీ పట్టుకుంటున్నారు. తమ డబ్బులు ఇవ్వాలని నిలదీస్తున్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో పరిస్థితులు తారుమారయ్యాయి. మీరు చెల్లించిన మొత్తం పై నాయకులకు పంపించాము, వారిని అడిగి తెలుసుకో అంటూ దాటేస్తున్నారు. ఇళ్లు, దళితబంధు, బిసి బంధు వస్తుందని చాలా మంది లక్షలకు లక్షలు అప్పులు తెచ్చి మరీ దళారి నాయకుల చేతిలో పోశారు. ఇప్పుడు వడ్డీలు కట్టలేక తీవ్ర ఇబ్బందిగా మారిందని పలువురు వాపోతున్నారు. కాగా పథకాలు వస్తాయనే ఆశతో డబ్బులు చెల్లించినప్పటికీ వాటికి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో ప్రజల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

# 'నా ఫోన్'నూ ట్యాప్

(మొదటి పేజీ తరువాయి)

గొంతునొక్కెందుకు ప్రయత్నించిందని విమర్శించారు. రాజకీయ నాయకుల వ్యక్తిగత విషయాలను, కుటుంబ రహస్యాలను కూడా విని, వారి స్వార్థానికి వాడుకున్నారని మండిపడ్డారు. వ్యక్తిగత జీవితంపై కూడా నిఘా పెట్టడం దుర్మార్గమన్నారు. రాజకీయ, పోలీసుల అపవితర కలయికతో రాజకీయ ప్రత్యర్థులను అణచివేసేందుకు ప్రయత్నించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రష్య, ఇజ్రాయిల్ దేశాల నుండి ఆధునీయ పరికరాలను తీసుకొొచ్చి తమ సంభాషణలను వినడం దారుణమన్నారు. ఫోన్ ట్యాపింగ్ లో అసలు బాధ్యులు ఎవరో తేలాలని, వారిపైన చట్టపరంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఫోన్ ట్యాపింగ్ బాధితులు ఫిర్యాదుల చేసేందుకు ముందుకు రావాలని, అప్పుడే అందరికీ న్యాయం జరుగుతోందని శ్రీనివాస్ రెడ్డి కోరారు.

### 'నక్సలైట్ల' వాడే డివైసును కాంగ్రెస్‌పై వాడారు : నిరంజన్

నక్స్ లైట్ల కదలికల కోసం వాడే డివైస్‌ను గత బిఆర్ఎస్ ప్రభుత్వం తమ కాంగ్రెస్ పార్టీ నాయకులపై ఉపయోగించిందని టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ అంశంలో అప్పటి డిజిపి, హోంమంత్రి ఇతర అధికారులపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ ఒక వైపు కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వ్యవస్థలను దుర్వినియోగం చేస్తోందని, మరో వైపు గత బిఆర్ఎస్ ప్రభుత్వం కూడా అధికార దుర్వినియోగానికి పాలపడిందని విమర్శించారు. తెలంగాణ పోలీసులు అంటే గొప్పగా చెప్పుకొన్న పరిస్థితి నుండి ఇప్పుడు సిగ్గుపడే పరిస్థితికి గత బిఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. పోలీసులే సైబర్ నేరాలకు పాలపడుతన్నారంటే వ్యవస్థలను ఏవిధంగా దుర్వినియోగం చేస్తున్నారో అర్థమవుతుందని, ముగ్గురు కీలక అధికారులు కీలకమైన, రెవెన్యూ, పోలీసు వ్యవస్థను భ్రష్టు పట్టించారని విమర్శించారు. ప్రస్తుత సిఎం రేవంత్ రెడ్డి ఇంటి దగ్గర ఇల్లు అద్దెకు తీసుకుని, ఆయన ఫోన్ ట్యాపింగ్ చేశారన్నారు.

# బిజెపి మోకాలడ్డు

(మొదటి పేజీ తరువాయి)



నాడు చేవెళ్ళ పార్లమెంటు నియోజకవర్గ స్థాయి ముఖ్య నేతల సమావేశం జరిగింది.ఈ సమావేశానికి సిఎ రేవంత్ రెడ్డి, చేవెళ్ళ కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్ రెడ్డి, వికారాబాద్ డిసిసి అధ్యక్షులు, ఎంఎల్ఎ రామ్మోహన్ రెడ్డి, రంగారెడ్డి డిసిసి అధ్యక్షులు నర్సింహారెడ్డి, ఎంఎల్ఎలు, మాజీ ఎంఎల్ఎలు, ఇతర ముఖ్య నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ప్రసంగిస్తూ బుల్లెట్ ట్రైన్ గుజరాత్ కు తీసుకెళ్లిన మోడీ, వికారాబాద్ కు ఎంఎంటిఎస్ రైలు తీసుకురాలేదని విమర్శించారు. గుజరాత్ లో సబర్మతి రివర్ ఫ్రంట్ ను అభివృద్ధి చేసుకున్న మోడీ.. మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధికి నిధులు ఇవ్వలేదని ప్రశ్నించారు. బిజెపి నేతలు ప్రాణహిత చేవెళ్ల పూర్తి చేయలేదని, వికారాబాద్ వరకు ఎంఎంటిఎస్ రైలు తీసుకురాలేదన్నారు. మూడోసారి మోడీకి ఓటు వేయాలని బిజెపి నేతలు అడుగుతున్నారని, వారి వ్యవహారం పెళ్లి పెద్దను చూసి పిల్లనివ్వాలని అన్నట్లుందన్నారు.

### సర్వేల ఆధారంగానే అభ్యర్థులు

కాంగ్రెస్ పార్టీతోనే సామాజిక న్యాయం జరుగుతుందని, తెలంగాణ రాష్ట్రంలో 17 పార్లమెంట్ స్థానాల్లో 14 పార్లమెంట్ స్థానాలు గెలవాలనే పట్టుదలతో ఉన్నామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. క్షేత్ర స్థాయిలో అందరి అభిప్రాయాలు, సర్వేల ఆధారంగానే పార్టీ అధిష్టానం అభ్యర్థులను ఎంపిక చేస్తోందన్నారు. చేవెళ్ల, సికింద్రాబాద్, మల్కాజిగిరి నియోజకవర్గాలకు ఒకదానికొకటి సంబంధం ఉన్నదని, అన్ని రకాలుగా ఆలోచించే చేవెళ్లలో రంజిత్ రెడ్డి, మల్కాజిగిరి సునీతా మహేందర్ రెడ్డి, సికింద్రాబాద్ దానం నాగేందర్ ని పార్టీ అభ్యర్థులుగా ప్రకటించిందని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపు మన వంద రోజుల పరిపాలనకు రెఫరెండమని పునరుద్ఘాటించారు.తెలంగాణలో 14 పార్లమెంట్ స్థానాలు గెలిచి సోనియమ్మకు కృతజ్ఞత చెబుదామన్నారు. మన ప్రాంతాన్ని అభివద్ధి చేసుకునేందుకు ఇది చక్కని అవకాశమని సిఎం అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మన పార్టీ అభ్యర్థులను గెలిపించుకుంటేనే మన ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యకర్తలకు అండగా నిలబడేందుకు, దేశాన్ని కాపాడుకునేందుకు రాహుల్ గాంధీ వేల కిలోమీటర్లు నడిచారని,పార్టీకి అండగా నిలబడి సోనియమ్మ నాయకత్వానికి బలపరచాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదని తెలిపారు.

# ఆశావహుల్లో ఉత్కంఠ

(మొదటి పేజీ తరువాయి)

ఫైనల్ చేసే అవకాశం ఉంది. అందులో భువనగిరి, వరంగల్, ఖమ్మం పార్లమెంట్ స్థానాలు సైతం ఉన్నట్లు తెలుస్తుంది. వరంగల్, భువనగిరి, ఖమ్మం స్థానాలకు బలమైన వ్యక్తులు పోటీ పడుతున్నారు. వరంగల్ పార్లమెంట్‌కు సంబంధించి గట్టి పోటీ ఏర్పడింది. ఇక్కడి నుండి ప్రస్తుత ఎంపి పసునూరి దయాకర్ బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లో చేరారు. ఆయనతో పాటు గత అసెంబ్లీ ఎన్నికల్లో అధిష్టానం మాట మేరకు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ నుండి తప్పుకున్న దొమ్మాటి సాంబయ్య, స్టేషన్‌ఘనపూర్ ఎంఎల్ఎ అభ్యర్థిగా పోటీ చేసిన సింగపురం ఇందిర పోటీ పడుతున్నారు. అయితే ఇక్కడి నుండి అద్దెంకి దయాకర్ పోటీ చేస్తారనే ప్రచారం కూడా జరిగినప్పటికీ ఆయన పేరు పరిశీలన నుండి తప్పించినట్లు సమాచారం. వరంగల్ నుండి పోటీ పడుతున్న ముగ్గురూ మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారే. అయితే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మాత్రం దొమ్మాటి సాంబయ్య పేరు సూచిస్తున్నట్లు తెలుస్తోంది. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సింగపురం ఇందిర పేరు చూచిస్తుండగా బిఆర్ఎస్ నుండి వచ్చిన వ్యక్తికి ప్రాముఖ్యత ఇవ్వాల్సి ఉంటుందని అధిష్టానం ఆలోచిస్తున్నట్లు సమాచారం. వరంగల్ ఎంపి టిక్కెట్టు కోసం 45 మంది ధరఖాస్తు చేసుకోగా ముగ్గురి మధ్యనే తీవ్ర పోటీ నెలకొంది. ఈ ముగ్గురిలో ఎవరో ఒకరికి ఇస్తారా..లేక కొత్త వ్యక్తిని తెరమీదకు తీసుకొస్తారా అనేది వేచిచూడాలి. అయితే బిఆర్ఎస్ నుండి పోటీచేసే వ్యక్తి కడియం కావ్య మహిళ కావడంతో ఆ కోణంలోనూ ఆలోచించే అవకాశాలు లేకపోలేదని పార్టీ నాయకులు అంటున్నారు.

### తేల్చాల్సింది కాంగ్రెస్సే

ఖమ్మం పార్లమెంటు నియోజక వర్గానికి సంబంధించి అభ్యర్థిని ప్రకటించాల్సిన ప్రధాన పార్టీలలో కాంగ్రెస్ మాత్రమే మిగిలింది. కాంగ్రెస్ పార్టీలో ముగ్గురు మంత్రుల కుటుంబసభ్యులతో పాటు పలువురు పోటీ పడుతున్నారు. ముగ్గురు మంత్రుల్లో ఏ ఒక్కరి కుటుంబ సభ్యులకు అవకాశం కల్పించినా పార్టీలో వర్గపోరు రగులుతుందన్న భావన కొందరు వ్యక్తం చేస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సతీమణి మల్లు నందిని, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోదరుడు పొంగులేటి ప్రసాదరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు తుమ్మల యుగంధర్, పారిశ్రామిక వేత్త వంకాయల పాటి రాజేంద్రప్రసాద్ (రాజా), సీనియర్ కాంగ్రెస్ నాయకులు వి.హన్మంతరావు, జెట్టి కుసుమకుమార్ పోటీపడుతుండగా పోటీ పడుతుండగా టిక్కెట్ ఎవరికి దక్కుతుందన్నది ఆసక్తిగా మారింది. కాంగ్రెస్ ఇప్పటి వరకు ప్రకటించిన స్థానాలను బట్టి చూస్తే అనూహ్యంగా అనేక మంది పేర్లను తెరపైకి తెచ్చి టికెట్లను ఖరారు చేసింది. అదే రీతిలో ఖమ్మం నుంచి కూడా అనూహ్యంగా కొత్త వ్యక్తులు తెరపైకి వస్తారా లేక ప్రస్తుతం ప్రధానంగా పోటీ పడుతున్న వారిలోనే ఒకరికి టికెట్ కేటాయిస్తారా అన్నది తేలాల్సి ఉంది. ఇక పోతే సామాజిక వర్గ వ్యవహారం ఇప్పుడు తెరపైకి వచ్చింది. రాష్ట్రంలోని 17 పార్లమెంటు నియోజకవర్గాలలో ఖమ్మం స్థానాన్ని ఓ సామాజికవర్గం గట్టిగా కోరుతుందని, తమకు ఇక్కడ తప్ప మరొక చోట అవకాశం ఇచ్చినా ఉపయోగం ఉండదని ఆ వర్గ నేతలు పట్టుబడుతున్నట్లు సమాచారం. అదే జరిగితే కొత్త వ్యక్తులు ఖమ్మం హస్తం గుర్తును చేజిక్కించుకోవచ్చు. మొత్తంగా కాంగ్రెస్ అధిష్టానం ఖమ్మం అభ్యర్థి ఎంపికపై ఆచి తూచి వ్యవహరిస్తున్నట్లు తెలుస్తుంది. నమ్మకంగా గెలిచే స్థానం కావడంతో తొందరపడి ఇబ్బందులు తెచ్చుకోరాదన్న ధోరణి అధిష్టానం ప్రదర్శిస్తుంది. ముగ్గురు మంత్రులను సమన్వయం చేయడంతో పాటు సామాజిక వర్గ నేతలను సైతం తృప్తి పరిచే విధంగా అభ్యర్థి ఎంపిక ఉండాలని రాష్ట్ర నాయకత్వం కోరుకుంటున్నది. ఇదిలా ఉండగా, భువనగిరి పార్లమెంట్ టిక్కెట్ కోసం కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి భార్య కోమటిరెడ్డి లక్ష్మి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డిలు పోటీ పడుతున్నారు. అయితే ఇద్దరిలో ఎవరికి దక్కుతుందనేది ఉత్కంఠ నెలకొనగా కోమటిరెడ్డి లక్ష్మికే టిక్కెట్టు దక్కే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

### ఢిల్లీలో మకాం.. ఎవరి ప్రయత్నాలు వారివి..

ఎవరికి టిక్కెట్టు ఇవ్వాలనే విషయంపై అధిష్టానం కుస్తీ పడుతుండగా ఆశావాహులు మాత్రం హైరానా పడుతున్నారు. టిక్కెట్టు ఆశిస్తున్న వారంతా ఢిల్లీలోనే మకాం అధిష్టానవర్గం సభ్యులతో లాబియింగ్ చేస్తున్నారు. ఆశావాహులు ఢిల్లీలో ఉండగా వారి అనుచరులు స్థానికంగా తమ నాయకుడికే టిక్కెట్టు వస్తుందని ఎవరికి వారు ప్రచారం చేసుకుంటున్నారు. అధిష్టానం ఏ నిర్ణయం తీసుకుంటుదోననే భయంతో అభ్యర్థులు ఉన్నారు. వరంగల్, భువనగిరి స్థానాల్లో కాంగ్రెస్ నుండి ఎవరిని బరిలోకి దింపినా వారు తప్పక గెలిచే అవకాశాలు ఉన్నాయి. దీనితో ఎలాగైనా టిక్కెట్టు దక్కించుకోవాలనే పట్టుదలతో ఆశావాహులు ఉన్నారు.

# కేజ్రీవాల్ రెండవ ఉత్తర్వు జారీ

(మొదటి పేజీ తరువాయి)

ఉదయం లాకప్ నుంచి కేజ్రీవాల్ ఆరోగ్యశాఖకు సంబంధించి రెండో ఆదేశాలు జారీ చేశారు. ఆ ఆదేశాలను ఢిల్లీ ఆరోగ్య శాఖ మంత్రి సౌరభ్ భరద్వాజ్ మీడియా సమావేశంలో చదివి వినిపించారు. కొన్ని ఆసుపత్రులు, మొహల్లా క్లినిక్‌లలో మందులు, డయాగ్నోస్టిక్ పరీక్షల కొరత ఉందని, వాటిని అందుబాటులో ఉంచాలని ఆదేశించిట్లు భరద్వాజ్ చెప్పారు. జైలులో ఉన్నప్పటికీ ఢిల్లీ ప్రజల ఆరోగ్యంపై కేజ్రీవాల్ ఆందోళన చెందుతున్నారన్నారు. ఆతను అరెస్టు అయినప్పటికీ ఢిల్లీ ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో, మొహల్లా క్లినిక్‌లలో, ఉచిత పరీక్షలు చేయించుకోవడంలోనూ ఎలాంటి ఇబ్బందులు రావని విశ్వసిస్తున్నారన్నారు. ప్రజలకు ఉచిత మందులు అందుబాటులో లేవని, వాటిని అందుబాటులో ఉంచాలని, కొన్ని ఆస్పత్రుల్లో ఉచిత పరీక్షలు కూడా నిర్వహించడం లేదని, ఈ సమస్యలను పరిష్కరించాలని తనని ఆదేశించినట్లు ఆరోగ్య శాఖ మంత్రి తెలిపారు. 'ఢిల్లీలోని పదివేల కుటుంబాలు ప్రభుత్వ ఆసుపత్రుల మందులపై ఆధారపడి ఉన్నాయి. కొంతమందికి బిపి, షుగర్ వంటి జీవితకాల మందులు అవసరం. చాలా మంది రోగులు నిర్ణీత వ్యవధిలో రోగనిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి. చాలా మొహల్లా క్లినిక్‌లలో ఉచిత పరీక్షలకు అంతరాయం కలుగుతోంది. ఈ ఆదేశాలతో నాపై బాధ్యత మరింత పెరిగింది. పరిస్థితిని పరిష్కరించడానికి యుద్ధ ప్రాతిపదికన పని చేస్తాను' అని భరద్వాజ్ పేర్కొన్నారు.

# ఉన్నత స్థాయి దర్యాప్తు

(మొదటి పేజీ తరువాయి)

అధికారులపై కూడా విచారణ చేపట్టి, వారిపైన తగిన చర్యలు తీసుకోవాలన్నారు. బిజెపికి చెందిన నాయకులు, కార్యకర్తలు, తమ కార్యాలయ సిబ్బంది ఫోన్లను కూడా ట్యాప్ చేసినట్టు ఆధారాలు బయటపడుతున్నాయని విమర్శించారు. లిక్కర్ కుంభకోణంలో కవిత జోక్యం లేకపోతే,ఇది అక్రమంగా,రాజకీయపరమైన కక్షసాధింపు కేసు అయితే, దీనిపైన కెసిఆర్ బహిరంగ చర్చకు వచ్చి నిరూపించుకోవాలని అన్నారు. లిక్కర్ కేసులో ఏ రకంగా కడిగిన ముత్యంలాగా కవిత తిరిగివస్తారో తెలంగాణ ప్రజలు తెలుసుకోవాలనుకుంటున్నారని చెప్పారు.

# ఢిల్లీలో ఉద్రిక్తత (మొదటి పేజీ తరువాయి)

మెట్రో స్టేషన్‌కు చేరుకున్నారు. వీరిని అడ్డుకునేందుకు ప్రధాని మోడీ నివాసం చుట్టూ పలు అంచెల్లో పోలీసులు మోహరించారు. అటు వైపు ఎవరూ రాకుండా 144 సెక్షన్ విధించినట్లు ఓ సీనియర్ అధికారి చెప్పారు. అటు వైపు వెళ్లేందుకు ఎవరినీ అనుమతించడం లేదన్నారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో మనీ లాండరింగ్ ఆరోపణలపై గత వారం అరవింద్ కేజ్రీవాల్‌ను ఇడి అధికారులు అరెస్ట్ చేశారు. ఆయనకు ఈనెల 28 వరకు ఇడి కస్టడీకి అనుమతిస్తూ ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు ఆదేశాలిచ్చింది. దీంతో కేజ్రీవాల్ ఇడి కస్టీడీలో ఉన్నారు. బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం నిజాయితీగా ఉన్న ప్రతి ఒక్కరినీ లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడుతూ అవినీతి పరులను కాపుడుతుందని నిరసనల్లో పాల్గొన్న కవిత అన్నారు. కాగా, తనతో పాటు ఢిల్లీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, ఆప్‌కు చెందిన మంగోల్‌పురి ఎంఎల్ఎ రాఖి బిర్లాను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు పార్టీ సీనియర్ నేత సోమనాథ్ భారతి 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఎలాంటి కారణం లేకుండా రాఖి బిర్లా, అనేకమంది ఆప్ వలంటీరుల కేజ్రీవాల్ మద్దతుదారులను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారని, శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిని ఢిల్లీ పోలీసులు అరెస్టు చేయడం ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలో పంజాబ్ మంత్రి బెయిన్స్‌తో పాటు పార్టీ సీనియర్ సభ్యుడు రీనా గుప్తా కూడా ఉన్నారు. అయితే ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ రాజీనామా చేయాలని బిజెపి ఢిల్లీ యూనిట్ మంగళవారం నిరసన ప్రదర్శనకు దిగింది. ఈ నేపథ్యంలో లోక్‌కల్యాణ్ మార్గ్ ప్రాంతంలోనే కాకుండా ఢిల్లీలో పలు ప్రదేశాల్లో భారీ ఎత్తున పోలీసులు, పారామిలిటరీ దళాలను మోహరించారు. నిరసనలకు అనుమతి లేదన్నారు. పటేల్ చౌక్ మెట్రో స్టేషన్ వద్ద నిరసన తెలిజేసేందుకు ఆందోళనకారులు వచ్చే అవకాశం ఉందని తమకు సమాచారం రావడంతో పటిష్ట భద్రతా ఏర్పాటు చేశామని డిసిపి దేవేష్ కుమార్ చెప్పారు. ఒకవేళ తమ ఆదేశాలను ఖాతరు చేయకుండా పటేల్ చౌక్‌కు వచ్చి నిరసన తెలియజేయాలని చూస్తే తక్షణమే వారిని అదుపులోకి తీసుకుంటామని హెచ్చరించారు. అదే విధంగా భద్రతా కారణాల రీత్యా లోక్ కల్యాణ్ మార్గ్ మెట్రో స్టేషన్ ప్రవేశ, నిష్క్రమణ ద్వారాలను మూసివేసినట్లు ఢిల్లీ మెట్రోరైల్ కార్పొరేషన్ (డిఎంఆర్‌సి) 'ఎక్స్' వేదికగా వెల్లడించింది. పటేల్ చౌక్ ఎంట్రీ, ఎగ్జిట్ వద్ద, సెంట్రల్ సెక్రటేరియట్ మెట్రో స్టేషన్ల వద్ద కూడా ఆంక్షలు విధించామన్నారు. ఆప్ నాయకులు, కార్యకర్తల నిరసనల కారణంగా సెంట్రల్ ఢిల్లీ సహా కొన్ని ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తే అవకాశముందని ట్రాఫిక్ అధికారులు తెలిపారు. ప్రయాణికులను ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాల్సిందిగా సూచించారు.

# చర్చకు సిద్ధమా? (మొదటి పేజీ తరువాయి)

ఖండించారు. అసలు సినిమా ముందుందని, బిఆర్ఎస్ హాయంలో జరిగిన అవినీతిని బయటపెడతామని, మీ తప్పులన్నీ బయట పెట్టాక తలకాయ ఎక్కడ పెట్టుకుంటారని ప్రశ్నించారు. హరీశ్ రావు సచివాలయాన్ని ముట్టడిస్తామని అంటున్నారని, గత పదేళ్లలో రాష్ట్ర ఖజానాను బిఆర్ఎస్ నాయకులు ముట్టడించారని, ఇప్పుడు చేసేదేం లేక సచివాలయం ముట్టడిస్తామని అంటున్నారని ఎద్దేవా చేశారు. రాయలసీమకు నీళ్ళు తరలించుకుపోతుంటే గుడ్లు అప్పగించి చూసారని, కొత్త ప్రాజెక్ట్ లను పూర్తి చేయలేదని... పాత ప్రాజెక్ట్ ల నిర్వహణను గాలికి వదిలేసారని ధ్వజమెత్తారు. పది సంవత్సరాల్లో ఎప్పుడైనా పంట నష్టానికి పరిహారం ఇచ్చారా? ఇన్ పుట్ సబ్సిడీ, పంటల బీమాను అమలు చేశారా ? అని నిలదీశారు. పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధి కోసమే హరీశ్‌రావు అబద్ధాలు మాట్లాడుతున్నారని అన్నారు. రైతులను ఆదుకుంటాం: పంట నీటి ఎద్దడితో పంట నష్టపోయిన రైతన్నలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి జూపల్లి తెలిపారు. పంట నష్టంపై సిఎం రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి, పంట నష్టంపై సమగ్ర నివేదిక అందజేయాలని అధికారులను ఆదేశించారని గుర్తు చేశారు. నివేదిక రాగానే రైతులకు ఎకరానికి రూ. 10 వేల నష్ట పరిహారం చెల్లిస్తామని, వచ్చే వాన కాలం సీజన్ నుంచి పంటల బీమా పథకాన్ని అమలు చేస్తామని పేర్కొన్నారు. అన్నదాతల కష్టాలు, కడగండ్లు గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాపమేనని, బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక తెలంగాణ రాష్ట్రంలో రైతు ఆత్మహత్యలు ఆగలేదని, గత పదేండ్లలో 6, 651 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం మాదే అని ధీమా వ్యక్తం చేశారు.

# కదులుతున్న డొంక

(మొదటి పేజీ తరువాయి)

అంశాలతో ఈ కేసు ముడిపడి ఉండడంతో ఆ దిశగానే పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగానే ఇది వరకు కౌంటర్ ఇంటెలిజెన్స్ విభాగంలోపనిచేసిన ఎసిపి పర్యవేక్షణలో పంజాగుట్ట పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. ప్రణీత్‌రావును విచారించే సమయంలో ఫిర్యాదు దారు అదనపు ఎస్‌పి రమేష్ కూడా అక్కడే ఉన్నట్టు తెలిసింది. ఈ విచారణలో ఒక ఎసిబి అధికారి పేరు బయటికి వచ్చింది. అయితే మరో ఇద్దరు నిందితులను తమ కస్టడీకి తీసుకుని విచారిస్తే మరిన్ని ముఖ్య విషయాలు వెలుగులోనికి వస్తాయని దర్యాప్తు బృందం భావిస్తోంది. అందుకే నాంపల్లి కోర్టులో కస్టడీ పిటిషన్‌ను దాఖలు చేశారు. అయితే ఇప్పటి వరకు పోలీసు అధికారి ఫిర్యాదు మేరకే కేసు విచారణ కొనసాగుతుండగా, తాజాగా రాజకీయ నాయకులు కూడా ఫోన్ ట్యాపింగ్‌పై ఫిర్యాదు చేస్తున్నారు. ఫోన్ ట్యాపింగ్ కు ఆధునీక పరికరాలను ఉపయోగించడం, కొందరు రాజకీయ నాయకులను లక్ష్యంగా చేసుకోని వారి వ్యక్తిగత జీవితంపై కూడా నిఘా పెట్టినట్టు విచారణలో వెల్లడవుతున్నాయి. దీంతో రాజకీయ వర్గాల్లో ఫోన్ ట్యాపింగ్ అంశం పెద్ద చర్చనీయంశంగా మారింది. ముఖ్యంగా బిఆర్ఎస్‌కు చెందిన కొందరు నేతలపై కూడా ఫోన్ ట్యాపింగ్ జరిగినట్టు ప్రచారం జరుగుతుండడంతో ఆ పార్టీలోని ముఖ్యనేతలు కూడా ఆందోళన చెందుతున్నారు. కొందరు గత ప్రభుత్వంలో ఉన్న మంత్రుల సూచనల మేరకు ఆయా జిల్లాలకు చెందిన ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకుల ఫోన్‌ను ట్యాపింగ్ చేసినట్టు తెలిసింది.

### గతంలోనే 'ఫోన్ ట్యాపింగ్'పై విమర్శలు ''వాట్సాప్ కాల్''లోనే సంభాషణలు

రాజకయంగా తమను ఎదుర్కొనే శక్తి లేకపోవడంతోనే తమ కదలికలపైన నిఘా పెట్టారని, తమ ఫోన్లను ట్యాపింగ్ చేస్తున్నారని గతంలోనే ప్రతిపక్ష పార్టీలకు చెందిన కొందరు నేతలు బాహాటంగానే విమర్శలు చేశారు. ప్రస్తుత సిఎం, టిపిసిసి అధ్యక్షునిగా రేవంత్ రెడ్డి ఫోన్ ట్యాపింగ్, కదలికలపై నిఘా పెట్టారని అనేక మార్లు విమర్శలు చేసిన విషయం తెలిసిందే. తమ రాజకీయ కార్యాచరణకు చెందిన ముఖ్య అంశాలు బయటికి వెళ్తున్నాయని, తమకు కొంత ఆర్థికంగా ఆదుకునే వారిని వేధింపులకు గురిచేస్తున్నారని కొందరు నేతలు ముఖ్యమైన అంశాలను కేవలం 'వాట్సాప్' కాల్ ద్వారానే మాట్లాడేవారు. ఇటీవల శాసనసభ ఎన్నికల తర్వాత సచివాలయం వద్ద జరిగిన ఉద్యోగుల సంబురాల్లో టిజెస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ హాజరయ్యారు. ఇక నుండి ''మనం'' స్వేచ్ఛగా మాట్లాడొచ్చని, ఎవరినైనా ఎక్కడైనా కలువొచ్చని, ముఖ్యంగా వాట్సాప్ కాల్‌లో సంభాషించాల్సిన అవసరం లేదని వ్యాఖ్యనించిన విషయం తెలిసిందే.

### 'సమగ్ర విచారణ'కు రాజకీయ పార్టీల డిమాండ్

ఫోన్ ట్యాపింగ్ కేసుపై సమగ్రంగా ప్రత్యేక విచారణ జరిపించాలని అధికార కాంగ్రెస్, సిపిఐతో పాటు పలువురు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. అయితే సిట్టింగ్ జడ్జితో లేదా సిబిఐతో విచారణను చేపట్టాలని బిజెపి నాయకులు డిమాండ్ చేస్తున్నారు. గత ప్రభుత్వంలో ఉన్నవారు తమను టార్గెట్ చేశారని, ఇటువంటి చర్యలను ఉపేక్షించొద్దని వారు పేర్కొంటున్నారు.

### 'నిందితుల కస్టడీ పిటిషన్'పై నేడు విచారణ

ఫోన్ ట్యాపింగ్ కేసులోని నిందితులను పోలీసు కస్టడీకి ఇవ్వాలన్న పిటిషన్‌పై విచారణను నాంపల్లి న్యాయస్థానం బుధవారానికి వాయిదా వేసింది. ఈ కేసులో అరెస్టయిన అదనపు ఎస్‌పిలు భుజంగరావు, తిరుపతన్న, మాజీ డిఎస్‌పి ప్రణీత్ రావులను కస్టడీకి ఇవ్వాలని పంజాగుట్ట పోలీసులు నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపైన ఇరువైపుల వాదనలు విన్న న్యాయస్థానం, పోలీస్ కస్టడీ వ్యవహారంపై నిందితులను కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. ఈ కేసులోని నిందితులు, పనిలో పనిగా ఫోన్ ట్యాపింగ్‌ను తమ సొంత అవసరాలకు వాడుకున్నట్లుగా భావిస్తున్న పోలీసులు, బడా వ్యాపారవేత్తలు, హవాలా దందా చేసే వారిని బెదిరించి డబ్బులు తీసుకున్నట్టు అనుమానిస్తున్నారు. ముగ్గురు నిందితులను కస్టడీలోకి తీసుకొని విచారిస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని వారు న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లగా, కౌంటర్ దాఖలు చేయాలని నిందితులను కోర్టు ఆదేశించింది. వామపక్ష తీవ్రవాదంపై కన్నేసేందుకు సమకూర్చుకున్న అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రాజకీయ నాయకుల ఫోన్లు ట్యాప్ చేసేందుకు ఉపయోగించారని ఈ కేసులో ప్రధాన అభియోగం.

ఎన్నికల సమయంలో పట్టుకున్న డబ్బులో ప్రతిపక్షాలకు చెందినదే ఎక్కువగా ఉన్నదని, ఫోన్ ట్యాపింగ్ ద్వారానే ఇది సాధ్యమైందని పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రణీత్‌రావు బృందం తన సొంత ప్రయోజనాలకు కూడా ట్యాపింగ్‌ను వాడుకున్నట్లు తెలుస్తోంది. ఫోన్ ట్యాపింగ్‌తో హవాలా, స్థిరాస్తి వ్యాపారాలపై నిఘా పెట్టి భారీగా డబ్బు దండుకున్నట్లుగా అనుమానిస్తున్నారు.

## 29న టిపిసిసి కీలక సమావేశం

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** గాంధీభవన్‌లో ఈ నెల 29న సాయంత్రం 5 గంటలకు గాంధీ టిపిసిసి కార్యవర్గ సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి టిపిసిసి అధ్యక్షుల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎఐసిసి ఇంచార్జ్ దీపాదాస్ మున్షి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఎఐసిసి కార్యదర్శులు, సీనియర్ నాయకులు హాజరుకానున్నారు.



సమావేశం ఎజెండాపై చర్చించేందుకు టిపిసిఇస అధ్యక్షులు రేవంత్ రెడ్డితో ఆయన నివాసంలో టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్, ఎంఎల్‌సి మహేశ్ కుమార్ గౌడ్ మంగళవారం సమావేశమయ్యారు.ఈ సందర్భంగా పార్లమెంట్ ఎన్నికలు, తాజా రాజకీయ అంశాలపై వారిరువురు చర్చించినట్లు సమాచారం. ఈ నెల 29న జరిగే సమావేశంలో పార్లమెంటు ఎన్నికల ప్రచారంతో పాటు, తుక్కుగూడ బహిరంగసభ ఏర్పాట్లపై చర్చించనున్నారు.

## బిజెపిని నిలువరించేది కమ్యూనిస్టులే

### కొత్తగూడెం ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు

**ప్రజాపక్షం/ భద్రాద్రి కొత్తగూడెం :** రాష్ట్రంలో బిజెపి అడుగుపెట్టకుండా నిలువరించే సత్తా కమ్యూనిస్టులకే ఉందని కొత్తగూడెం శాసన సభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. కొత్తగూడెం నియోజక వర్గ స్థాయి ముఖ్యనాయకుల సమావేశం మంగళవారం పాల్వంచలోని చంద్ర రాజేశ్వరరావు భవన్‌లో జరిగింది. ఈ సమావేశానికి




ముఖ్య అతిథిగా హాజరైన కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ పదేళ్ల మోడీ పాలన ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పనంగా కట్టబెట్టడంతోనే సాగిందన్నారు. కులాలు, మతాల మధ్య చిచ్చుపెడుతూ పబ్బం గడుపుతున్నారన్నారు. దేశంలో ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయని, ఉన్నవారు మరింత ఉన్నవారుగా, పేదలు మరింత పేదలుగా మారుతున్నారన్నారు. కనీసం రెండు పూటలు తిండి తినలేని దౌర్భగ్య పరిస్థితులు దేశంలో ఏర్పడుతున్నాయన్నారు. మోడీని గద్దెదించే లక్ష్యంతో కార్యకర్తలు పని చేయాలని , ప్రజలను చైతన్యవంతులను చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. మోడీ పాలనలో తెలంగాణకు అడుగడుగునా అన్యాయం జరుగుతుందన్నారు. బిజెపి పాలిత అనుకూల రాష్ట్రాలకు దోచి పెడుతూ తెలంగాణ పట్ల వివక్ష ప్రదర్శిస్తుందన్నారు. రాజ్యాంగ పరమైన పాలన సాగాలి కాని సొంత ఎజెండాను ప్రజలపై రుద్ది పరిపాలిస్తే కమ్యూనిస్టులు చూస్తూ ఊరుకోమన్నారు. దేశంలో ధరలు నానాటికి పైకి పోతున్నాయి తప్ప వాటిని నిలువరించడంలో మోడీ విఫలమయ్యారన్నారు. ఖమ్మం, మహబూబాబాద్ స్థానాల్లో బిజెపియేతర అభ్యర్థులదే విజయం అన్నారు. సార్వత్రిక ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలని కూనంనేని పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, సలిగాంటి శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యులు డి. శేషయ్య, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఎ. సాయి బాబా, వాసిరెడ్డి మురళి, వీరస్వామి, భూక్యా దస్రు, మల్లికార్జున్, నాగేశ్వరరావు, పద్మజ, రాహుల్, నగేష్, కొండలరావు, జమలయ్య, లక్ష్మి పతి, హన్మంతరావు, రాములు, శ్రీను, వెంకటేశ్వర్లు, హరీష్ తదితరులు పాల్గొన్నారు.



## బిజెపితో దోస్తానా చెయ్యకపోతే అరెస్టులు

### మాజీ మంత్రి,ఎమ్మెల్యే హరీశ్ రావ్

**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి :** బీజేపీతో దోస్తానా చెయ్యకపోతే అక్రమంగా అరెస్టుచేస్తుందని,బీజేపీ కుట్రలో భాగంగానే ఎమ్మెల్సీ కవిత, కేజ్రీవాల్ ను అరెస్టు చేశారని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తూ పాలన సాగిస్తున్నారని మాజీ మంత్రి,ఎమ్మెల్యే హరీశ్ రావ్ ఆరోపించారు. మంగళవారం మెదక్ బీఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, బీఆర్ ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్ రామిరెడ్డి,నాయకులు ఫారూఖ్ హుస్సేన్, శ్రీనివాస్, తిరుపతి రెడ్డిలతో కలిసి మాజీమంత్రి ఎమ్మెల్యే హరీశ్ రావు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ ఎస్ పార్టీ ఒకే ఎజెండాతో పనిచేస్తుందని తెలంగాణ హక్కులను కాపాడేది కేసిఆర్ ఒక్కరే నని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ ఓటర్లను నమ్మించి మోసం చేసిందని,కాంగ్రెస్ పార్టీ పంటలు ఎండుతుంటే నాయకులు ఢిల్లీ చుట్టూ తిరుగు తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపక్ష నాయకులను విమర్శిస్తున్నాడని కేసులు పెడుతున్నడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఎన్నికల హామీలను ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. 15 వేల రైతు బంధు వచ్చిన వాళ్ళు కాంగ్రెస్ కు ఓటు వేయండని, రాని వాళ్ళు బిఆర్ఎస్ కు ఓటు వేయాలని సూచించారు.నాలుగు నెలల పాలనలో 180 మంది రైతులు, 38 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకున్నారని అన్నారు. కాంగ్రెస్ నేతలు ఒక్కరిని పరామర్శించ లేదని విమర్శించారు. పార్టీలో చేరికల పై ప్రేమ ఉంది తప్ప, రైతులను నట్టేట ముంచిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను ముంచిన కాంగ్రెస్ పార్టీని తప్పకుండా ఓడించాలన్నారు. ఇవన్నీ అమలు కావాలంటే ప్రశ్నించే గొంతుక బిఆర్ఎస్ అధికారంలోకి రావాలన్నారు.రాహుల్ గాంధీ కవిత అరెస్టలను ఖండిస్తే, రేవంత్ మాత్రం కవిత అరెస్ట్ పట్ల కామెంట్స్ చేశాడని దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ముఖ్యమంత్రినా లేక బిజెపి ముఖ్యమంత్రి ఆ అర్థం కావడం లేదని మండిపడ్డారు. ఎంపీ ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని సూచించారు.

# అన్నింటా సామాజిక న్యాయం

### ధర్మభిక్షం ఆకాంక్ష అదే : వర్ధంతి సభలో సిపిఐ జాతీయ కార్యదర్శి, సయ్యద్ అజీజ్ పాషా

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాజకీయ పార్టీలలో, సమాజంలో అన్ని స్థాయిలో సామాజిక న్యాయం ఉండాలని బొమ్మగాని ధర్మభిక్షం బలంగా అభిప్రాయపడేవారని సిపిఐ జాతీయ కార్యదర్శి , మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా అన్నారు. ఎవరు ఆపద వచ్చినా ధర్మభిక్షం వద్దకు వెళ్లేవారని, ఆయన పరిష్కారం చూపేవారని పేర్కొన్నారు. కమ్యూనిస్టు పార్టీలను వ్యతిరేకించేవారు కూడా ధర్మభిక్షం మాటను గౌరవించేవారన్నారు. హైదరాబాద్ హిమాయత్ నగర్ మగ్దూం భవన్‌లో మంగళవారం స్వాతంత్ర్య సమర యోధులు, ప్రముఖ కమ్యూనిస్టు, గీత పనివారల ఉద్యమ నిర్మాత, మాజీ ఎంపి బొమ్మగాని ధర్మభిక్షం 13వ వర్ధంతి సభ జరిగింది. సభకు గీత పనివారల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన సభలో అజీజ్ పాషాతో పాటు సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎన్.బాలమల్లేష్, గీత పనివారల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.జి.సాయిలు గౌడ్, సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, అయిప్సో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవిఎల్, గీత పనివారల సంఘం కార్య నిర్వహక కార్యదర్శి బొమ్మగాని నాగభూషణం తదితరులు హాజరయ్యారు. తొలుత ధర్మభిక్షం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో అజీజ్ పాషా మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ సామాజిక కూర్పుపై ఆలోచన చేసి, తన అభిప్రాయాన్ని విశ్లేషణాత్మకంగా వివరించి ఒప్పించిన వ్యక్తి ధర్మభిక్షం అని కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన కాకినాడ రాష్ట్ర మహాసభలో పార్టీ లో సామాజిక కూర్పుపై



ధర్మభిక్షం చైతన్యవంతమైన ప్రసంగం చేశారని గుర్తు చేశారు. బొమ్మగాని ధర్మభిక్షం ప్రోత్సహంతోనే తాను కమ్యూనిస్టుగా మారినట్లు వెల్లడించారు. అన్ని రాజకీయ పార్టీలలో ఆయన శిష్యులు ఉన్నారన్నారు. అందరికీ అనుకూలంగా ఉన్న వ్యక్తి ధర్మభిక్షం అన్నారు. ఒక అంశాన్ని ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు ధర్మభిక్షంను పార్టీ నాయకత్వం పంపిన విషయాన్ని గుర్తు చేశారు. ధర్మభిక్షం చేసిన పనిలో కొంత వరకు అమలు చేసినా, పార్టీకి, సమాజానికి మెలు జరుగుతుందన్నారు.

**ట్యాంక్ బండ్‌పై ధర్మభిక్షం విగ్రహం ఏర్పాటుకు కృషి**

ట్యాంక్ బండ్‌పై ధర్మభిక్షం విగ్రహం ఏర్పాటు చేయాలని, ఈ అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకుపోతామని చాడ వెంకట్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ నగరంలో 50 ఎకరాల స్థలంలో తెలంగాణ రైతాంగ పోరాట స్మృతి వనం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని చాడ వెంకట్ రెడ్డి కోరారు. ఎన్ని పదవులు చేపట్టిన ఎలాంటి గర్వం లేని వ్యక్తిత్వంతో నిగర్విగా ధర్మభిక్షం పేరు తెచ్చుకున్నారని అన్నారు. గీత పనివారాల సంఘాన్ని దేశవ్యాప్తంగా విస్తరించారని గుర్తు చేశారు. హైదరాబాద్‌లో సభలు నిర్వహిస్తే వేలాదిమంది కార్మికులు తరలివచ్చేవరని గుర్తు చేశారు. గీత కార్మికులకు ఇప్పటికీ ఆయన సాధించిన హక్కులే అమలవుతున్నాయని తెలిపారు. ఎదైనా పట్టుబడితే సాధించే వరకు వదిలే వారు కాదన్నారు. విద్యార్థి నాయకునిగా, కార్మిక నాయకునిగా అనేక రంగాలలో బహుముఖ ప్రజ్ఞాశాలిగా, ప్రజల మనిషి గా గుర్తింపు తెచ్చుకున్నారని అన్నారు. దోపిడి రహిత సమాజం కోసం కృషి చేశారన్నారు. ధర్మభిక్షం ఆయాలను సాధించేందుకు కృషి చేద్దామని చాడ వెంకట్ రెడ్డి అన్నారు. బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ విద్యార్థి నాయకునిగా ప్రస్థానాన్ని ప్రారంభించిన ధర్మభిక్షం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులుగా, ఎంఎల్ ఏ, ఎంపిగా, కార్మిక నాయకునిగా అనేక రంగాలలో సేవలు అందించారని కొనియాడారు. ఈ సభలో గీత పనివారల యువజన సంఘం కన్వీనర్ మారగోని ప్రవీణ్ కుమార్ గౌడ్, ఐఎల్ నాయకులు రామ్మూర్తి, ఉపాధ్యాయ సంఘం నాయకులు కోటి రెడ్డి తదితరులు హాజరయ్యారు.

## బిఆర్‌ఎస్‌ను బిజెపిలో విలీనం చేయడం ఖాయం

**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** పార్లమెంట్ ఎన్నికల తర్వాత బిఆర్ఎస్ పార్టీని బిజెపిలో విలీనం చేయడం ఖాయమని కాంగ్రెస్ ఎంఎల్‌ఏ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. కెటిఆర్ అన్నట్లుగా బిజెపిలోకి



ఖర్మ మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేదన్నారు.ఇప్పటికే బిఆర్ఎస్ సగం ఖాళీ అయిందని, ఎంపి ఎన్నికల తర్వాత పూర్తిగా వాష్ అవుట్ అవుతుందని హెచ్చరించారు.ఎంపి ఎన్నికల్లో బిజెపితో బిఆర్ఎస్ లోపాయికారీ ఒప్పందం చేసుకున్న విషయం అందరికీ తెలుసునని అన్నారు. గాంధీభవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ మతి భ్రమించి మాట్లాడుతున్నాడని న్నారు. ముఖ్యమంత్రిని ఉద్దేశించి చేసిన పరుష పదజాలాన్ని తీవ్రంగా ఖండించారు. కెటిఆర్ బుర్ర పని చేయడం లేదని, తీవ్ర నిరాశ నిస్పృహాలో కెటిఆర్ నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. కెటిఆర్ నోటి దురుసు తగ్గించుకోకపోతే నాలుక చీరేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే కవిత తీహార్ జైల్లో ఉన్నదని, కెటిఆర్ కూడా చంచల్ గూడ కుపోవడానికి సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. ఫోన్ ట్యాపింగ్ విచారణ జరుగుతుంటే కెటిఆర్, ఆయన కుటుంబం ఎందుకు వణుకుతుందని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ తో బెదిరించి మీరు చేయించిన వసూళ్ల జాబితా బైటికి వస్తుందని, కెటిఆర్ సిద్ధంగా ఉండాలని అన్నారు.

# టెట్‌కు దరఖాస్తు ఫీజు తగ్గించాలి

### 33 జిల్లాల్లో టెట్ పరీక్షాకేంద్రాలు ఏర్పాటు చేయాలి

### ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఫీజు తగ్గించాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టెట్‌కు దరఖాస్తు ఫీజును తగ్గించాలని, ఫీజు తగ్గింపు ప్రకటన తరువాతే దరఖాస్తులను తీసుకోవాలని, 33 జిల్లాల్లో టెట్ పరీక్షాకేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరుతూ ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో మంగళవారం టెట్, రాష్ట్ర విద్య పరిశోధన శిక్షణ సంస్థ డైరెక్టర్ ఎం. రాధ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ధర్మేంద్ర మాట్లాడుతూ విద్యాహక్కు (ఆర్‌టిఈ) చట్టం ప్రకారం, జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి (ఎన్‌సిటిఈ) రూపొందించిన మార్గదర్శకాల ప్రకారం ప్రభుత్వం నిర్వహించే టెట్ పరీక్షలో అభ్యర్థి ఉతీర్ణత సాధిస్తేనే డిఎస్‌సి రాయడానికి అర్హులు అనే నిబంధనల మేరకు గత ప్రభుత్వంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష నిర్వహించారని తెలిపారు. ఇప్పుడు టెట్ పరీక్ష దరఖాస్తు ఫీజు పెంపుతో పేద, మధ్యతరగతి అభ్యర్థులపై ఆర్థిక భారం పడుతుందన్నారు. గత ప్రభుత్వంలో టెట్ ఒక పేపరు దరఖాస్తు ఫీజు రూ.200, రెండు పేపర్లకు రూ.300 ఫీజుగా ఉండేదని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం టెట్ ఒక పేపర్‌కు రూ.1,000, రెండు పేపర్ల ఫీజును రూ.2,000 పెంచడం సరికాదన్నారు. కేవలం 11 జిల్లా కేంద్రాల్లోనే టెట్ పరీక్ష ఉంటుందని అధికారులు ప్రకటించారని, దీనివల్ల మిగతా జిల్లాల అభ్యర్థులకు దూరభారంతో పాటు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కుంటారని ఆందోళన వ్యక్తం చేశారు.




మొత్తం 33 జిల్లాల్లోనూ పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయాలని ధర్మేంద్ర డిమాండ్ చేశారు. అసలే నిరుద్యోగం, పలు పాఠశాలల్లో నామమాత్రపు వేతనాలతో కుటుంబాన్ని పోషించుకుంటున్న ఉపాధ్యాయులు, మెగా డిఎస్‌సిపై ఆశలు పెంచుకొని, కోచింగ్ సెంటర్ లలో కష్టపడి చదువుదామని అనుకుంటున్న సమయంలో ఈ ఫీజు వారికి భారంగా తయారయ్యాయని అన్నారు. అధిక ఫీజులు లేకుండా పోటీపరీక్షలు నిర్వహిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో లో చెప్పిందని, ఇప్పుడు పెద్దమొత్తంలో ఫీజులు నిర్ణయించడంతో నిరుద్యోగులు అసంతృప్తితో ఉన్నారన్నారు. ఏడు లక్షల మంది నిరుద్యోగుల సమస్యను పరిగణనలోకి తీసుకుని పెంచిన టెట్ పరీక్ష ఫీజులను తగ్గించాలని ధర్మేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీమాన్ పాల్గొన్నారు.

**నిరుద్యోగులపై ఆర్థిక భారం మోపడం సరికాదు : మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మ ణ్**

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు పరీక్ష ఫీజు అధికంగా పెంచడం వల్ల నిరుద్యోగులపై పెను భారం పడుతుందని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మ ణ్ అన్నారు. గతంలో ఒక పేపర్ రాస్తే రూ.200, 2 పేపర్లు రాస్తే రూ. 300 ఫీజు ఉండేదని, కానీ ఇప్పుడు ఒక పేపర్‌కి రూ. 1000, రెండు పేపర్లు రాస్తే రూ. 2000 ఫీజు పెంచడం సరికాదని మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రవేశ పరీక్షలు ఫీజులు తగ్గించి, తక్కువ ఫీజులతో పోటీ పరీక్షలు నిర్వహిస్తామన్నారని, కానీ ఎన్నికల హామీకి విరుద్ధంగా ఫీజులు పెంచారని అన్నారు.

లక్షలాది మంది నిరుద్యోగ అభ్యర్థులు టెట్ పరీక్షకు సన్నద్ధమవుతున్నారని, ఇప్పటికే బిఆర్ఎస్ పాలనలో పరీక్ష ఫీజులు చెల్లించి, కోచింగ్ తీసుకొని పరీక్షల్లో అవకతవకలతో నిరుద్యోగులపై తీవ్రమైన ఆర్థికభారం పడిందన్నారు. బుధవారం నుంచి టెట్ పరీక్ష ఫీజు చెల్లింపు, దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో పాత ఫీజునే తీసుకోవాలని కోరారు.

పరీక్ష కేంద్రాలను కూడా నిరుద్యోగులకు అందుబాటులో ఉండే విధంగా సెంటర్‌ల సంఖ్య కూడా పెంచాలని, దీని వల్ల నిరుద్యోగులపై ప్రయాణ భారం తగ్గుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులు అండగా ఉండాలని, ప్రభుత్వ ం, అధికారులు పెంచిన టెట్ పరీక్ష ఫీజు తగ్గించాలని మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మ ణ్ కోరారు.

# త్యాగాల పార్టీ కాంగ్రెస్ : మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/గోవిందరావుపేటః** త్యాగాల పార్టీ కాంగ్రెస్ అని తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. మంగళవారం గోవిందరావుపేట మండల కేంద్రంలోని కాకతీయ కమ్మ సేవా సంఘంలో మండలాధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ అధ్యక్షతన పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించగా అట్టి సమావేశానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క, మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ విచ్చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ కాంగెరస్ పార్టీ అంటేనే త్యాగాల పార్టీ అని, భారతదేశానికి స్వాతంత్ర్య ం తెచ్చి భరతమాత నుదిట సింధూరం దిద్దిన ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ, అటువంటి కాంగ్రెస్ పార్టీ కొందరు నాయకులు విమర్శించడం సిగ్గుచేటని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నో ఆర్థిక సంస్కరణలు, పంచవర్ష ప్రణాళికలు, ప్రాజెక్టులు, రాజభరణాల తొలగింపు, బ్యాంకింగ్ వ్యవస్థ, భూ సంస్కరణల చట్టం, పేదలకు భూములకు




పంపిణీ వ్యవసాయాభివృద్ధి భారీ, మధ్య తరహా పరిశ్రమలను నెలకొల్పడం, ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ, రైతులకు ఉచిత విద్యుత్, లక్ష రూపాయల పంట రుణమాఫీ, ఆహార భద్రత చట్టం, అటవీ హక్కుల చట్టం, ఇందిరా క్రాంతి పథం, డ్వాక్రా రుణాలు, పేద ప్రజల అభివృద్ధి కొరకు ఎన్నో అత్యుత్తమ పథకాలు రూపొందించిన అత్యుత్తమ పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రె స్ అభ్యర్థి పోరిక బలరాంనాయక మంచి వ్యక్తిత్వం ఉన్న వ్యక్తి అని, ఇదివరకు కాంగ్రెస్ హయంలో కేంద్రమంత్రిగా ఉన్నప్పుడు ములుగు నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధిలోకి తీసుకొచ్చాడని తెలిపారు. ఎలా అయితే తనను గెలిపించారో అదేవిధంగా బలరాంనాయక్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మ న్ మల్లాది రాంరెడ్డి, రాజేందర్ గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బానోత్ రవిచందర్, జిల్లా ఉపాధ్యక్షులు పాశం మాధవరెడ్డి, మహి ళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు రేగ కళ్యాణి, ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు దాసరి సుధాకర్, మండల ఉపాధ్యక్షులు హరి ప్రసాద్, ఎస్‌టి సెల్ జిల్లా ఉపాధ్యక్షులు కుర్సం కన్నయ్య, కిసాన్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల ప్రభాకర్ లు పాల్గొన్నారు.



## కష్టకాలంలో అండగా ఉన్నవాళ్లే నాయకులు: కెటిఆర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** విద్యుత్, రైతుబంధు,మహిళలకు రూ.2500, పెన్షన్ రూ.4000ల స్కీములను అమలు చేయకుండా 'ఫోన్ ట్యాపింగ్, స్కాములు' అంటూ సిఎం రేవంత్ రెడ్డి వార్తలు రాపించుకుంటున్నారని బిఆర్ఎస్ వర్కింగ్‌ప్రెసిడెంట్ కెటి.రామారావు ఆరోపించారు. చేతిలో అధికారం ఉన్నదని'ఏం చేస్తావో చెయ్, ఎవరెవరు, తప్పులు చేసినా వాళ్ళ పైన చర్యలు తీసుకో' అని రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం జరిగిన సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సమావేశంలో కెటిఆర్ హాజరయ్యారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ సికింద్రాబాద్ లోక్‌సభ అభ్యర్థి పద్మారవుగౌడ్, ఎంఎల్ఎలు తలసాని శ్రీనివాస్ యాదవ్, మాగంటి గోపినాథ్,ముఠగోపాల్, రావులశ్రీధర్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ కష్టకాలంలో అండగా ఉన్నవాళ్లే నాయకులని, దానం నాగేందర్ అధికారం కోసం ఆశపడి, గెలిపించిన ప్రజలకు ద్రోహంచేసి వెళ్లారన్నారు. గతంలో ఆసిఫ్ నగర్ నుండి పోటీచేసి ఓడిపోయిన పరిస్థితి మళ్ళీ పునరావృత్తం అవుతుందన్నారు. దానం నాగేందర్‌పైన అనర్హత వేటు విషయంలో స్పీకర్ వెంటనే నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రమంత్రిగా కిషన్ రెడ్డి చేసిన అతిపెద్ద మూడు పనులు కురుకురే ప్యాకెట్లు పంచడం, సీతాఫల్‌మండిలో రైల్వే లిఫ్ట్‌ను ప్రారంభిచండం, సింటెక్స్ ట్యాంకులను ఓపెన్ చేయడమే కిషన్ రెడ్డి కేంద్ర మంత్రిగా అతి పెద్ద మూడు పనులు అని ఎద్దేవా చేశారు.

# తాగునీటికి ఇబ్బందులు లేవు : శాంతి కుమారి

**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** గత సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా రాష్ట్రం లోని మూడు ప్రధాన రిజర్వాయర్లలో సరిపడా నీటి లభ్యత ఉన్నందున ప్రస్తుత వేసవిలో తాగునీటికి ఏ విధమైన ఇబ్బందులు లేవని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి స్పష్టం చేశారు. రాష్ట్రంలో తాగునీటి సరఫరాపై జిల్లా కలెక్టర్లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు.



రాష్ట్ర పురపాలక , పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, పంచాయితీ రాజ్, గ్రామీణాభివద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, మున్సిపల్ శాఖ డైరెక్టర్ దివ్య, జల మండలి ఎండి సుదర్శన్ రెడ్డి తదితర అధికారులు ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి.ఎస్. శాంతి కుమారి మాట్లాడుతూ, రాష్ట్రంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ఇప్పటికే ''సమ్మర్ యాక్షన్ ప్లాన్''ను రూపొందించి జిల్లాలకు తగు నిధులను కూడా విడుదల చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో తాగునీటి సరఫరాకు ఏ విధమైన ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఇప్పటికే బోరు బావుల ఫ్లషింగ్, పైపుల మరమ్మతులు చేపట్టడం పూర్తి చేయడం జరిగిందని చెప్పారు అయితే, నిర్వహణ పరమైన లోపాలను ఎప్పటికప్పుడు వెంటనే సవరించి నిరంతర నీటి సరఫరాకు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్లకు సూచించారు. ప్రతీరోజు గ్రామాలు, పట్టణాలలోతాగు నీటి సరఫరాపై సంబంధిత క్షేత్ర స్థాయి అధికారులు, నోడల్ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించాలని తెలియచేసారు. వేసవి కాల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మంజూరు చేసిన పనులన్నీ సకాలంలో పూర్తి చేసేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రధానం గా ఆపరేషన్, మెయింటెనెన్స్ లపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.

**గతంలో లాగే నీటి మట్టాలు :** ఇతర రాష్ట్రాలలో ఎదురవుతున్నతాగునీటి సమస్యను మన రాష్ట్రానికి కూడా అన్వయిస్తూ ఆందోళనకరమైన వార్తా కథనాలు వస్తున్నాయని, అయితే, రాష్ట్రంలో ఈసారి లోటు వర్షపాతం ఉన్నా, ఇక్కడి ప్రధాన జలాశయాలు, ఎస్ఆర్ఎస్పి, శ్రీ పాద ఎల్లంపల్లి, నాగార్జున సాగర్ ల లో గత సంవత్సరం మాదిరిగానే నీటి మట్టాలు ఉన్నందున ఆందోళన అవసరం లేదని శాంతికుమారి తెలిపారు. అయినప్పటికీ ప్రత్యామ్నా య ఏర్పాట్లను కూడా రూపొందించుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. కొన్ని మున్సిపాలిటీలు, గ్రామాల్లో నిర్వహణపరంగా లోపాలు వచ్చాయని, ఈ లోపాలను వెంటనే పరిష్కరించడం జరిగిందని అన్నారు. నీటి సమస్యలపై వివిధ మాధ్యమాల ద్వారా వచ్చే వార్తలపై వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని తెలిపా రు.

**ఏప్రిల్ రెండవ వారం నుండి ఎమర్జెన్సీ పంపింగ్**


ఏప్రిల్ రెండవ వారం అనంతరం రిజర్వాయర్ల నుండి ఎమర్జెన్సీ పంపింగ్ ను చేపడతామని సిఎస్ శాంతి కుమారి తెలియచేసారు. హైదరాబాద్ మహా నగరంలో కూడా సరిపడా నీటి సరఫరా చేస్తున్నామని, అయితే, కమర్షియల్ అవసరాల నిమిత్తం డిమాండ్ ఎక్కువగా ఉందని జలమండలి అధికారులు తెలిపారు.

# పాలమూరులో ద్విముఖ పోరేనా?

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధిః** పార్లమెంట్ ఎన్నికలకు రోజులు దగ్గర పడుతున్నకొద్దీ ప్రధాన పార్టీలన్ని అభ్యర్థులను ప్రకటించి ప్రచారంలో దూసుకుపోతున్నాయి. ముఖ్యంగా జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బిజెపిలు పార్లమెంట్ నియెజకవర్గంలో ఒక దఫా ప్రచారాన్ని కూడా ముగించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్ధిని ప్రకటించకముందునుంచే పాలమూరు న్యాయ యాత్ర పేరిట నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్‌ల పరిధిలో ప్రచారాన్ని నిర్వహించారు. ముగింపు సమావేశానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన బహిరంగ సభకు హజరై కాంగ్రెస్ కార్యకర్తల్లో నూతన ఉత్సాహం నింపారు. మహబూబ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన ప్రజాదీవెన సభకంటే ముందే సిఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గిలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తూ అక్కడ నిర్వహించిన బహిరంగసభలో రాష్ట్రంలోనే మొట్టమొదటి కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు అభ్యర్థిగా చల్లా వంశీచంద్‌రెడ్డిని ప్రకటించారు. దాదాపుగా నెలరోజులు ఉంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తూ సభలు, సమావేశాలు నిర్వహిస్తూ బిజీగా ఉన్నారు. ముఖ్యంగా పాలమూరు జిల్లాకే చెందిన సిఎం రేవంత్‌రెడ్డి మహబూబ్‌నగర్ పార్లమెంటు నియోజకవర్గానికి ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తూ గెలుపు కోసం వ్యూహాలు రచిస్తున్నారు. అందులో భాగంగానే ఇటీవల బిజెపి సీనియర్ నాయకులు మాజీ ఎంపి ఎపి జితేందర్ రెడ్డిని సైతం పార్టీలో చేర్చుకున్నారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా పరిషత్ చైర్మన్ స్వర్ణ సుధాకర్ రెడ్డిని సైతం కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో అందరూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులే ఎంఎల్‌ఎలుగా గెలుపొందడంతో ఎలాగైనా మహబూబ్‌నగర్ పార్లమెంటు నియోజకవర్గంలో భారీ ఆధిక్యతతో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని వ్యూహాలు రచిస్తున్నారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్







అభ్యర్థికి ధీటుగా ప్రచారాన్ని నిర్వహించాలనే వ్యూహంతో బిజెపి అభ్యరి డికె అరుణ ముందుకు వెళుతున్నారు. వికసిత భారత్ పేరిట గత నెలరోజుల నుండి బిజెపి నాయకులు ఆయా నియోజకవర్గాల్లో ప్రచారం నిర్వహిస్తూనే ఉన్నారు. ఇటీవల వరకు అభ్యర్థి ఎవరనే విషయమై కొంత సందిగ్ధం ఏర్పడింది. బిజెపి రాష్ట్ర కోశాధికారి బండారి శాంతి కుమార్, బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణ, జాతీయ నాయకులు ఎపి జితేందర్ రెడ్డిలు తమకంటే తమకే టికెట్లు కేటాయిస్తారన్న ధీమాలో ప్రచారం నిర్వహిస్తూ వచ్చారు. తీరా జాతీయ ఉపాధ్యక్షురాలు డిరు అరుణకు టికెట్లు కేటాయించడంతో శాంతికుమార్ మౌనంగా ఉన్నప్పటికీ, ఎపి జితేందర్‌రెడ్డి మాత్రం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా నిర్వహించిన డికె అరుణకు నియోజకవర్గ వ్యాప్తంగా మంచి పరిచయాలు ఉన్నాయి. గత ఎన్నికల్లో మక్తల్ నియోజకవర్గం నుండి టిఆర్‌ఎస్ ఎంఎల్‌ఏగా వ్యవహరించిన చిట్టెం రామ్మోహన్ రెడ్డి స్వయనా తమ్ముడు కావడం, ప్రస్తుత నారాయణపేట కాంగ్రెస్ ఎంఎల్‌ఏ పర్ణిక రెడ్డి తన సొంత తమ్ముడి కూతురు కావడం కలిసి వస్తుందని లెక్కలు వేసుకుంటున్నారు. ఇక టిఆర్ఎస్ అభ్యర్థిగా ప్రస్తుత పార్లమెంటు సభ్యులు మన్నే శ్రీనివాస్ రెడ్డి ని ప్రకటించినప్పటికీ నేటికీ ప్రచారం ప్రారంభించలేదు. టిఆర్ఎస్ క్యాడర్ అంతా ఒక్కొక్కరుగా కాంగ్రెస్ పార్టీలో చేరిపోతుండడంతో దిక్కుతోచని స్థితిలో టిఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

గతంలో మహబూబ్‌నగర్ పార్లమెంటు నియోజకవర్గంలోని ఏడు సెగ్మెంట్లలో ఏడుగురు టిఆర్ఎస్ పార్టీకి చెందిన ఎంఎల్‌ఏలే ఉండడంతో గెలుపు సునాయాసమైంది. అయితే ఈ మారు పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. సొంత అన్న కుమారుడు మన్నె జీవన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ ఎంఎల్‌సి అభ్యర్థిగా పోటి చేస్తున్నారు. ముఖ్యమంత్రి మహబూబ్‌నగర్ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ముగ్గురు అభ్యర్థులు రంగంలో ఉన్నప్పటికి కాంగ్రెస్, బిజెపిల మధ్య ప్రధాన పార్టీ ఉంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

ప్రజాపక్షం

బుధవారం, మార్చి 27

# రంజాన్ – కాల్పుల విరమణ

ఆధునిక ప్రపంచంలో ఆందోళనకరంగా కొనసాగుతున్న రణక్షేత్రాల్లో ప్రధానమైనవి ఉక్రేన్–రష్యా యుద్ధరంగం, పాలస్తీనాలో భాగమైన గాజా ప్రాంతంపై తీవ్రవాదులను రూపుమాపే పేరుతో ఇజ్రాయిల్ కొన్ని మాసాలుగా కొనసాగిస్తున్న విధ్వంసకర బాంబు దాడులు; జనహననం. ఈ రెండు క్షేత్రాలు రగులుతూ ఉండటానికి అమెరికన్ సామ్రాజ్యవాదులు, నాటో కూటమిలోని వారి తైనాతీలే కారణం. పాలస్తీనా సమస్య దాదాపు 8 దశాబ్దాల నాటిది. రెండవ ప్రపంచయుద్ధకాలంలో జర్మన్ నాజీల ఊచకోతకు గురవుతున్న యూదుల్లో కొందరిని అమెరికా తెచ్చి పశ్చిమాసియాలో పడేసింది. వారు అంచెలంచెలుగా సంఖ్యాబలం పెంచుకుంటూ పాలస్తీనియన్‌లను వారి మాతృభూభాగం నుంచి చాలామేరకు తరిమివేశారు. లక్షలాదిమంది యూదులు ఇరుగుపొరుగు అరబ్ రాజ్యాలకు పారిపోయి చెట్టుకొకరు పుట్టకొకరు అయినారు. కొన్ని లక్షలమంది తమ భూభాగంలోనే ఉన్నారు. రెండవ ప్రపంచ యుద్ధానంతరం అగ్రరాజ్యాలు పూనుకుంటే అప్పుడే పరిష్కారం సాధ్యమై ఉండేది. అయితే ఆనాటి ప్రచ్ఛన్నయుద్ధ వాతావరణంలో అమెరికా ఇజ్రాయిల్‌ను అరబ్ ప్రపంచానికి పక్కలో బల్లెంగా పెంచిపోషించింది. 1969నాటి పశ్చిమాసియా యుద్ధం పరిస్థితిని మరీ క్షీణింపజేసింది. యుద్ధం ఆరంభం కాకమునుపే ఇజ్రాయిల్ ఈజిప్టు, సిరియా, లెబనాన్ తదితర అరబ్ రాజ్యాల వైమానిక దళ స్థావరాలపై బాంబులువేసి వాటి సైనిక శక్తిని ధ్వంసం చేసింది, అరబ్ భూభాగాలను ఆక్రమించుకుంది. జిమ్మీకార్టర్ హయాంలో క్యాంప్ డేవిడ్ చర్చలు వగైరా ప్రయత్నాలు జరిగినా ఆక్రమిత భూభాగాలను ఖాళీ చేయటానికి ఇజ్రాయిల్ తిరస్కరించటంతో అవి ఫలప్రదం కాలేదు. తర్వాత కొంతకాలానికి ఇజ్రాయిల్‌ను స్వతంత్ర రాజ్యంగా గుర్తించేందుకు అరబ్ రాజ్యాలు అంగీకరించినా వివాదం అలాగే ఉండిపోయింది. కాకపోతే రమోల పాలనాకేంద్రంగా పాలస్తీనా అథారిటీ ఏర్పడింది. అందులో భాగంగా ఉండిన గాజా ప్రాంతంలో హమస్ తీవ్రవాదులు ఎన్నికల్లో పైచేయి సాధించి స్వతంత్రంగా వ్యవహరిస్తున్నారు. ఒక వైపు పాలస్తీనా వెస్ట్‌బ్యాంక్ ఇతర అరబ్ భూభాగాల్లో ఇజ్రాయిల్ వలస కేంద్రాలు నిర్మించి యూదులతో నింపటంతోపాటు, రెండోవైపున గాజాలోకి రాకపోకలు ఇజ్రాయిల్ ఆక్రమిత ప్రాంతాలగుండా సాగాలి. ఇజ్రాయిల్ విధించే ఆంక్షలు, హింస, తీవ్రవాదం పెరుగుదలకు హేతువైంది. ప్రస్తుత ఏకపక్ష యుద్ధాన్ని అవగాహన చేసుకోవటానికి ఈ చరిత్ర రేఖామాత్రంగా ప్రస్తావించాల్సి వచ్చింది.

హమస్ తీవ్రవాదులు అక్టోబర్ 7న దక్షిణ ఇజ్రాయిల్‌లో ఆకస్మికదాడిలో కొందరు ఇజ్రాయిలీలను బందీ చేశారు. వారి విడుదలను డిమాండ్ చేస్తూ తీవ్రవాదుల నిర్మూలనకై ఇజ్రాయిల్ గాజాలో జనావాస ప్రాంతాలపై నెలల తరబడి బాంబులు కురిపిస్తున్నది. ఆసుపత్రులు, ఆహార సరఫరాలను సైతం ధ్వంసం చేసింది. 32,000 మంది పాలస్తీనియన్‌లు మృత్యువాత పడినట్లు గాజా హోంమంత్రిత్వశాఖ తెలియజేస్తున్నది. లక్షలాదిమందిని రఫా నగరంలోకి తరిమివేసింది. బందీల్లో మిగిలినవారిని విడుదల చేయకపోతే ఆ పట్టణంపై భూతలయుద్ధానికి, బాంబుదాడులకు యూదు దురహంకార ఇజ్రాయిల్ అమెరికాను ఒప్పించే ప్రయత్నంలో ఉంది. కాల్పుల విరమణకు అమెరికా, ఈజిప్టు, కటార్ సంప్రదింపుల పేరుతో కాలయాపన చేస్తున్న అమెరికా భద్రతామండలిలో తక్షణ పోరాట విరమణ పిలుపుకు సిద్ధం కాలేదు. ఇంతలో ముస్లింలకు పవిత్రమైన రంజాన్ మాసం మొదలైంది. కాల్పుల విరమణ ప్రయత్నాలు మొదలైనాయి. బందీల విడుదలతో ముడిపెట్టి అమెరికా ప్రతిపాదించిన 'తక్షణం, నిలకడైన కాల్పుల విరమణ' తీర్మానాన్ని గతవారం రష్యా, చైనా వీటో చేశాయి. కాగా రంజాన్ మాసంలో (ఏప్రిల్ 9తో ముగుస్తుంది) కాల్పుల విరమణకు ఆదేశించిన మరో తీర్మానాన్ని 14–0తో భద్రతామండలి సోమవారం ఆమోదించింది. అమెరికా వీటో చేయలేదు, ఓటింగ్‌లో పాల్గొనలేదు. హమాస్ నిర్బంధంలోని బందీల విడుదలను ఈ తీర్మానంతో సంధానించకపోవటంపట్ల ఆగ్రహించిన ఇజ్రాయిల్ ప్రధాని బెంజామిన్ నెతన్యాహు తమ అమెరికా పర్యటన రద్దు చేసుకున్నారు. అగ్రరాజ్యాలు ఏదో ఒక పక్షం కొమ్ముకాయకుండా మానవతా దృక్పథంతో అరబ్, పాలస్తీనా, ఇజ్రాయిల్ సహజీవనానికి హామీఇచ్చే ఒప్పందాన్ని సాధించటమే పశ్చిమాసియాలో శాశ్వతశాంతి స్థాపనకు మార్గం.

ఉక్రేన్–రష్యా యుద్ధానికి ముగింపు సాధించాల్సి ఉంది. అమెరికా, యూరప్ ఉక్రేన్‌కు పూర్తి అండగా నిలబడనట్లయితే ఈ వినాశక యుద్ధం ఎప్పుడో ముగిసేది. రష్యా తన సరిహద్దులకు రక్షణ కోరుతూ నాటోలో చేరే ఉక్రేన్ ప్రయత్నాలను వ్యతిరేకిస్తోంది. రష్యాను ఆర్థికంగా, సైనికంగా బలహీనపరిచే అవకాశంగా అమెరికా, మిత్రరాజ్యాలు లక్షలకోట్ల ధనం, ఆయుధాలు ఉక్రేన్‌లో కుమ్మరిస్తున్నాయి. చర్చల ద్వారా పరిష్కరించుకోవలసిన సమస్య యుద్ధందాకా వెళ్లి రెండేళ్లుగా అపారంగా ఆస్తి, మానవ నష్టం కలుగజేస్తున్నది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను దెబ్బకొడుతున్నది. ఇప్పటికైనా విజ్ఞత మేల్కోవాలి. తటస్థ రాజ్యాలైనా చొరవ తీసుకుని శాంతి స్థాపనకు రష్యా, ఉక్రేన్‌లను ఒప్పించాలి.

# మోడీ అణచివేతను ఆప్ తిప్పికొట్టగలదా?

**హరిహర్ స్వరూప్**

అతడు అవినీతి వ్యతిరేక పోరాటంలో హీరో. ప్రజాదరణగలిగిన నాయకుడు, ఇవాళ తనపై అవినీతి ఆరోపణలపై పోరాటం చేస్తున్నాడు. అతడే, మద్యం విధానం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అరెస్టు చేసిన ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్. ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత రాజకీయ జీవితంలో ఇది మరో నాటకీయమైన ఉదంతం.

కేజ్రీవాల్ పుష్కరకాలం క్రితం అవినీతి వ్యతిరేక పోరాటంలో క్రియాశీల కార్యకర్తగా ముందుకువచ్చారు. 2011లో ఢిల్లీలో అన్నా హజారేను రెండుసార్లు నిరాహారదీక్షకు కూర్చోబెట్టిన వ్యక్తి కేజ్రీవాల్. రాజకీయ నాయకులందరూ అవినీతిపరులని ఆరోపిస్తూ, అవినీతికి కళ్లెం వేయటానికి 'జన్ లోక్‌పాల్'ను డిమాండ్ చేసిన సందర్భం అది. రోజంతా మీడియా కవరేజితో అన్నాహజారే, కేజ్రీవాల్ ఇద్దరూ ప్రసిద్ధులై యుపిఎ ప్రభుత్వానికి ముచ్చెమటలు పోయించారు. విస్తృతమైన సంస్థాగత నిర్మాణం కలిగిన బిజెపి అన్నా ఉద్యమం సందర్భంలో ఆచితూచి వ్యవహరించినప్పటికీ, కాంగ్రెస్ వ్యతిరేక ప్రజామనోగతాన్ని నరేంద్రమోడీ ప్రధానమంత్రి అభ్యర్థిగా 2014 లోక్‌సభ ఎన్నికల్లో పూర్తిగా తనకు లాభసాటిగా వినియోగించుకుంది.

ఇదిలావుండగా, ప్రజలకు స్వచ్ఛమైన పాలనను అందించే వాగ్దానంతో కేజ్రీవాల్ ఎఎపి(ఆప్) ఏర్పాటు చేశారు. ఢిల్లీ అసెంబ్లీకి 2013 ఎన్నికల్లో ఆయన కాంగ్రెస్ ముఖ్యమంత్రి షీలాదీక్షిత్‌ను ఓడించటంతోపాటు అసెంబ్లీలోని 70 సీట్లలో 28 గెలుచుకున్నారు. అకాలీదళ్‌తో పొత్తుతో బిజెపి 32సీట్లు గెలిచినా మ్యాజిక్ ఫిగర్ చేరుకోలేకపోయింది. కేజ్రీవాల్ 8మంది సభ్యులుగల కాంగ్రెస్ తోడ్పాటుతో ముఖ్యమంత్రి పీఠం అలంకరించారు. 49రోజులు తర్వాత, తన జనలోక్‌పాల్ బిల్లుకు ఢిల్లీ అసెంబ్లీ అడ్డుపడుతుందనే కారణంతో ఆయన నాటకీయంగా రాజీనామా చేశారు.

కేజ్రీవాల్ దృష్టి అప్పుడు జాతీయ రాజకీయాలపై పడింది. 2014 లోక్‌సభ ఎన్నికల్లో వారణాసిలో నరేంద్రమోడీపై పోటీ చేశారు. సుమారు 2.7లక్షల ఓట్ల తేడాతో ఓడిపోయినప్పటికీ, ఆయనకు 2.09లక్షల ఓట్లు లభించాయి. ఇది ఆయన ప్రతిష్టను మరికొంత పెంచింది.

2015 ఆరంభంలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ 70లో 67 సీట్లు గెలిచి అద్భుతం సృష్టించింది. బిజెపి మూడంటే మూడు సీట్లకు పరిమితం కాగా కాంగ్రెస్ ఖాతా తెరవలేదు. అయితే అధికారం చేబట్టిన కొద్ది నెలల్లోనే కేజ్రీవాల్, ''పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు' ఆరోపణతో ప్రశాంత్ భూషణ్, యోగేంద్ర యాదవ్‌లను పార్టీనుంచి బయటకు పంపారు. భూషణ్ దీన్ని నియంతృత్వంగా విమర్శిస్తూ, పార్టీని 'ఖాప్'గా దిగజార్చారని ఆరోపించారు.

కేజ్రీవాల్ ప్రతిష్ట 'ప్రజాస్వామ్యవాది' అనే పేరునుంచి తన అభిమానులతో పార్టీని నియంత్రించాలని కోరుకుంటున్న నియంతగా దిగజారింది. అయితే 2014–19 మధ్య విద్యుచ్ఛక్తి, నీటి సరఫరా సబ్సిడీలు కొనసాగించటం, ప్రభుత్వ స్కూళ్లు, ఆసుపత్రుల స్థితిగతులను మెరుగుపరచటంవల్ల భావజాల శషభిషలకు పోకుండా సేవలు అందచేస్తున్న నాయకునిగా ఆయన ప్రజాదరణ చూరగొన్నారు. లోక్‌పాల్ డిమాండ్ క్రమంగా అంతర్ధానమైంది.

అయితే కేజ్రీవాల్ ప్రజాకర్షణ 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఆప్‌కు ఢిల్లీలో ఒక్కసీటు గెలిపించలేకపోయింది. మొత్తం 7 సీట్లు బిజెపి వశమైనాయి. కాని 2020 ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో 62 సీట్లతో ఆప్ ఢిల్లీని తిరిగి తన ఖాతాలో వేసుకుంది. బిజెపికి 8సీట్లే వచ్చాయి.

కథ ఢిల్లీకే పరిమితం కాలేదు. ఇతర రాష్ట్రాలకు పార్టీని విస్తరించే ప్రయత్నాలు ప్రారంభించిన కేజ్రీవాల్, 2022లో పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో 118లో 92 సీట్ల గెలుపుతో ఆప్‌ను అధికారంలోకి తెచ్చారు. కాంగ్రెస్ పరిస్థితి 18సీట్లకు దిగజారింది. గుజరాత్‌లో కూడా ఐదు సీట్లు గెలుచుకుని పార్టీకి పునాదులు వేశారు. 182సీట్లలో కాంగ్రెస్‌కు 17 సీట్లు దక్కగా, 156సీట్లతో బిజెపి ఘనవిజయం సాధించింది.

కాంగ్రెస్ బలహీనపడిన ఉత్తరాది రాష్ట్రాల్లో ఆ స్థానాన్ని భర్తీ చేయాలన్నది ఆప్ ఆకాంక్ష. ఇప్పుడు ఒక ధృవంగా ఉన్న పార్టీని భవిష్యత్‌లో బిజెపికి ప్రత్యామ్నాయం చేయటం లక్ష్యం. అవినీతిపేరుతో నాయకుణ్ణి అప్రతిష్ట పాల్జేయటం ద్వారా ఆప్‌ను మొగ్గలోనే తుంచివేయాలన్నది బిజెపి వ్యూహం. మోడీ ప్రభుత్వ ఇ డి మార్చి 21న ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను అరెస్టు చేసింది. 28వ తేదీ వరకు ఇ డి కస్టడీ విధించబడింది. న్యాయపోరాటం కొనసాగుతుంది. అయితే రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఢిల్లీ, పంజాబ్ ఓటర్లు బ్యాలెట్ బాక్స్ వద్ద ఎలా స్పందిస్తారో చూడాలి.



సుశీల్ కుట్టీ ఇలా రాస్తున్నారు :

ఢిల్లీ మద్యం విధాన కేసులో కేజ్రీవాల్ అరెస్టుకు దారితీసిన నాటకీయ పరిణామాలను అలావుంచితే, ఆమ్ ఆద్మీ పార్టీకి ఇంతకన్నా క్లిష్ట సమయంలో ఈ అరెస్టు రాదు. దీన్ని బిజెపి 'కేవలం లీగల్ మేటర్' అంటుండగా; ఢిల్లీలో పార్లమెంటు ఎన్నికల్లో తమ అవకాశాలను దెబ్బతీయటానికి బిజెపి పన్నిన 'రాజకీయ కుట్ర' అని ఆప్ అంటోంది. ఈ పర్యాయం ఇండియా కూటమిలో భాగస్వాములుగా ఆప్ 4, కాంగ్రెస్ 3 సీట్లు పోటీచేసే ఒప్పందం జరిగింది. అందువల్ల 2014, 2019లోలాగా బిజెపి 7 సీట్లనూ తుడిచిపెట్టే అవకాశం లేదు.

అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు తర్వాత ప్రధానమంత్రి మోడీకి ఢిల్లీ బంగారుబాతులా కాకుండా మామూలు కోడి అయితే ఆయన పరువేమికాను? ఢిల్లీ ఓటర్లు కేజ్రీవాల్‌కు తమ సానుభూతితో పాటు ఓట్లు కూడా ఇవ్వవచ్చు. ఆప్ ఈ సంక్షోభ సమయంలో దీన్నొక ఆశారేఖగా చూస్తోంది. అయితే ఒత్తిడి కింద ఆప్ కుప్పకూలవచ్చు కూడా. చాలామంది ప్రాంతీయ నాయకులవలె కేజ్రీవాల్ తన వారసులను సిద్ధంగా ఉంచలేదు. పైగా యోగేంద్రయాదవ్, కిరణ్ బేడీ, ప్రశాంత్ భూషణ్, కుమార్ విశ్వాస్–ఇలా చాలామందిని బయటకు పంపారు. కేజ్రీవాల్ తన స్థానాన్ని చేబట్టేవారిని నిర్ణయించకపోతే – విధేయుల కూటమి కావచ్చు లేదా భార్య కావచ్చు – పార్టీ నష్టపోతుంది.

సునీతా కేజ్రీవాల్ శనివారంనాడు రాజకీయ రంగప్రవేశం చేశారు. కేజ్రీవాల్‌ను బెయిలుపై విడుదల చేయకుండా జ్యుడీషియల్ కస్టడీ విధిస్తే ఏమి జరుగుతుందో ఢిల్లీ వారసులను అప్రమత్తం చేశారు. ముఖ్యమంత్రి కేజ్రీవాల్ భార్య ఆయన తరఫున 'దేశవ్యాప్త భారతీయులను' ఉద్దేశించి ప్రసంగించారు. ఆయన తిరిగి వస్తారన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఆమె కూర్చున్న గది వెనుక గోడపై కేజ్రీవాల్ హీరోలు బాబాసాహెబ్ భీంరావు అంబేద్కర్, షహీద్ భగత్‌సింగ్ ఫోటోలున్నాయి.ఆ గది దాదాపు ఢిల్లీ ముఖ్యమంత్రి గదిలా అనిపించింది.

ఇ డి సమన్‌లను తిరస్కరిస్తూ తన అరెస్టు వాయిదా వేస్తూ వచ్చిన కేజ్రీవాల్, సార్వత్రిక ఎన్నికలకు ముందు తాను ఎంచుకున్న సమయంలోనే అరెస్టు అయినట్లున్నారు. ఢిల్లీ మద్యం విధానం కేసును ఇ డి రెండేండ్లుగా దర్యాప్తు చేస్తోంది. ఇ డి సమన్‌లకు కేజ్రీవాల్ సమాధానాలిచ్చి వుండవచ్చు. కాని వాయిదాలమీద వాయిదాలు వేసి ఎన్నికల ముంగిట అరెస్టు కావటమే రాజకీయం. ఆప్ అధినేత సానుభూతితోపాటు ఓట్లు ఆశిస్తున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ కనుసన్నల్లో కేంద్ర దర్యాప్తు సంస్థలు కొన్ని సంవత్సరాలుగా అప్రతిష్ట మూటగట్టుకుంటున్నాయి. వాటితీరుపై అంతర్జాతీయ దృష్టి కూడా పడింది. ఉదాహరణకు, కేజ్రీవాల్‌కు 'స్వేచ్ఛాయుతమైన, సబబైన విచారణ' లభించాలని జర్మన్ విదేశాంగశాఖ భారత ప్రభుత్వాన్ని కోరింది. దీన్ని 'విదేశీ జోక్యం'గా కొట్టిపారేయలేరు. అయితే అది ఎవరితప్పు? పలు విదేశీ ప్రభుత్వాలు జర్మనీని అనుసరించవచ్చు. భారత ప్రజలు కొత్త ప్రభుత్వాన్ని ఎన్నుకునే సమయంలో ప్రపంచం కళ్లు ఇండియాపై ఉన్నాయని గమనించాలి. కేజ్రీవాల్ అరెస్టు ప్రతిపక్ష ఐక్యతను వాస్తవం చేసింది.

ఒకాయన రాసినట్లుగా, ఓటర్లు ఇప్పుడు ఎగిరే బంతిలా ఉన్నారు. అంటే ఢిల్లీ ఓటర్లలో పెద్దభాగం 'ఎటూ నిర్ణయించుకోని ఓటర్లు'గా ఉన్నారు. కేజ్రీవాల్ అరెస్టు వారిని ప్రభావితం చేయవచ్చు.

ఒక దశలో కేజ్రీవాల్ తప్పు అంచనా వేశారు. పర్యవసానంగా ప్రత్యర్థి బిజెపి ఆప్‌కు అవినీతిరంగులు పులిమి మూలకు నెట్టింది. ముఖ్యమంత్రిగా కొనసాగుతూ తిహార్ జైలునుండి పరిపాలన సాగిస్తాననే కేజ్రీవాల్ ఆలోచన వివేకరహితం.

మోడీ ప్రభుత్వం ఆప్ ప్రభుత్వాన్ని రద్దు చేసే అవకాశమిచ్చినట్లవుతుంది. ఆప్ కొత్త ముఖ్యమంత్రిని ఎంచుకోవాలి, ఢిల్లీలో పాలన కొనసాగించాలి. ''రాజ్యాంగం రక్షణకోసం ఆప్ బిజెపితో పోరాటం చేస్తున్నది....సుప్రీంకోర్టు ప్రజాస్వామ్యాన్ని కాపాడుతుందని ఆశిస్తున్నాము'' అంటున్నారు ఆప్ మంత్రి అతిశి మార్లేనా. ఆమెపై ఇప్పుడు ఎంతో బాధ్యత ఉంది. ముందుండి పార్టీని నడిపించటం ఇప్పుడు ఆమెముందున్న కర్తవ్యం.

(ఐపిఎ సర్వీస్)

> అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు తర్వాత ప్రధానమంత్రి మోడీకి ఢిల్లీ బంగారుబాతులా కాకుండా మామూలు కోడి అయితే ఆయన పరువేమికాను? ఢిల్లీ ఓటర్లు కేజ్రీవాల్‌కు తమ సానుభూతితో పాటు ఓట్లు కూడా ఇవ్వవచ్చు. ఆప్ ఈ సంక్షోభ సమయంలో దీన్నొక ఆశారేఖగా చూస్తోంది. అయితే ఒత్తిడి కింద ఆప్ కుప్పకూలవచ్చు కూడా. చాలామంది ప్రాంతీయ నాయకులవలె కేజ్రీవాల్ తన వారసులను సిద్ధంగా ఉంచలేదు. పైగా యోగేంద్రయాదవ్, కిరణ్ బేడీ, ప్రశాంత్ భూషణ్, కుమార్ విశ్వాస్–ఇలా చాలామందిని బయటకు పంపారు. కేజ్రీవాల్ తన స్థానాన్ని చేబట్టేవారిని నిర్ణయించకపోతే – విధేయుల కూటమి కావచ్చు లేదా భార్య కావచ్చు – పార్టీ నష్టపోతుంది.

# రంగస్థలం పునర్వైభవం పొందుతుందా!

1961లో అంతర్జాతీయ రంగస్థల సంస్థ (ఇంటర్నేషనల్ థియేటర్ ఇనిస్టిట్యూట్, ఐటిఐ) చొరవతో రంగస్థల ప్రాధాన్యం, సమాజ పరివర్తనంలో ప్రత్యక్ష పాత్రను నిర్వహించడం లాంటి లక్ష్యాలతో ప్రతి ఏట 27 మార్చిన ప్రపంచ దేశాలు ప్రపంచ రంగస్థల దినోత్సవం (వరల్డ్ థియేటర్ డే)ను పాటించుట ఆనవాయితీగా మారింది. ప్రపంచ రంగస్థల దినం–2024 నినాదంగా థియేటర్ అండ్ ఎ కల్చర్ ఆఫ్ పీస్ అనే అంశాన్ని ఎంపిక చేశారు. నాటకం సార్వజనీయం, సర్వకాలీనం. ప్రాచీన కళల్లో బహుళ ప్రజాదరణ పొందిన నాటకం ప్రముఖమైంది. మన ముందున్న అనేక కళల్లో జీవితాన్ని వాస్తవంగా చూడడానికి, మానసికోల్లాసానికి రంగస్థలం ఉపయుక్తం అవుతున్నది. నేటి డిజిటల్ యుగపు వినోద విజ్ఞాన మాధ్యమాలుగా సినిమాలు, స్మార్ట్‌ఫోన్లు, గూగుల్ మాధ్యమాలు, అంతర్జాల తెరలు, ఒటిటి వేదికల వరదల్లో నాటకరంగం కొట్టుమిట్టాడుతున్నది. రంగస్థల నాటకాలు, వీధి నాట్యాలు, నాటికలు అనాదిగా మానవాళికి వినోద విజ్ఞాన వితరణ కేంద్రాలుగా సేవలు అందించడం మన గత అనుభవంగా మది పొరల్లో మధుర జ్ఞాపకాలుగా మిగిలిపోయాయి. నేడు రంగస్థలం ఆదరణ కరువై అనాథగా మారి అంతరించే దుస్థితికి చేరడం బహు విచారకరం.




**డిజిటల్ వేదికలతో వెలవెలబోతున్న రంగస్థలం:**

రంగస్థల పోషకులుగా నటులు, దర్శకులు, రచయితలు, సంగీతకారులు, గాయకులు, డిజైనర్లు, శబ్ద నిర్మాతలు, లైటింగ్/స్టేజ్/వేషధారణ నిపుణులు నాటకాన్ని సజీవరూపంగా మార్చడానికి కృషి చేయడం మనకు తెలుసు. ఒకనాడు ఓ మహా ఉద్యమ చరిత్రగా వెలిగిన రంగస్థలం ఆధునిక పోకడలతో రోజురోజుకు నిరాదరణకు గురవుతున్నది. గొప్ప చరిత్ర కలిగిన రంగస్థల దినం సందర్భంగా థియేటర్ నిపుణులు, ఔత్సాహికులు, నిర్వహణ సంస్థలు నేడు కూడా అవిరళ కృషి చేస్తున్నారు. భాష, సంస్కృతి, సరిహద్దులకు అతీతంగా రంగస్థల రూపాలు ప్రజలకు విశేష వినోదాన్ని, స్ఫూర్తిని కలిగిస్తూనే ఉన్నాయి. ప్రపంచ రంగస్థల దినం వేదికగా నాటకాలు, నాటికలు, వీధి లఘు నాటికలు ప్రదర్శించడంతో పాటు నాటక రంగ సుప్రసిద్ధ నిపుణుల సేవలకు పురస్కారాలు, నాటకాలను చూడడం, ఉచిత ప్రదర్శనలు ఏర్పాటు చేయడం, నటులకు చేయూత ఇవ్వడం, థియేటర్ ఫెస్టివల్స్ నిర్వహించడం, నాటక రంగాన్ని వివిధ మాధ్యమాల ద్వారా ప్రచారం చేయడం లాంటివి నిస్వార్థంగా కొనసాగాలి. రంగస్థల శక్తిని గ్రహించి విద్యాలయాలు, యూనివర్సిటీలు, స్వచ్ఛంధ సంస్థలు, ప్రభుత్వాలు, ప్రైవేట్ రంగాలు, పౌర సమాజం తగు చర్యలను తీసుకొని మసక బారిన నాటకంపై వెలుగులు విరజిమ్మాలి.

**నాటకం ఓ దృశ్య శ్రవణ సజీవ రూపం:**

నాటకం ప్రజలను ఏకం చేస్తుంది. రంగస్థలం సమాజాన్ని జాగృత పరుస్తుంది. సమాజ అవలక్షణాలను విమర్శిస్తూనే విరుగుడు మంత్రాన్ని బోధిస్తుంది. నాటకం ఓ వాస్తవ దృశ్య శ్రవణ రూపం. పరస్పర అవగాహన, సాంస్కృతిక వైవిధ్య ప్రాముఖ్యాన్ని కళ్లకు కట్టినట్లు చూపుతుంది నాటకం. రంగస్థలం ఉచిత నడవిజ్ఞాన వితరణ కేంద్రం. ప్రపంచ మానవాళి జీవితాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చిన నాటక రంగ కళ నేడు నిరాదరణ వరదలో కొట్టుకుపోతున్నది. నాటకరంగంలో వెలిగిన ప్రముఖ నటులు వెండితెర స్టార్లుగా వెలుగులు చిమ్ముతున్నారు. నాటకం నుంచే సినిమా పుట్టింది. ఇప్పటికీ రంగస్థల నటులు సినిమా రంగంలో రాణిస్తూనే ఉన్నారు. ఏఎన్ఆర్, ఎన్టీఆర్, నాగయ్య, ఎస్ వి రంగారావు, కోట బ్రదర్స్, జయప్రకాష్ రెడ్డి, యువ సంచలనం విజయ్ దేవరకొండ/నవీన్ పోలిశెట్టి, సందీప్ మాధవ్ లాంటి ఎందరో మన తెలుగు రంగస్థల దిగ్గజ నటులు టాలీవుడ్‌ను సుసంపన్నం చేసిన విషయం మనకు తెలుసు. అన్ని వర్గాల ప్రజలను ఏకం చేస్తూ ప్రపంచ శాంతికి ఊతం ఇస్తున్న రంగస్థలం పునర్వైభవం పొందడానికి ప్రతి ఒక్కరు తమ వంతు కృషిని చేయాలి. నాటకాన్ని మన జీవితాల్లో భాగం చేసుకోనడవాలి.

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# ప్రత్యేక కార్పొరేట్ టాక్స్‌తో నిరుద్యోగానికి చెక్

మనదేశంలో, రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య నానాటికి తీవ్ర రూపం దాల్చడంతో నిరుద్యోగుల జీవితాల్లో, వారి కుటుంబాల్లో కారు చీకట్లు కమ్ముకుంటున్నాయి. దీని మూలంగా నిరుద్యోగుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి. ఈ పరిణామాలు దేశానికి క్షేమం కాదు!. విద్యావంతుల సంఖ్య ప్రతి ఏటా పెరుగుతున్నా ఉపాధి, ఉద్యోగాలు కల్పించబడనందు వల్ల నిరుద్యోగిత రేటు పెరిగిపోతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల వేళ నిరుద్యోగుల ఓట్లు దండుకోవడానికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, నిరుద్యోగ భృతి కల్పిస్తామని హామీల వల విసిరి అధికార పీఠాన్ని అధిరోహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత పదేళ్ల పాలనలో ఆ ప్రక్రియను చిత్తశుద్ధితో చేపట్టకుండా కల్లిబొల్లి మాటలతో, అనేక లోపభూయిష్ట విధానాలతో నిర్లక్ష్యం చేస్తూ నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడినారు. స్వాతంత్ర్యం అనంతరం దేశంలో నిరుద్యోగుల పరిస్థితి ఇంతలా దిగజారడం ఇదే ప్రథమం. కరోనా సమయంలో లాక్‌డౌన్ కారణంగా లక్షలాది మంది ఉద్యోగ, ఉపాధులు కోల్పోయారు. వారిలో అనేక మందికి నేటికీ సరైన అవకాశాలు లభించలేదు. 2023–24లో స్థూల దేశీయోత్పత్తి (జిడిపి) 2019–20లో నమోదైన దానికంటే 18% అధికంగా ఉంటుందని అంచనా వేస్తున్నప్పటికీ, గత ఐదు సంవత్సరాల కాలంలో ఉద్యోగ, ఉపాధి కల్పనలో వృద్ధి లేదని 'సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ' అనే సంస్థ తెలిపింది. నిరుద్యోగుల పరిస్థితి ఇంత దారుణంగా ఉండటానికి మరో కారణం నయా సరళీకరణ విధానాల కారణంగా ఏర్పడిన పరిస్థితులతో ఆర్థిక వ్యవస్థపై ప్రభుత్వాల పెత్తనం తగ్గడం, పెట్టుబడిదారీ, ప్రైవేటీకరణ పెరగడంతో ఉద్యోగ కల్పనలో వృద్ధి సగానికి సగం తగ్గిపోయింది.




సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి వందమంది చేసే పనిని 50 మందితోనే చేయిస్తున్నారు. తక్కువ మందితో పనిచేయించుకొని ఎక్కువ లాభాలు ఆర్జించేందుకే ప్రైవేటు, కార్పొరేట్ పెట్టుబడిదారులు ప్రయత్నిస్తున్నారు. ఎక్కువ మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే ఉద్దేశ్యం వారికి ఉండదు. నయా ఉదారవాద విధానాలు అమల్లోకి తెచ్చిన ప్రభుత్వాలు ప్రైవేట్, కార్పొరేటీకరణకు పూనుకున్నాయి. లాభాల బాట నడిపే ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా అమ్మడంలో మునిగిపోయారు. ఈ నిరుద్యోగ సమస్య నిర్మూలించబడాలంటే ఉపాధి కల్పనను ఓ హక్కుగా గుర్తించాల్సిన అవసరం ఉంది. దేశంలోని నిరుద్యోగులందరికీ ఉపాధి కల్పించినప్పటికీ అందుకయ్యే ఖర్చు జిడిపిలో 3 శాతం మించదు. ఉపాధి పెరిగితే ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుంది. ఫలితంగా వస్తు ఉత్పత్తి పెరుగుతుంది, దీనివల్ల ఉద్యోగాల కల్పన పెరుగుతుంది. మరో మాటలో చెప్పాలంటే ఓ వ్యక్తికి వేతనం ఇచ్చారు అనుకోండి.. అతను దానితో తన అవసరాల కోసం వస్తువులు కొనుగోలు చేస్తాడు. వాటి ఉత్పత్తికి డిమాండ్ ఏర్పడుతుంది. ఇది మరికొందరికి ఉపాధి చూపుతుంది. ఈ ప్రక్రియలో ప్రభుత్వంపై పడే ఆర్థిక భారం చాలా స్వల్పమే. పైగా ప్రభుత్వానికి పన్నుల రూపంలో ఆదాయం పెరుగుతుంది.

ఒక వ్యక్తి నిరుద్యోగిగా ఉండటం అతడు లేదా ఆమె తప్పు కాదు. ముమ్మాటికీ ఆ వ్యక్తి జీవించే సమాజంలో ఉన్న సామాజిక వ్యవస్థది, రాజకీయ పాలనావ్యవస్థది ఆ తప్పు. అంటే ఉపాధి హక్కు ఒక సార్వత్రికమైన హక్కుగా ఉండాలి. దానికి రాజ్యాంగపరమైన గ్యారెంటీ ఉండాలి. రాజకీయ హక్కులు, పౌర హక్కులు ఏ విధంగా ప్రాథమిక హక్కులుగా గ్యారంటీ చేయబడ్డాయో అదే విధంగా ఉపాధి హక్కు కూడా గ్యారంటీ చేయబడాలి. ఉపాధి హక్కును గ్యారంటీ చేసి కనీస ప్రాథమిక ఆదాయాన్ని అమలు చేయడానికి జీడీపీలో 3శాతం కన్నా ఎక్కువ ఖర్చు కాదు. ఒక నిరుద్యోగికి కనీస వేతనం నెలకు 20 వేల చొప్పున చెల్లించాలనుకుంటే ప్రస్తుతం నిరుద్యోగిత రేటు 10% ఉంటుందని లెక్కవేస్తే దేశంలో ఉన్న నాలుగు కోట్ల మంది నిరుద్యోగులకు ఏడాదికి రూపాయలు 9.6 లక్షల కోట్లు అవసరమవుతుంది. ఇది మన జీడీపీలో 3.2శాతం. దేశంలో శ్రామిక వర్గం సంఖ్య పెరుగుదల రేటు కన్నా కూడా ఉపాధి అవకాశాల కల్పనా రేటు తక్కువగా ఉంది. ఆర్థిక వ్యవస్థపై నియంత్రణలను తొలగించడంతో ఉపాధిని హరించే సాంకేతిక పరిజ్ఞానాన్ని దిగుమతి చేసుకొని ఉపాధి అవకాశాలను కుదించడం దీనికి కారణం. దీనివలన ఉత్పాదకత వేగంగా పెరిగింది కానీ ఉపాధి అవకాశాలు దెబ్బతిన్నాయి. మరొకవైపు రైతాంగానికి వ్యవసాయంలో ఇస్తూ వస్తున్న మద్దతును, సబ్సిడీలను, రుణాలను ప్రభుత్వం ఉపసంహరించుకుంటుంది. దీని ఫలితంగా పెద్ద సంఖ్యలో చిన్న రైతులు వ్యవసాయాన్ని మానుకొని పట్టణాలకు వలసలు పోవడం మొదలు పెట్టారు. అది పట్టణాల్లో నిరుద్యోగం మరింత పెరగడానికి దోహదం చేసింది. ఇలాంటి వేళ రాజకీయ పార్టీలు సైతం అయిష్టంగానైనా ఉపాధి కల్పించడం ప్రభుత్వాల బాధ్యత అని ఒప్పుకోక తప్పడం లేదు. అది వెంటనే సాధ్యం కాదని చెబుతూ ప్రతి ఒక్కరికి కనీస ప్రాథమిక ఆదాయం కల్పించాలన్న ప్రతిపాదనను ఓట్లు దండుకోవడానికి ముందుకు తెస్తున్నాయి. కనీస ఆదాయం అనేది ప్రభుత్వాలు దయతో ఇచ్చే బిక్ష కాదు? నిజానికి ఏ నిరుద్యోగి యాచకుడు కాదు. వారికి ఉద్యోగాలు కావాలి లేదా ఉపాధి కల్పించబడాలి. వాటిని కల్పించడం ప్రభుత్వ బాధ్యత. ఆ బాధ్యతను నెరవేర్చడంలో విఫలమవుతున్నప్పుడు ఈ దేశంలో ప్రతి పౌరుడి కి గౌరవప్రదమైన జీవితం గడిపే హక్కు ఉన్నందున, ఒక హక్కుగా కనీస ప్రాథమిక ఆదాయాన్ని వాళ్లు పొందగలగాలి.

ఉపాధి హక్కు ఒక సార్వత్రికమైన హక్కుగా ఉండాలని, దాని కోసం దేశంలోని అత్యంత సంపన్నులుగా ఉన్న ఒక్క శాతం సూపర్ రిచ్‌కి ప్రభుత్వాలు రాయితీలు ఇవ్వడం మానుకొని వారిమీద సంపద పన్ను విధిస్తే సరిపోతుంది. ఈ పాటి పని కూడా ప్రభుత్వం చేయలేదంటే? అది తన బాధ్యత నుండి దూరంగా పారిపోతుందన్నమాట. గత వైఫల్యాలను అధిగమించి పుష్కలంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సృష్టించే నిమిత్తం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంపన్నులపై ప్రత్యేక పన్ను విధింపు గూర్చి ఆలోచించాలి.

మేకిరి దామోదర్,
సామాజిక విశ్లేషకులు, వరంగల్

# గగనానికి నిచ్చెన వేసిన గగారిన్



యూరి గగారిన్ అంతరిక్షంలో అడుగు పెట్టిన మొట్టమొదటి మానవుడు. నిజంగా ఇంతకు ముందు ఎవరూ వెళ్ళని చోటికి వెళ్లాడు. కేవలం 27 ఏండ్ల వయసులోనే అంతరిక్షంలోకి వెళ్లి ఖగోళశాస్త్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారు.

గగారిన్ 9, మార్చి 1931న మాస్కో సమీపంలోని ఒక చిన్న గ్రామంలో జన్మించాడు. మార్చి 27, 1968న, గగారిన్ మిగ్15 ఫైటర్ జెట్‌ను టెస్ట్‌పైలట్ చేస్తున్నప్పుడు విమానం నేలపైకి పడిపోయింది. గగారిన్ 34సంవత్సరాల చిన్నవయస్సులోనే మరణించాడు. అతని తల్లిదండ్రులు అలెక్సీ ఇవనోవిచ్ గగారిన్, అన్నా టిమోఫియెవ్నా గగారిన్. తండ్రి నైపుణ్యం కలిగిన వడ్రంగి. యూరి నలుగురు పిల్లలలో మూడవవాడు. యువకుడిగా ఉన్నప్పుడు, యూరి అంతరిక్షం, గ్రహాలపై ఆసక్తి కనబరిచాడు. అంతరిక్ష యాత్ర గురించి కలలు కనడం ప్రారంభించాడు. యూరిని అతని ఉపాధ్యాయులు తెలివైన, కష్టపడి పనిచేసే వ్యక్తిగా, కొన్నిసార్లు కొంటె కుర్రాడుగా భావించేవారు. అతని గణితం సైన్స్ ఉపాధ్యాయుడు సోవియట్ వైమానిక దళంలో యుద్ధ సమయంలో ప్రయాణించాడు. ఇది యువ గగారిన్‌పై ప్రభావం చూపింది. గగారిన్‌కు ఎగరడం అంటే ఇష్టం కాబట్టి, అతను సోవియట్ వైమానిక దళంలో చేరాడు. గగారిన్ యొక్క నైపుణ్యాలు అతన్ని ఓరెన్‌బర్గ్ ఏవియేషన్ స్కూల్‌కు నడిపించాయి, అక్కడ అతను మిగ్‌లను నడపడం నేర్చుకున్నాడు.

1960లో, విస్తృత పరిశీలన తర్వాత, సోవియట్ అంతరిక్ష కార్యక్రమానికి గగారిన్‌తో పాటు మరో 19 మంది పైలట్‌లు ఎంపికయ్యారు. కానీ అది అంత సులభం కాదు. వోస్టాక్ ప్రోగ్రామ్ యొక్క మొదటి కాస్మోనాట్ కావడానికి, గగారిన్ 'సోచి సిక్స్' అని పిలువబడే సమూహం యొక్క ఎలైట్ ట్రైనింగ్ విధానం ద్వారా వెళ్ళాడు. ఏప్రిల్ 12, 1961న, యూరి గగారిన్ బైకోనూర్ కాస్మోడ్రోమ్‌లో వోస్టాక్ 1 ఎక్కాడు. అతను మిషన్ కోసం పూర్తిగా శిక్షణ పొందినప్పటికీ, అది విజయవంతమవుతుందో లేదా విఫలమవుతుందో ఎవరికీ తెలియదు.

ప్రారంభానికి కొన్ని నిమిషాల ముందు, గగారిన్ ఒక ప్రసంగం చేశాడు, ఇందులో ఇవి ఉన్నాయి:

'మేము చాలా కాలంగా ఉద్వేగభరితంగా శిక్షణ పొందుతున్న పరీక్ష సమీపిస్తున్నందున ఇప్పుడు నా భావాన్ని వ్యక్తపరచడం కష్టమని మీరు గ్రహించాలి. ఈ విమానాన్ని చరిత్రలో మొదటిది చేయాలని సూచించినప్పుడు నాకేమి అనిపించిందో చెప్పనవసరం లేదు. అది ఆనందమా? లేదు, ఇది అంతకంటే ఎక్కువ. అహంకారం? లేదు, అది కేవలం గర్వం కాదు. నేను గొప్ప ఆనందాన్ని అనుభవించాను. విశ్వంలోకి ప్రవేశించిన మొదటి వ్యక్తి కావడం, ప్రకృతితో అపూర్వమైన ద్వంద్వ పోరాటంలో ఒంటరిగా పాల్గొనడం అంతకంటే గొప్పది ఎవరైనా కలగనగలరా? కానీ ఆ వెంటనే నేను మోస్తున్న విపరీతమైన బాధ్యత గురించి ఆలోచించాను: తరాల ప్రజలు కలలుగన్న దానిని చేయడంలో మొదటి వ్యక్తి కావడం ఆనందంగా ఉంది అన్నాడు. వోస్టాక్ గంటకు 27,400 కిలోమీటర్ల వేగంతో భూమిని చుట్టుముట్టింది. ఫ్లైట్ 108 నిమిషాల పాటు కొనసాగింది.అంతిరిక్షంలోకి వెళ్లి ఖగోళశాస్త్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారు. ఆర్డర్ ఆఫ్ లెనిన్', 'సోవియట్ యూనియన్ హీరో' బిరుదులతో పాటు దేశ, విదేశాలనుండి అనేక అవార్డులు పొందాడు.

పిన్నింటి బాలాజీ రావు
9866776286

## నేడు హైకోర్టు కొత్త భవనానికి శంకుస్థాపన

**ప్రజాపక్షం / హైదరాబాద్:** రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లో తెలంగాణ రాష్ట్ర హైకోర్టు నూతన భవన నిర్మాణానికి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ శంఖుస్థాపన చేయనున్నారు. బుధవారం సాయంత్రం 5.30 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధేతో పాటు ఇతర న్యాయమూర్తులు పాల్గొననున్నారు. ఈ మేరకు హైకోర్టు రిజిస్ట్రార్ ఒక ప్రకటన విడుదల చేశారు. శంకుస్థాపనకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. కాగా హైకోర్టు కొత్త భవనం నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వంరాజేంద్రనగర్ లో 100 ఎకరాల భూమిని స్థలం కేటాయించింది.

## 31వరకు దరఖాస్తుల స్వీకరణకు గడువు పెంపు

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** హైదరాబాద్ జిల్లాలో 2024లో గ్రూప్1 సర్వీసెస్ ఎగ్జామినేషన్‌కు హాజరు కాగోరే ఆసక్తి, అర్హత కలిగిన మైనార్టీ అభ్యర్థులకు ఉచిత కోచింగ్ నిమిత్తం స్వీకరించే దరఖాస్తుల గడువును ఈనెల 31వ తేదీ వరకు పొడిగించడం జరిగిందని హైదరాబాద్ జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి మహమ్మద్ ఇలియాస్ అహ్మద్ తెలియజేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఇక్కడ విడుదల చేసిన ఒక ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. గతంలో దరఖాస్తుల స్వీకరణ ఈనెల 7వ తేదీ నుంచి 20వరకు నిర్ణయించామని, ఇప్పుడా గడువును ఈనెల 31వరకు పొడిగించినట్లు వివరించారు. హైదరాబాద్ గన్‌ఫౌండ్రి ఏరియాలోని జామియా నిజామియా కాంప్లెక్‌లోని 3వ అంతస్తులో ఉన్న తెలంగాణ స్టేట్ మైనార్టీ స్టడీ సర్కిల్‌లో లేదా నాంపల్లి పబ్లిక్ గార్డెన్ ఎదురుగా హజ్ హౌస్ ఆరవ అంతస్తులో ఉన్నటువంటి 603 రూమ్‌లో దరఖాస్తులను సమర్పించవచ్చని ఆయన తెలియజేశారు.

## పకడ్బందీగా పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని రంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ శశాంక సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో పార్లమెంటు ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా పోలింగ్ సిబ్బందికి,అత్యవసర సేవల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ఇచ్చే ప్రక్రియ పకడ్బందీగా జరిగేందుకు పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారులు,సిబ్బందికి జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ శశాంక అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ ఎవరికి వస్తుంది అనేది అధికారులకు స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఓటర్లను గుర్తించడం, వారికి ఫారం 12 అందించి జిల్లాలో అత్యధికంగా ఓటింగ్ శాతం పెంచాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) ప్రతిమసింగ్, డిఆర్ఓ సంగీతం,పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి కృష్ణారెడ్డి, చేవెళ్ళ ఆర్‌డిఓ సాయిరాం పాల్గొన్నారు.

### రంగారెడ్డి పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియ

పార్లమెంటు ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా మంగళవారం పోలింగ్ సిబ్బందితో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె.శశాంక మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక నేతృత్వంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఎన్ఐసి హాల్ లో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు.రంగారెడ్డి జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో గల పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు (పి.ఒ),సహాయ ప్రిసైడింగ్ అధికారులు (ఎ పి ఒ )లను,ఇతర పోలింగ్ అధికారులు (ఒపి ఒ )లను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. రిజర్వ్ సిబ్బందిని కలుపుకుని జిల్లా పరిధిలోని ఎనిమిది సెగ్మెంట్లకు మొత్తం 16536 మంది పోలింగ్ సిబ్బందిని నియమిస్తూ ర్యాండమైజేషన్ జరిపారు. ఈ ర్యాండమైజేషన్ ప్రక్రియలో అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, డిఆర్ఓ సంగీత, జెడ్.పి సిఇఒ కృష్ణారెడ్డి,ఎన్ఐసి అధికారి స్వర్ణలత, మ్యాన్ పవర్ మ్యానేజ్మెంట్ నోడల్ అధికారి శ్రీలక్ష్మి,ఎన్నికల విభాగం అధికారి సైదులు పాల్గొన్నారు.

## ధర్మభిక్షంను యువత ఆదర్శంగా తీసుకోవాలి




**ప్రజాపక్షం / హయత్ నగర్ :** స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట రథసారథి కామ్రేడ్ ధర్మభిక్షం ను నేటి తరం యువత ఆదర్శంగా తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కె చందు అన్నారు. మంగళవారం మేడ్చల్ జిల్లా నాగోల్ సాయి నగర్ లోని ధర్మభిక్షం భవనం లో13 వ వర్ధంతి సభ ను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కె చందు ధర్మ రక్షణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శాఖా కార్యదర్శులు సహెదబేగం,ఆరెకంటి రాములు, శ్రీనివాస్, రాజేష్,తో పాటు నాయకులు కొమ్ము రాములు,ప్రమీల నాగేటి పద్మ స్రవంతి,నాగమణి స్వప్న ,అరుణ,కృపావరం పల్లవి సంపత్ జ్యోతి శ్రీదేవి పాల్గొన్నారు.

## ఈవెంట్ ఇండస్ట్రీ వృత్తి నైపుణ్యంతో పని చేయాలి

**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** ఈవెంట్ ఇండస్ట్రీ వృత్తి నైపుణ్యంతో పని చేయాల్సిన అవసరం ఉందని తెలంగాణ ఐటీ, ఐ&సీ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్ తెలిపారు.ఈవెంట్ ప్లానింగ్ కోసం ఏర్పాటైన గేమ్ ఛేంజర్ ఫ్లాట్ ఫారమ్ ఈవెంట్ నీడ్జ్ ను మాదాపూర్‌లోని టి హబ్ లో లాంచనంగా ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ఐటి శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ జయేష్ రంజన్, ఈవెంట్ నిడ్జ్ డేటా సెల్యూషన్స్ యండి, సీఈఓ జ్యోత్స్న కొంపల్లి , టీ హబ్ సిఓఓ అనీష్ ఆంథోనీ, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ జనరల్ ఎస్ గ్లోరీ స్వరూప, టీసీఈఐ అధ్యక్షుడు బలరాం బాబు లు విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్ మాట్లాడుతూ మెరుగైన ప్రణాళికతో మెరుగైన అమలుతో అంచనాలకు తగ్గట్టుగాఅంచనా వేసి ఈవెంట్‌లను నిర్దిష్ట బడ్జెట్‌తో ప్లాన్ చేయగలిగే సత్తా కలిగి ఉండాలని తెలిపారు.

## మినీ స్టేడియం ఏర్పాటు కోసం స్థలాన్ని పరిశీలించిన ఓఎస్‌డి

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** మినీ స్టేడియం ఏర్పాటు కోసం స్థలాన్ని పరిశీలించారు. మంగళవారం కొందుర్గు మండల కేంద్రంలో స్పోర్ట్స్ అండ్ అథారిటి ఓఎస్‌డి రవీందర్‌రెడ్డి మినీ స్టేడియం ఏర్పాటు కోసం స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఓఎస్‌డి రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడా కారులు ఎదుర్కొంటున్న సమస్యలను దూరం చేసేందుకు మినీ స్టేడియం ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మినీ స్టేడియం ఏర్పాటు చేసేందుకు 5నుండి 7:20ఎకరాల భూమి అవసరం ఉంటుందని తెలిపారు. కానీ స్థానికంగా సుమారు 11ఎకరాల వరకు స్థలం ఉందని, మినీ స్టేడియం ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తామని వివరించారు. షాద్‌నగర్ ఎంఎల్ఏ వీర్లపల్లి శంకర్ గత కొన్ని రోజుల క్రితం సంబంధిత అధికారులకు ఈ విషయంపై వివరించడం జరిగిందని, దాంతో మార్చి14న ప్రభుత్వం ఉత్తర్వులు సైతం జారీ చేసిందని పేర్కొన్నారు. డిజైన్, ఖర్చులను దృష్టిలో పెట్టుకొని అవుట్ డోరు, ఇండోర్ స్పోర్ట్స్ పోటీలను వసతి కల్పించనున్నట్లు తెలిపారు.

## కామన్ సర్వీస్ సెంటర్‌తో సహకార సంఘం సేవలు విస్తరిస్తాం

**ప్రజాపక్షం/యాచారం :** యాచారం మండల సహకార సంఘంలో కామన్ సర్వీస్ సెంటర్‌తో తమ సంఘం సేవలను విస్తరించడానికి విశేషంగా కృషి చేస్తున్నామని సహకార సంఘం చైర్మేన్ తోటిరెడ్డి రాజేంధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం యాచారం మండల కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో అయన మాట్లాడుతూ త్వరలో సహకార సంఘం కార్యాలయంలో క్రిమి సంహరక మందులు రైతులకు సరఫరా చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. మీసేవా సెంటర్ మాదిరిగా కామన్ సర్వీస్ సెంటర్ పని చేస్తుందన్నారు. రైతులందరికి సేవలను అందించడానికి తమ వంతుగా కృషి చేస్తున్నామని అన్నారు. సంఘం అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నామని అన్నారు. రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో తీరిగి చెల్లించక పోవడంతో మిగతా రైతులకు సకాలంలో రుణాలను ఇవ్వలేక పోతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం వైస్ చైర్మేన్ కారింగ్ యాదయ్య ,సిఈఓ నాగరాజు, డైరెక్టర్లు పాశ్చ భాష, మక్కపల్లి స్వరూప. మద్దెల శశికళ పాల్గొన్నారు.

# మొదటి ర్యాండమైజేషన్ పూర్తి

### జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల అధికారులు, సిబ్బంది మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి అయ్యిందని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్ తెలిపారు. తన ఛాంబర్‌లో మంగళవారం హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారుల సమక్షంలో పోలింగ్ అధికారులు, సిబ్బంది ఎన్నికల విధులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని ఆయన అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఏప్రిల్ 1, 2 తేదీల్లో నియోజక వర్గ స్థాయిలో శిక్షణ ఇవ్వాలని, ఎన్నికల విధులు నిర్వహించే పోస్టల్ బ్యాలెట్ అందించి పోస్టల్ బ్యాలెట్‌పై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి మొత్తం 3,986 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో హైదరాబాద్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సికింద్రాబాద్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి హేమంత్ కేశవ్ పాటిల్, ఎన్నికల అదనపు కమిషనర్ మంగతాయారు, శిక్షణ నోడల్ అధికారి సునంద, డిప్యూటీ కలెక్టర్ అర్చన, జిల్లా స్థాయి శిక్షణ అధికారులు మమత, సౌజన్య పాల్గొన్నారు.

### వీధి కుక్కల బెడద నివారణకు పటిష్టమైన చర్యలు

నగరంలో వీధి కుక్కల బెడద నుండి ప్రజలు రక్షించేందుకు జిహెచ్ఎంసి పటిష్టమైన చర్యలు చేపట్టిందని జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్ తెలిపారు. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో మంగళవారం అదనపు కమిషనర్ ఎన్. రవి కిరణ్, వెటర్నరీ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమావేశమై వీధి కుక్కల బెడద, కుక్క కాటు నివారణకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా రోనాల్డ్ రోస్ మాట్లాడుతూ వీధికుక్కల ప్రమాదాల బారిన పడకుండా ప్రజలకు రక్షణ కల్పించడానికి వెటర్నరీ శాఖ వీధి కుక్కలకు స్టెరిలైజేషన్, యాంటి బర్త్ కంట్రోల్ (ఎబిసి) చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వీధి కుక్కలకు రెగ్యులర్‌గా వ్యాక్సిన్ వేయాలని వెటర్నరీ అధికారులకు సూచించారు. కుక్కల దాడులు ఏవిధంగా ఎందుకు జరుగుతున్నాయనే దాని పై అధ్యయనం చేయాలన్నారు. ఈ సమావేశంలో చీఫ్ వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ అబ్దుల్ వకీల్, బ్లూ క్రాస్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు అక్కినేని అమల, కుమారి, పీపుల్ ఫర్ యానిమల్స్ ప్రతినిధి వి.వాసంతి, కమాండో కెన్నల్స్ ఫిలిప్ బట్, యానిమల్ ఎయిడ్ సొసైటీ ప్రతినిధి అర్చన నాయుడు పాల్గొన్నారు.

# ఉపాధి కూలీలకు రూ. 600 ఇవ్వాలి

### బికెఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య
### కూలీల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర విఫలం



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ఉపాధి హామీ కూలీల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య ఆరోపించారు. మంగళవారం జిల్లేడు చౌదరిగూడ మండల పరిధిలోని వనంపల్లి గ్రామంలో మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పనులను తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం బికేఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య, సిపిఐ చౌదరిగూడ మండల కార్యదర్శి జి.వెంకటేష్, సిపిఐ మండల నాయకులు ఎం.కృష్ణతో కలిసి పని చేసే ప్రదేశాన్ని సందర్శించి కూలీలతో చర్చించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బుద్దుల జంగయ్య మాట్లాడుతూ వలసలను నియంత్రించేందుకే అప్పటి ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వివరించారు. ఉపాధి హామీ పథకానికి నిధుల కోరత చూపించి పథకంలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను తీసివేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందని మండిపడ్డారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకా పథకానికి ఆశించిన స్థాయిలో నిధులు కేటాయించకపోవడం, దాంతో నిర్వీర్యం చేస్తున్నారని వివరించారు. ఎండల వేడిమిని తట్టుకునేందుకు టెంటు, వైద్య కిట్లు, పారగడ్డపార వంటి సౌకర్యాలు ఏమి కల్పించడం లేదని మండిపడ్డారు. సొంత పనిముట్లు తీసుకువచ్చి పనులు చేయాల్సి వస్తుందని, అందుకు తగ్గట్టుగా కూలీచెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొలతలతో సంబంధం లేకుండా రోజువారి కూలీ రూ.600 ఇవ్వాలని, 200రోజులు పని కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని, వారంవారం కూలీ డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు 55 ఏళ్ళు ఉన్న వారికి రూ.5వేలు పింఛన్ సౌకర్యం కల్పించాలని లేని పక్షం లో ప్రభుత్వ ఆఫీసులను ముట్టడించనున్నట్లు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నేతలు బుచ్చయ్య, రాజు, అనంతయ్య, యాదయ్య, రమేష్ పాల్గొన్నారు.

## పెంచిన టెట్ పరీక్ష ఫీజును వెంటనే ఉపసంహరించుకోవాలి

### ఎఐఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి డిమాండ్

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** పెంచిన టెట్ పరీక్ష ఫీజును తగ్గించాలని ఏఐఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం ఏఐఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి చైతన్యయాదవ్, గ్యార నరేష్ ఇక్కడొక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. నిరుద్యోగులపై ఆర్థికభారం మోపడం ఆక్షేపణీయమన్నారు. గతంలో ఒక పేపర్ రాస్తే రూ.200, రెండు పేపర్లు రాస్తే రూ.300 ఫీజు ఉండేదన్నారు. కాగా ప్రస్తుతం టెట్ పరీక్ష రాసే అభ్యర్థులు ఒక పేపర్ రాస్తే రూ.1000, రెండు పేపర్లు రాస్తే రూ.2000 ఫీజు నిర్ణయించడం దారుణమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన ఎన్నికల మేనిఫెస్టోలో ప్రవేశ పరీక్షల ఫీజులు తగ్గించి, తక్కువ ఫీజులతో పోటీ పరీక్షలు నిర్వహిస్తామని హామీ ఇచ్చినప్పటికీ, ఎన్నికల హామీకి విరుద్ధంగా ఫీజు నిర్ణయించడం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడటమేనని ధ్వజమెత్తారు. టెట్ పరీక్షకు లక్షలాది మంది నిరుద్యోగ అభ్యర్థులు సన్నద్ధమవుతున్నారని, వారంతా బిఆర్ఎస్ పాలనలో పరీక్ష ఫీజులు కట్టి, కోచింగ్ సెంటర్లలో కోచింగ్‌లు తీసుకుని పరీక్షల్లో చోటు చేసుకున్న అవకతవకలవల్ల ఆర్థిక భారంతో కుంగిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే ఈ ఫీజు పెంపు చర్యను ఉపసంహరించుకుని నిరుద్యోగులకు అండగా నిలవాలని, నిరుద్యోగ వ్యతిరేక విధానాన్ని విడనాడాలని కోరారు.

## బిజెపిని ఓడించడమే లక్ష్యం

### సిపిఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశానికి ప్రమాదకరంగా మారిన బిజెపిని సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో ఓడించేందుకు నాయకులు, కార్యకర్తలు క్రియాశీలకంగా పనిచేయాలని సిపిఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ అన్నారు. సికింద్రాబాద్ లాలాపేట నఫీజ్ ఫంక్షన్‌హాల్‌లో సిపిఐ సికింద్రాబాద్ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. కాంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ 'ఏప్రిల్ మొదటి వారంలో మోడీ హటావో దేశ్‌కి బచావో' నినాదంతో సికింద్రాబాద్ లోక్‌సభ పరిధిలో పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం నుంచి కేంద్ర మంత్రిగా ప్రతినిధ్యం వహిస్తున్న కిషన్ రెడ్డి 10 సార్లు వందే భారత్ రైలుకు జెండా ఊపడం తప్ప, సికింద్రాబాద్ అభివృద్ధికి చేసిందేమిలేదని విమర్శించారు. కేంద్ర మంత్రిగా సికింద్రాబాద్‌కు ఏమిచేయని కిషన్ రెడ్డికి ఇక్కడ ఓట్లు అడిగే హక్కులేదన్నారు. అస్తిత్వం కోల్పోయిన బిఆర్ఎస్‌కు ఓటేస్తే మోరీలో వేసినట్టే అన్నారు. బిఆర్ఎస్‌కు అభ్యర్థులు కరువయ్యారన్నారు. ఈ సమావేశంలో సిపిఐ నాయకులు శ్రీహరి, గౌరీ నాగరాజ్, గువ్వల మల్లేష్, యాకోబ్, హుస్సేన్, రవికాంత్, దేవేందర్, వెంకట్ గౌడ్ పాల్గొన్నారు.



## పెండింగ్ పనులు పూర్తి చేయండి



**ప్రజాపక్షం/ఎల్బీనగర్:** చంపాపేట డివిజన్ పరిధిలోని ఉదయ్ నగర్ కాలనీ నందు చుట్టుపక్కల కాలనీవాసుల సమావేశంలో ముఖ్య అతిథిగా ఎల్.బి.నగర్ శాసనసభ్యులు శ్రీ.దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముందుగా అంతకు ముందు ఏం.ఆర్.ఆర్.కాలనీ,పద్మ నగర్,ఉదయ్ నగర్,సూర్య నగర్ కాలనీల యందు పర్యటించి పలు సమస్యలను తెలుసుకున్నారు.అనంతరం పలు కాలనీ వాసుల సమావేశంలో పాల్గొని వారి యొక్క సమస్యలు తెలుసుకున్నారు.ముఖ్యంగా ఎస్.ఎన్. డి.పి పనుల్లో బాగంగా మీ యొక్క చొరవతో దాదాపు 95 పనులు పూర్తి కావడం జరిగింది.సింగిరెడ్డి శివారెడ్డి వెనుక ఉన్న సూర్య నగర్ కాలనీ వద్ద ఎస్.ఎన్.డి.పీ.పనులు పూర్తి చేయాలని కోరారు. కావున వచ్చే వర్షాకాలం లోపు పనులు పూర్తి చేయాలని కోరారు.అలాగే అక్కడ ఉన్న నాల పక్కన పార్క్ నిర్మించలని కోరారు.వెంటనే స్పందించిన సుధీర్ రెడ్డి గారు అధికారులకు ఫోన్ చేసి పనులు వెంటనే ప్రారంభించడానికి సన్నాహాలు చేయాలని ఆదేశించారు.రెండు,మూడు రోజుల్లో బ్యాలన్స్ పనులు పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సుంకోజు కృష్ణమాచారి,ఒరుగంటి వెంకటేష్,డివిజన్ అధ్యక్షులు రాజిరెడ్డి,మహిళా అధ్యక్షురాలు రోజా రెడ్డి,సదానంద్ రెడ్డి,శ్రీనాధ్ పాల్గొన్నారు.

# నిజాం కళాశాలలో పోస్టల్ బ్యాలెట్ కేంద్రాలు

### ఏర్పాట్లు పరిశీలించిన హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో విధులు నిర్వర్తించేందుకు డ్యూటీలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు నిజాం కళాశాల గ్రౌండ్స్‌లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేసినట్లు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. మంగళవారం ఆయన నిజాం కళాశాల గ్రౌండ్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. సికింద్రాబాద్, హైదరాబాద్ పార్లమెంటరీ, కంటోన్మెంట్ అసెంబ్లీ సెగ్మెంట్, రాష్ట్రంలోని ఇతర పార్లమెంటరీ నియోజకవర్గాలకు చెందిన పోలింగ్ కేంద్రాలలో డ్యూటీలు నిర్వహించే ఉద్యోగులు నిజాం కాలేజీలో గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలలో మే 7,8, 9,10 తేదీలలో, మే 11, 12తేదీలలో రిసెప్షన్ సెంటర్లు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు (ఆర్‌సిడిసి) ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలియజేశారు. పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకునేందుకు మొత్తం 30 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి, ఆర్డీవో కె.మహిపాల్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, నాంపల్లి తహశీల్దార్, కలెక్టర్ పర్యవేక్షకులు రాములు, పోలీస్ పాల్గొన్నారు.

**పిల్లలను బాగా చదివించి ప్రయోజకులను చేయండి**

నగరంలో భిక్షాటన చేస్తున్న మహారాష్ట్ర షోలాపూర్‌కు చెందిన పిల్లలను వారి స్వస్థలాలు గుర్తించి హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రత్యేక బస్సులో వారి స్వగ్రామాలకు తరలించారు. ఈ కార్యక్రమం మంగళవారం కాచిగూడ నింబోలి అడ్డాలోని జువైనల్ గర్ల్స్ హోమ్ వద్ద నుంచి ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సుకు అనుదీప్ దురిశెట్టి ఊపి ప్రారంభించారు. 19మంది చిన్నారులను వారి తల్లిదండ్రులు లేదా సంరక్షులను ఈ ప్రత్యేక బస్సులో వారి సొంత రాష్ట్రం మహారాష్ట్రకు పంపించారు. హైదరాబాద్ నగరంలోని ప్యారడైజ్, ప్యాట్నీ, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్, అఫ్జల్‌గంజ్, సుల్తాన్‌బజార్, అమీర్‌పేట్‌లోని మైత్రీవనం, బల్కంపేట్ టెంపుల్, ఐఎస్ సదన్, మలక్‌పేట్, చాంద్రాయణ గుట్ట, పెద్దమ్మతల్లి టెంపుల్ వద్ద భిక్షాటన చేస్తున్న పిల్లలను స్పెషల్ డ్రైవ్ ద్వారా గుర్తించిన అధికార యంత్రాంగం హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వారి స్వస్థలాలను గుర్తించి పంపించే చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి అక్కేశ్వర్‌రావు, బాలికల హోమ్ సూపరింటెండెంట్ కృష్ణవేణి, బాల రక్ష భవన్ అధికారి సుమలత, జిల్లా బాలల పరిరక్షణ విభాగం యంత్రాం గం, పోలీస్, జువైనల్ గర్ల్స్ హోమ్ సిబ్బంది పాల్గొన్నారు.

## క్రషర్ గుంతలో పడి యువకుడు మృతి

### శవంతో కుటుంబ సభ్యుల రాస్తారోకో

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** క్రషర్ గుంతలో పడి యువకుడు మృతి చెందిన సంఘటన కొందుర్గు మండల కేంద్రంలో చోటు చేసుకుం ది. మంగళవారం సాయంత్రం మం డల కేంద్రానికి సమీపంలో ఉన్న క్రషర్ గుంతలో కొందుర్గుకు చెందిన బోయ సాయి (22) అనే యువకుడు పడి అక్కడికక్కడే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దాంతో యువకుడి మృతదేశంతో కొందుర్గు చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించి ఆందోళనకు దిగారు. ప్ర భుత్వ నిబంధనలకు విరుద్ధంగా క్ర షర్ ఏర్పాటు చేయడం వల్లనే యువకుడు అందులో పడి మృత్యువాత పడ్డాడని ఆరోపించారు. ఈ విష యం తెలుసుకున్న కొందుర్గు ఎస్ఐ కృష్ణయ్య తన సిబ్బందితో హు టాహుటిన ముఖ్యకూడలి వద్దకు చేరుకొని రాస్తారోకో చేసుకున్న మృతుడి కుటుంబ సభ్యులకు నచ్చజెప్పి అక్కడి నుండి పంపించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని షాద్‌నగర్ ప్రభుత్వ వైద్యశాల కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# తాళాలు వేసిన ఇళ్ళే టార్గెట్...

### నిద్రిస్తున్న మహిళల మెడలో నుండి పుస్తెల తాడు ఆపహరణ
### డిసిపి నారాయణరెడ్డి వెల్లడి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** తాళాలు వేసిన ఇళ్ళను టార్గెట్‌గా చేసుకొని అంతరాష్ట్ర దొంగలు వరుస చోరీలకు పాల్పడినట్లు శంషాబాద్ డిసిపి నారాయణ రెడ్డి వివరించారు. మంగళవారం షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిసిపి నారాయణరెడ్డి మాట్లాడుతూ మహారాష్ట్రకు చెందిన కొంతమంది దొంగల ముఠాగా ఏర్పడి జాతీయ రహదారులకు సమీపంలో ఉన్న ఇళ్ళను, తాళాలు వేసిన ఇళ్ళను టార్గెట్‌గా చేసుకొని వరుస చోరీలకు పాల్పడుతున్నారని వివరించారు. అదే విధంగా వేసవి కాలం దృష్టిలో పెట్టుకొని తలుపులు తెరిచి నిద్రిస్తున్న మహిళల మెడలో నుండి బంగారు పుస్తెల తాడు, ఇతర బంగారు వస్తువులను ఆపహారించుకొని వెళ్ళేవారని తెలిపారు. మార్చి1వ తేదిన ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట గ్రామానికి చెందిన బెంది రాంరెడ్డి అనే వ్యక్తి కుటుంబ సభ్యులతో కలిసి హైదారాబాద్‌కు వెళ్ళారు. ఐదు రోజుల తరువాత వచ్చి చూసే సరికి బిరువా లాకర్‌లో ఉన్న రూ.2.10లక్షలు ఆపహరణకు గురైనట్లు షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దర్యాప్తులో భాగంగా షాద్‌నగర్ పోలీసులతోపాటు శంషాబాద్ సిసిఎస్ పోలీసులు దర్యాప్తు చేసి రాజీవ్ శంకర్ పవర్ (32), పవన్ మచ్చింద్రలను అరెస్టు చేసి విచారించగా ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట, బుచ్చిగూడ, దూసకల్ గ్రామాలతోపాటు ఇతర ప్రాంతాలలో అనేక చోరీలు చేసినట్లు వివరించారు. షాద్‌నగర్‌లో 5కేసులు, మహేశ్వరంలో2కేసులు, పహాడి షరీఫ్‌లో 2కేసులు, ఆమన్‌గల్‌లో4కేసులు, కేశంపేటలో01కేసులు, కొత్తూరులో 01కేసులు, నందిగామలో01, కడ్తాల్‌లో02కేసులు, శంషా బాద్‌లో03కేసులు, కందుకూరులో02కేసులు మొత్తం 23కేసులలో దొంగతనాలు చేసినట్లు వివరించారు. నిందితుల నుండి వేర్వేరు కేసులకు సంబంధించి 10తులాల బంగారం, ఇతర పోలీస్ స్టేషన్లలో 20తులాల బంగారం మొత్తం 30తులాల బంగారం నిందితుల నుండి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇద్దరి నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు, మరో ముగ్గురు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కేసును త్వరగా చేధించినందుకు పోలీస్, సిసిఎస్ పోలీస్ సిబ్బందికి నగదు రివార్డును అందజేశారు. ఈ సమావేశంలో అదనపు డిసిపి రామ్‌కుమార్, సైబరాబాద్ క్రైమ్ డిసిపి నర్సింహా, అదనపు డిసిపి నర్సింహ్మారెడ్డి, సిసిఎస్ ఏసిపి శశాంక్‌రెడ్డి, షాద్‌నగర్ ఏసిపి రంగస్వామి, సిఐ ప్రతాప్‌లింగం, సిసిఎస్ శంషాబాద్ సిఐ పవన్, ఎస్ఐ అనినాష్, ఏఎస్ఐ సత్యనారాయణరెడ్డి సిబ్బంది దశరథ్, మహేందర్, కుమార్‌లు ఉన్నారు.


## సమన్వయంతో మానవ అక్రమ రవాణాకు అడ్డుకట్ట

### రైల్వే అదనపు డైరెక్టర్ జనరల్ పోలీస్ మహేష్ భగవత్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతోనే మానవ అక్రమ రవాణాను అడ్డుకునేందుకు సాధ్యమవుతుందని రైల్వేల అదనపు డైరక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ మహేష్ భగవత్ అన్నారు. సికింద్రాబాద్‌లోని సంచలన్ భవన్ హవా మహల్‌లో మంగళవారం దక్షిణ మధ్య రైల్వేకు చెందిన రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, ప్రభుత్వ రైల్వే పోలీస్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్‌ల ఒక్కరోజు వర్క్‌షాప్ రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌నకు దాదాపు 105 మంది ఆర్‌పిఎఫ్, జిఆర్‌పి అధికారులు, సిబ్బంది హాజరయ్యారు. రైల్వేల ఆదనపు డైరెక్టర్ జనరల్ పోలీస్ మహేష్ భగవత్, మానవ అక్రమ రవాణ యూనిట్ (ఎఎచ్‌టియు) బుక్‌లెట్ దక్షిణ మధ్య రైల్వే ఐజి కమ్ ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ అరోమా సింగ్ ఠాకూర్, డివిజనల్ రైల్వే మేనేజర్, సికింద్రాబాద్ డివిజన్ భరతేష్ కుమార్ జైన్ సమక్షంలో బుక్‌లెట్‌ను విడుదల చేశారు. మహేశ్ భగవత్ మాట్లాడుతూ ప్రపంచంలోని అతిపెద్ద రైల్వే నెట్‌వర్క్‌లలో భారతీయ రైల్వే ఒకటన్నారు. గణనీయమైన సంఖ్యలో ప్రజలు వివిధ గమ్యస్థానాలకు చేరుకునేందుకు రైల్వే స్టేషన్‌లను చేరుకుంటారన్నారు. ఈ జనాభాలో ఎక్కువ మంది పిల్లలు మెరుగైన జీవితాన్ని పొందాలనే ఆశతో నగరాలకు చేరుకోవడానికి రైల్వే వ్యవస్థను ఆశ్రయిస్తారన్నారు. దక్షిణ మధ్య రైల్వే డిఐజి కమ్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ ఎం.డి. షాదాబ్ ఖాన్, సికింద్రాబాద్ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్ షేక్ సలీమా, సికింద్రాబాద్ డివిజన్ సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ దేబాష్మిత, సి. బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.



## గ్యారంటీ పథకాలతో అన్నివర్గాలకు న్యాయం



**ప్రజాపక్షం/జవహర్‌నగర్:** ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యుడు బీర్ల ఐలయ్యను కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి చిన్నం శ్రీనివాస్ కలిశారు. మంగళవారం జవహర్‌నగర్ కార్పొరేషన్‌కు చెందిన యాదాద్రి భువనగిరి కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి చిన్న శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ ఆరు గ్యారంటీ పథకాల అమలుపై కాంగ్రెస్ నాయకులతో చర్చించారు. ఆరు గ్యారంటీ పథకాలతో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## సిఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసి అందజేత



**ప్రజాపక్షం/మల్కాజ్‌గిరి:** మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో సిఎంఆర్ ఎఫ్ లబ్ధిదారు కుటుంబానికి రూ.50 వేల విలువైన ఎల్ ఓసిని మంగళవారం అందజేశారు. మౌలాలీ డివిజన్ హనుమాన్ నగర్‌కు చెందిన స్వరూపరాణి అనారోగ్యంతో బాధపడుతూ సిఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకుంది. ఈ మేరకు మంజూరైన ఎల్‌ఓసిని లబ్ధిదారు కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు పలువురు పాల్గొన్నారు. లబ్ధిదారు కుటుంబం ఎమ్మెల్యేకు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## పేదల సమస్యల పరిష్కారానికి పోరాడేది కమ్యూనిస్టులే



**ప్రజాపక్షం/బోడుప్పల్:** పేదల సమస్యల పరిష్కారానికి పోరాడేది కమ్యూనిస్టులేనని మేడిపల్లి మండల సిపిఐ కార్యదర్శి రచ్చ కిషన్ అన్నారు. మేడిపల్లి మండలం హేమానగర్ శాఖ సమావేశం, పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉప్పల కొమరయ్య అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కిషన్ మాట్లాడుతూ పార్టీ పట్ల ఆకర్షితులై కార్మికులు, కర్షకులు, వివిధ సెక్టార్లలో పని చేస్తున్న వారు సభ్యత్వం తీసుకుంటున్నారన్నారు. సిపిఐ పేదల పక్షాన నిలబడి పేదల కోసం పని చేస్తున్నందున పార్టీ సభ్యత్వం తీసుకునేందుకు పెద్దఎత్తున ముందుకు వస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఏఐటియుసి మండల కార్యదర్శి దండు రమేష్, యువజన నాయకుడు జి.నాగరాజు, హేమానగర్ శాఖ, సిపిఐ సభ్యులు మామిళ్ల అనిత, సురిగళ్ల కవిత, అంతటి యాదమ్మ, సురిగల అండాలు, పురుగుల మల్లమ్మ, సిరిగల అంజమ్మ, పులిమామిడి మమత, బాసాని మంజుల, అంతటి యాదయ్య, పొనగానే అనిత, సామి, కొనగల రాములు తదితరులు పాల్గొన్నారు.

## ముగ్గురు ద్విచక్రవాహన దొంగలు అరెస్టు

### రూ. 6.65 లక్షల విలువ చేసే 17 వాహనాలు స్వాధీనం

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** ముగ్గురు ద్విచక్ర వాహనాల దొంగలను జీడిమెట్ల పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో సిఐ శ్రీనివాస్ రావు, డిఐ విజయ్ నాయక్ లు నిందితుల వివరాలను వెల్లడించారు. గాజులరామారం, రోడామేస్త్రీ నగర్, నెహ్రూనగర్‌కు చెందిన గోగుల దేవసహాయం అలియాస్ దేవ (27) బండరాళ్లను పగుల గొట్టే పనులు చేస్తుంటాడు. మెదక్ జిల్లా, కౌడిపల్లి మండలం, ధర్మసాగర్‌కు చెందిన రెడ్డి రమేశ్ (27) ఎలక్ట్రీషియన్ మరియు ప్లంబింగ్ పనులు చేస్తుంటాడు. షాపూర్ నగర్, కళావతి నగర్‌లో నివాసముండే మన్నెరాజు (35) డ్రైవింగ్ చేస్తుంటాడు. నిజాంబాద్, కామారెడ్డి జిల్లాకు చెందిన కలాల్ శివకుమార్ గౌడ్ (23) బైక్ మెకానిక్ పని చేస్తాడు. దేవ, రమేశ్‌లకు మద్యం సేవించడం, జల్సాలు చేయడం వీరి అలవాటు. ఇద్దరు కలిసి ఈజీ మనీ కోసం ద్విచక్ర వాహనాల దొంగతనం చేయడం ప్రారంభించారు. పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలను దొంగిలించి అట్టి వాహనాల పై మార్టిగేజ్ చేసి డబ్బులు తీసుకుని జల్సాలు చేస్తుండేవారు. ఈ క్రమంలో దొంగిలించిన వాహనాల పై మన్నెరాజు మార్టిగేజ్ చేసుకుని డబ్బులను ఇవ్వడం ప్రారంభించాడు. మన్నెరాజు అట్టి వాహనాలను బైక్ మెకానిక్ అయిన శివకుమార్ గౌడ్‌కు మార్టిగేజ్ చేసి డబ్బులను తీసుకున్నాడు. దొంగిలించిన వాహనం పై అనుమానాస్పదంగా తిరుగుతున్న దేవ, రమేశ్‌లను అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారించగా అసలు విషయం బయటపడింది. ఇద్దరితో పాటు మన్నెరాజును సైతం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు పోలీసులు దేవ, రమేశ్, మన్నెరాజులను రిమాండ్‌కు తరలించి సుమారు రూ. 6.65 లక్షలు విలువ చేసే 17 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు శివకుమార్ గౌడ్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వీరి పై జీడిమెట్ల పిఎస్‌లో ఎనిమిది, సూరారంలో నాలుగు, జగద్గిరిగుట్టలో ఒకటి, నర్సాపూర్‌లో ఒకటి, కామారెడ్డిలో ఒకటి, ఎల్లారెడ్డిలో ఒకటి, మెదక్ టౌన్ పిఎస్‌లో ఒకటి మొత్తం పదిహేడు కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

## పేరుకుపోయిన చెత్తతో లక్ష్మాపూర్ గ్రామస్తుల ఇబ్బందులు

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మూడుచింతలపల్లి మండలం లక్ష్మాపూర్ గ్రామపంచాయతి ముందు చెత్త చెదారంతో నిండిపోయింది. గత వారం రోజులుగా పంచాయతి కార్మికులు పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని గ్రామపంచాయతి ముందు ఇటీవల దర్నా చేశారు. పంచాయతి కార్మికులు విధుల్లో లేకపోవడంతో గ్రామంలో ఎక్కడ పడితే అక్కడ చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. పారిశుద్యం పడకేయడంతో చెత్త చెదారంతో గ్రామంలోని పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. మంగళవారం జిల్లా పంచాయతి అధికారి(డిపివో) గ్రామంలో పర్యటించారు. చెత్త చెదారం ఎందుకు పేరుకపోయిందని కనీసం ఆరా తీయలేదని సమాచారం. వచ్చామా.. వెళ్లామా అన్నట్లు డిపివో అధికారి పని తీరుతో ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. ఇలాంటి అధికారులు ఉంటే గ్రామాలు ఏ విదంగా బాగుపడతాయని ప్రజలు చర్చించుకుంటున్నారు.

## దుండిగల్ పెద్ద చెరువుకు గండం



**ప్రజాపక్షం/దుండిగల్ :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ గండిమైసమ్మ మండల పరిధిలోని చెరువులు కుంటలు కబ్జాలకు గురవుతున్నాయి. దుండిగల్ గ్రామంలో చెరువు బఫర్ స్థలం కబ్జా లీలాలు వెలుగులోకి వచ్చాయి పూర్తి వివరాల్లోకి వెళితే దుండిగల్ మండల పరిధి లోని దుండిగల్ పెద్ద చెరువు మండల రెవేన్యూ రికార్డు ప్రకారం సర్వేనెంబర్ 871 చెరువు విస్తరణ 168 ఎకరాల 1గుంట చెరువు బఫర్ పూర్తిగా కాజ్జాలకు గురి అవుతుంది. చెరువు ప్రాంతంలో ఏకంగా ప్లాట్లుగా విభజించి అమ్మకానికి శ్రీ కారం చూడుతున్నారు. కొందరు ప్రబుద్ధులు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసిన నిర్మాణదారులకు అనుకూలంగ చర్యలు తీసుకుంటున్నారాని వాదనలు వినిపిస్తున్నాయి. బిఆర్ఎస్ నాయకుల హస్తం ఉండడంతో వెంచర్ నీర్వాహకులకు ఉన్నత అధికారులు వత్తాసు పలుకుతున్నారని ఆరోపణలు లేకపోలేదు హెచ్ఎండిఏ అనుమతులు లేకుండా పూర్తిగా కాలం చెలిన గ్రామ పంచాయతీ అనుమతులతో అతి భారీ ఎత్తున వెంచర్ జరుగుతున్న అధికారులు ఎందుకు నివారించలేకపోతున్నారో అధికారులకే తెలియాలి పూర్దిగా చెరువు బఫర్ చదును చేసి నిర్మాణాలు చేపడుతున్నారు. పూర్తిగా మాటి పోసి పనులు కొనసాగిస్తున్నారు. పూర్తిగా పేద చెరువును బఫర్ మింగేసే పనిలో వెంచర్ నిర్మాన దారులు ఉన్నటు చెప్పకనె చెపుతున్నారు. రెవెన్యూ ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యానికి పూర్తిగా చెరువు కనుమరుగు అయ్యే దుస్థితి ఏర్పడింది. ఇంత జరుగుతున్న రెవెన్యూ ఇరిగేషన్ అధికారులు చోద్యం చుస్తునారు. ఇంత తతంగం జరుగుతున్న రెవెన్యూ మరియు ఇరిగేషన్ అధికారులు వెనుకడుగు ఎందుకు వేస్తున్నారో వారికే తెలియాలంటున్నారు. ఇప్పటికైనా పెద్ద చెరువును పూర్తిగా కబ్జాలకు గురికాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని పర్యావరణవాదులు గ్రామస్తులు వేడుకుంటున్నారు.

# కాంగ్రెస్ గెలుపే లక్ష్యం

### మంత్రి తుమ్మల నాగేశ్వర రావు



**ప్రజాపక్షం/దుండిగల్ :** మల్కాజ్‌గిరి పార్లమెంటు నియోజకవర్గం గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త నాయకులు పనిచేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకుల సమావేశం బహదూర్ పల్లి పరిధిలోని మేకల వెంకటేష్ ఫంక్షన్ హాల్లో మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీత మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల మాదిరిగా జరగబోయే ఎంపీ ఎన్నికల్లో కూడా ప్రతిఒక్క నాయకుడు, కార్యకర్త ఒక సైనికునిలా పని చేయాలనీ దిశానిర్దేశం చేసి మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థిని శ్రీమతి పట్నం సునీత మహేందర్ రెడ్డిను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీమంత్రి పట్నం మహేందర్ రెడ్డి, మాజీఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హరివర్ధన్‌రెడ్డి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షులు కేయం ప్రతాప్, టీపీసీసీ ప్రధానకార్యదర్శులు నర్సారెడ్డి, భూపతి రెడ్డి, జ్యోత్స్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొంగునురి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ యువ నాయకులు బొంగునూరి కిషోర్‌రెడ్డి, శివారెడ్డి, పున్నారెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు ఆర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## దోబీఘాట్ సమస్య పరిష్కారానికి కృషి



**ప్రజాపక్షం/మల్కాజ్‌గిరి:** గౌతమ్‌నగర్ డివిజన్‌లోని జ్యోతినగర్ దోబీఘాట్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, బిఆర్‌ఎస్ ఎంపి అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి తెలిపారు. మంగళవారం నాడు మల్కాజ్‌గిరి నియోజకవర్గంలో వారు పర్యటించారు. ఈ సందర్భంగా జ్యోతినగర్‌లో ఉన్న దోబీఘాట్‌లో రజక సంఘం నేతలతో సమావేశమయ్యారు. దోబీఘాట్‌కు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు తాము కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మేకల సునీత రాము యాదవ్ మురుగేష్, నాయకులు వెంకన్న, మల్లేష్ యాదవ్, నర్సింగరావు, పరమేష్, కాటం రాజు, రజక సంఘం నేతలు సత్యనారాయణ, కాసర్ల నాగరాజు, యాదగిరి, శ్రీకాంత్, తిరుపతి, లక్ష్మణ్, శంకర్, పెద్దలు, సతీష్, ప్రవీణ్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల మనిషి ధర్మభిక్షం



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** స్వాతంత్ర్య సమయోధుడు , అఖిల భారత గీత పనివారల కార్మిక సమాఖ్య నిర్మాత, ప్రజల మనిషి ధర్మభిక్షం వర్ధంతి సందర్భంగా మంగళవారం శామీర్‌పేట మండల కేంద్రంలోని క్రాంతిభవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. గీత పనివారల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డిజి సాయిలుగౌడ్ మాట్లాడుతూ ధర్మభిక్షం మూడు పర్యాయాలు శాసనసభ్యులుగా, రెండు పర్యాయాలు పార్లమెంట్ సభ్యుడిగా అన్ని వర్గాల ప్రజలకు ఎన్నో సేవలు అందించిన గొప్ప నాయకుడని గుర్తుచేశారు. గీత పనివారల సంఘం స్థాపించి అనాటి అబ్రాసు విధానాలకు వ్యతిరేఖంగా పోరాడి సోసైటిలు ఏర్పాటు చేసి ఎక్స్‌గ్రెషియా, పెన్షన్‌లు, ప్రతి సోసైటికి ఐదెకరాల భూమిలో ఈత వనాల పెంపకం చేపట్టిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి డిజి నరేంద్రప్రసాద్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి రాములుగౌడ్, నాయకులు బాల్‌రాజ్‌గౌడ్, భూమయ్య, నాగరాణి, రవి, విక్రమ్ ధర్మరక్షక్‌గౌడ్, నవీనా తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు చేయూత అభినందనీయం

### పోలీస్ హౌసింగ్ అకాడమీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి




**ప్రజాపక్షం/కొడంగల్ :** మానసిక దివ్యాంగులకు చేయూతనివ్వడం అభినందనీయమని పోలీస్ హౌసింగ్ అకాడమీ చైర్మన్, మాజీ ఎంఎల్ఏ గురునాథ్ రెడ్డి. అన్నారు. మంగళవారం కొడంగల్ పట్టణంలోని కెఎస్‌వి ఫంక్షన్ హాల్‌లో హైద్రాబాద్ కాంటినెంటల్ హాస్పటల్ యాజమాన్యం వైద్య ఆరోగ్య శిభిరాన్ని ఏర్పాటు చేశారు. శిభిరంలో దివ్యాంగులకు వీల్ చైర్స్, బిపి మెషిన్స్, వాకర్స్, వాకింగ్ స్టిక్స్, గ్లుకో మీటర్స్, వాహనదారులు సురక్షితంగా ఉండేందుకు హెల్మెట్స్, నడటవాటినికి రాకుండా పూర్తిగా బెడ్ రెట్స్ ఉండే వారికి బెట్స్ విత్ పరుపులు, మెడిసిన్, ఫుడ్ స్టాండ్స్, ఎల్బో క్రచెస్ ఇంటి అనేక పరికరాలను ఉచితంగా అందజేశారు. ఈ సందర్బంగా గురునాథ్‌రెడ్డి మాట్లాడుతు పేదవారికి వైద్యాన్ని చేరువచేయాలనే ఆలోచనతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గాన్ని ఎంచుకొవడం పట్ల కాంటినెంటల్ హాస్పటల్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు వైద్యసామాగ్రి పంపిణీ కార్యక్రమాన్ని నిరంతరంగా నిర్వహించే ప్రయత్నం చేస్తామని కాంటినెంటల్ ఆసుపత్రి ఫౌండర్ అండ్ చైర్మన్ డాక్టర్ గురు ఎన్‌రెడ్డి తెలిపారు. 21న మోకిలాలో, 22న సంగారెడ్డి జిల్లాలోని సింగూరు మండలం జగ్గారెడ్డి పేటలో, 23న పటాన్‌చెరువులో, 26న కొడంగల్‌లో వైద్య శిభిరాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి ఫౌండర్ అండ్ సిఈవో మోహన్ సుద్దబట్ల, సీవోవో సామ్ ఫిలిప్స్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అభిజిత్ హరికుమార్, పిఎసిఎస్ చైర్మెన్ , ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షుడు కట్కం శివకుమార్, మురారీ వశిష్ట, జయతీర్థచారి, సయ్యద్ మునీర్, శ్రీనివాస్‌గౌడ్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## వీధి వ్యాపారులపై అధికారుల జులుం సరికాదు

### ఎంఎల్ఏ కెపి వివేకానంద



**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** రెక్కడితే గాని డొక్కాడని పేద వ్యాపారులపై జిహెచ్ఎంసి అధికారులు జులుం ప్రదర్శించడం సరికాదని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని షాపూర్‌నగర్ మార్కెట్ రోడ్డులోని దుకాణ సముదాయాలను, చిరు వ్యాపారస్థులను ఎమ్మెల్యే కెపి వివేక్ కలిసి మార్కెట్‌లో పర్యటించారు. గాజులరామారం సర్కిల్ అధికారులు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా చిరు వ్యాపారుల అతి చిరు సామాగ్రిని ధ్వంసం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్కెట్‌లో నష్టానికి గురైన చిరు వ్యాపారులతో మాట్లాడిన ఎమ్మెల్యే కెపి వివేక్ వారి సమస్యలను తెలుసుకున్నారు. గాజులరామారం సర్కిల్ కార్యాలయంలో ఉపకమిషనర్ మల్లారెడ్డిని కలిసిన వివేక్ సమస్యను వివరించారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ షాపూర్‌నగర్ మార్కెట్ రోడ్డులో అనేక మంది వీధి వ్యాపారులు కూరగాయలు, పూలు, పండ్లను అమ్ముకుని జీవనం సాగిస్తారని, వీరిని వీధి వ్యాపారులుగా కొనసాగిస్తూ జిహెచ్ఎంసీ అధికారులు గతంలో గుర్తింపు కార్డులను సైతం అందజేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఎలాంటి సమాచారం ఇవ్వకుండా జిహెచ్ఎంసి అధికారులు మార్కెట్ రోడ్డులోని తోపుడు బండ్లు, చిరు దుకాణాల పై విచక్షణా రహితంగా దాడులు చేసి సామాగ్రిని ధ్వంసం చేసి హంగామా చేయడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. చిరు వ్యాపారులకు తగిన సహకారం, సహాయం, సూచనలు చేయాల్సిన అధికారులు అమానుషంగా ప్రవర్తించడం సిగ్గు చేటన్నారు. చిరు వ్యాపారుల పై అమానుషంగా ప్రవర్తించిన అధికారుల పై తక్షణమే చర్యలు తీసుకోవాలని వివేక్ డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం అయితే వీధి వ్యాపారుల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గాజుల రామారం డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి, నాయకులు భాస్కర్, సిద్ధిక్, కమలాకర్, ప్రభుదాస్, చిన్న చౌదరి, గోవర్ధన్ రెడ్డి, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

### బంగారు మైసమ్మ ఆలయంలో పూజలు

గాజులరామారం డివిజన్ మెట్‌కాని గుడ రాజీవ్ గాంధీ నగర్ లోని బంగారు మైసమ్మ దేవాలయ వార్షికోత్సవ వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే కెపి వివేక్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల శేషగిరి, నాయకులు విజయ రాంరెడ్డి, పరిషె శ్రీనివాస్ యాదవ్, భాస్కర్, కస్తూరి బాల్ రాజ్, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

## గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉంటా

### ఈటల రాజేందర్



**ప్రజాపక్షం/దుండిగల్ :** మల్కాజ్‌గిరి ఎంపిగా గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉంటానని బిజెపి ఎంపి అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. దుండిగల్ మున్సిపల్ బీజేపీ కౌన్సిలర్ బాలమణి కృష్ణారెడ్డి ఆహ్వానం మేరకు బౌరంపేటలోని ఆయన నివాసానికి ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, డా.ఎస్ మల్లారెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా తనను కలవడానికి వచ్చిని వారిలో ఈటల రాజేందర్ మాట్లాడుతూ కరోనా కాలంలో దేశం దారుణమైన పరిస్థితిలో ఉంటే స్పందించి తెలంగాణ హైదరాబాద్ గడ్డమీద వ్యాక్సిన్ తయారు చేయించి దేశ ప్రజలకు ఫ్రీగా రెండు మూడు డోసులు ఇచ్చిన ఘనత మోడీ ప్రభుత్వానిదన్నారు. ప్రధాని మోడీ 500 సంవత్సరాల హిందువుల కల అయోధ్యలో రామ మందిర నిర్మాణం ప్రారంభించిన మూడేళ్లలోనే ప్రాణప్రతిష్ట చేసి దేశంలో ప్రతి వ్యక్తికి అక్షింతలు పంచి భగవంతుని ఆశీస్సులు అందించారన్నారు. పేదలకు ఉచిత రేషన్, ఇంటి ఇంటికి మరుగు దొడ్లు, ఉజ్వల్ గ్యాస్ కనెక్షన్లు, ఇలా ఎన్నో సంక్షేమ పథకాలు ప్రధాని నరేంద్ర మోడీ గొప్ప పరిపాలనకు నిదర్శమన్నారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఎటు 20 కిలోమీటర్లు ఉండే నియోజకవర్గం మధ్యలో యంజాల్ గ్రామం రింగ్ రోడ్ పక్కనే నాసొంత ఇల్లు ఉందని, మీకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే వాడి మీ ఇంటి మనిషిగా పనిచేస్తానన్నారు. మోడీ ప్రత్యేక శ్రద్ద పెట్టిన నియోజకవర్గం కాబట్టి బీజేపీని గెలిపించుకొని మరింత అభివృద్ధి చేసుకుందామన్నారు. ఈటల రాజేందర్ సమక్షంలో కమ్యూనిస్ట్ నాయకులు ఆకుల నాగయ్య బీజేపీ చేరారు. కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షులు మల్లేష్ యాదవ్, నిజాంపేట్ మున్సిపల్ అధ్యక్షులు ఆకుల సతీష్, నాయకులు జంగారెడ్డి గోనె మల్లారెడ్డి, నర్సింహా చారి, డి.ప్రభాకర్ రెడ్డి, నల్ల రామచంద్రరెడ్డి, సరుగారి సత్తిరెడ్డి, జంగారెడ్డి, రవికాంత్‌రెడ్డి, మాధవరెడ్డి, రమేష్‌చారి, వీరేష్ కుమార్, ప్రశాంత్‌కుమార్, పోలింగ్ బూత్ అధ్యక్షులు, కుల సంఘ నాయకులు చింత బిక్షపతి, బాలరాజ్, సత్యనారాయణ, లక్ష్మయ్య ప్రసాద్, బాలు, శ్రీకాంత్, అశోక్, అవినాష్ రెడ్డి, హరినాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రుణాలు సకాలంలో చెల్లిస్తే తక్కువ వడ్డీ

### తట్టేపల్లి పిఎసిఎస్ చైర్మన్ లక్ష్మారెడ్డి



**ప్రజాపక్షం/తాండూరు:** ప్రాథమిక సహకార సంఘంలోని సభ్యులకే ముందుగా ఎరువులను అందజేస్తామని తట్టేపల్లి పిఏసిఎస్ చైర్మన్ పి.లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం తట్టేపల్లి పిఏసిఎస్ చైర్మన్ లక్ష్మారెడ్డి అధ్యక్షతన మహజన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ సహకార సంఘంలో తీసుకున్న రుణాలను రైతులు సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధికి సహకరించాలని కోరారు. సకాలంలో రుణాలను చెల్లించిన రైతులకు రూ.30పైసల వడ్డి వర్తిస్తుందన్నారు. వైస్ చైర్మన్ అంజిలయ్య మాట్లాడుతూ సహకార సంఘంలో పనిచేస్తున్న సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించి రైతులకు పూర్తి స్థాయిలో సేవలు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ నారాయణగౌడ్, ఎంపిటిసి శంకర్ నాయక్, డైరక్టర్లు రహీం, సిఈఓ రాజ మౌళి, సిబ్బంది రాములు, జగదీశ్వర్ తదితరులు ఉన్నారు.

## ఫుడ్ సేఫ్టీపై వ్యాపారులకు శిక్షణ తరగతులు

### తాండూరు మున్సిపల్ కమిషనర్ విక్రమ సింహారెడ్డి

**ప్రజాపక్షం/తాండూరు:** తాండూరు పట్టణంలోని వ్యాపారులకు ఫుడ్ సేఫ్టీపై శిక్షణ తరగతులను ఏర్పాటు చేస్తామని తాండూరు మున్సిపల్ కమిషనర్ విక్రమసింహారెడ్డి వెల్లడించారు. మంగళవారం తాండూరు మున్సిపల్ కార్యాలయంలో ఫుడ్ సేఫ్టి జిల్లా కోఆర్డినేటర్ సునితతో కలసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. శిక్షణ పొందిన తరువాత వ్యాపారులకు సర్టిఫికెట్‌లను అందజేస్తామని తెలిపారు. ప్రతి వ్యాపారి విధిగా శిక్షణ పొంది కేంద్ర ప్రభుత్వం ద్వారా అందించే రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యాపారులకు శిక్షణ తరగతులపై త్వరలోనే తేదిలను ప్రకటిస్తామని తెలిపారు. జిల్లాలోనే 4వేలకు పైగా చిరువ్యాపారులు హోటల్స్, స్వీట్ హౌజ్, బేకరీలు, రేస్టారెంట్‌లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, బిర్యాని పాయింట్లు, కూల్‌డ్రింక్స్ జ్యూస్ సెంటర్స్, టిహబ్స్, ఐస్‌క్రీం పార్లర్స్, హోటల్స్, ఆహార సంబంధిత మార్కెట్లులకు వారు విధిగా శిక్షణ తరగతులను హాజరు కావాలని కోరారు.

# మల్కాజిగిరి పరిధిలో మొదటి ర్యాండమైజేషన్ పూర్తి

### మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మల్కాజిగిరి పార్లమెంటు పరిధిలో మొదటి ర్యాండమైజేషన్ పూర్తయిందని పార్లమెంటు ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ గౌతం పేర్కొన్నారు. జిల్లా కలెక్టరేట్లో మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారిణి హరిప్రియ, ఎన్నికల అధికారులతో కల్సి ఎన్నికల సంఘ నిబంధనల మేరకు ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేసారు. జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల విధులు నిర్వహించే ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులను 2425 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి 13226 మంది పోలింగ్ సిబ్బందిని కేటాయించామని ఆయన తెలిపారు. వీరందరికి శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు.

**వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లాలో జరిగిన సాధారణ విధులు నిర్వహించే పిఓ, ఎపిఓ, ఓపిఓల విధుల కేటాయింపునకు మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించినట్లు జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. ఐడిఓసి ఎన్ఐసి వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నియోజకవర్గాలకు సిబ్బంది కేటాయింపునకు ఆన్‌లైన్‌ద్వారా మొదటి విడుత ర్యాండమైజేషన్ పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో నాలుగు నియోజకవర్గాలు కొడంగల్ ,పరిగి, తాండూర్ , వికారాబాద్ నియోజకవర్గాలకు పిఓ ,ఎపిఓ ,ఓపి ఓ పోలింగ్ సిబ్బందిరి మొదటి దశ ర్యాండమైజసన ద్వారా చూపించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ , లింగ్యా నాయక్ , శ్రీనివాస్ , మహమ్మద్,తదితరులు పాల్గొన్నారు.



### ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనది

ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనది ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని .అందరికి అవగాహనా కలిగే విదంగా స్వీప్ కార్యక్రమ లో భాగంగా 5కే రన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్వీప్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని ఎన్నెపల్లి చౌరస్తా నుండి అలంపల్లి చౌరస్తా వరకు ఉదయం 6గంటలకు 5కే రన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఏర్పాటు చేసిన 5కే రన్‌లో పాల్గొనాలని కోరారు. జిల్లాలో ప్రభుత్వ,ప్రైవేట్ ,మెటికల్ నర్సింగ్ కళశాలవిద్యార్థులు ,యువత పెద్ద సంఖ్యలో పాల్గోనేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను అదేశించారు.

## పెంచిన 'టెట్' ఫీజు తగ్గించాలి

**ప్రజాపక్షం/బోడుప్పల్:** టెట్ పరీక్ష ఫీజు అధికంగా ఉండడం వల్ల నిరుద్యోగులపై పెనుభారం పడుతుందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ తెలిపారు. గతంలో ఒక పేపర్ రాస్తే రూ.200, రెండు పేపర్లు రాస్తే రూ.300 ఫీజు ఉండేదని అన్నారు. కానీ ఇప్పుడు ఒక పేపర్‌కు వెయ్యిరూపాయలు, రెండు పేపర్లు రాస్లే రెండు వేలు ఫీజుగా వసూలు చేయడం దారుణమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో పోటీ పరీక్షల ఫీజులు తగ్గిస్తామని హామీ ఇచ్చి దానికి విరుద్దంగా వ్యవహరిస్తోందని అన్నారు. అధిక ఫీజుల వల్ల ఎంతోమంది పరీక్షలు రాయలేని పరిస్థితి నెలకొందని తెలిపారు. ఇప్పటికే బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పరీక్ష ఫీజులు కట్టి, కోచింగ్ తీసుకుని పరీక్షలుకు సన్నద్ధం అయితే అవకతవకల వల్ల అది ఆగిపోయి నిరుద్యోగులపై పెనుభారం పడిందని అన్నారు. ఈ నేపథ్యంలో పాత ఫీజునే టెట్ పరీక్షకు వసూలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు అండగా ఉండాలని కోరారు. పెంచిన టెట్ పరీక్ష ఫీజు తగ్గించాలని వారు డిమాండ్ చేశారు.



## ప్రతి ఓటరు ఓటు హక్కు వినియోగించుకోవాలి

### స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మహబూబ్‌నగర్ పట్టణంలో స్వీప్ ఆధ్వర్యంలో సిస్టమాటిక్ ఓటర్స్ ఎడుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ కార్యక్రమాల్లో భాగంగా మంగళవారంఓటరు అవగాహన చైతన్య ర్యాలీ నిర్వహించారు . డి.ఎస్ .ఏ స్టేడియం వద్ద స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ జెండా ఊపి ర్యాలీ ని ప్రారంభించారు . పట్టణంలో డీఎస్ ఏ స్టేడియం నుండి ప్రారంభమైన ర్యాలీ బస్ స్టాండ్ , తెలంగాణ చౌరస్తా మీదుగా ప్రధాన వీధుల్లో ప్రజలను చైతన్య పరుస్తూ ముగిసింది . ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు చాలా విలువైనదని , ప్రతీ ఓటరు ఎన్నికలలో పాల్గొని ఓటు హక్కు ను వినియోగించు కోవాలని పిలుపునిచ్చారు రాబోయె పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో ందరూ భాగస్వాములు కావాలని కోరారు . ర్యాలీలో భాగంగా అందరికీ వినిపించేలా పలు నినాదాలిచ్చారు. జిల్లా స్వీప్ కార్యక్రమాల నోడల్ అధికారి డా.శ్రీధర్ సుమన్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. స్వీప్ నోడల అధికారి డా.శ్రీధర్ సుమన్ మాట్లాడుతూ తెలంగాణ ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో ఓటర్లను చైతన్య పరిచే కార్యక్రమంలో భాగంగా స్వీప్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ నవీన్, జిల్లా యువ జన క్రీడల అధికారి శ్రీనివాస్, జిల్లా పౌర సంబంధాల అధికారి డిపిఆర్ఓ పి.శ్రీనివాస్, ఎల్‌డియం భాస్కర్ ఇంటర్ విద్యాశాఖ, పాఠశాల విద్యాశాఖ అధికారులు, ఉద్యోగులు, బూత్ లెవల్ అధికారులు , ఉద్యోగులు, కళాకారులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమం విజయవంతం చేశారు.

## టెట్ పరీక్ష ఫీజును తగ్గించాలి

### బిసి సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ ఫీజులను ఒక్కొక్క పేపర్ 200 రూపాయలు నుండి 1000 రూపాయలకు పెంచుతూ రాష్ట్ర విద్యాశాఖ విడుదల చేసిన టెట్ నోటిఫికేషన్లో పేర్కొన్న ఫీజులను తగ్గించాలని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్ సాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో 200 ఉన్న ఫీజులు ఇప్పుడు 1000 రూపాయలుగా నిర్ణయించగా, 300 ఉన్న ఫీజును 2000 గా పెంచడం పట్ల విద్యార్థులకు, నిరుద్యోగులకు భారం కాబట్టి గతంలో ఉన్నట్లే 200,300 పరీక్ష ఫీజును ప్రభుత్వం నిర్ణయించి ఆదుకోవాలని శ్రీనివాస్ సాగర్ కోరారు.

## పోలింగ్ బృందాలు ఏర్పాటు



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** లోక్ సభ ఎన్నికల సందర్భంగా మొదటి ర్యాండమైజేషన్ నిర్వహించి పోలింగ్ బృందాలు నియమించారు. మంగళవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జి.రవి నాయక్ ఆధ్వర్యంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ఎన్ఐసి కాన్ఫరెన్సు హాల్‌లో ప్రత్యేక సాఫ్ట్ వేర్ ద్వారా మహబూబ్‌నగర్ జిల్లాకు పోలింగు బృందాల నియామకం కొరకు మొదటి ర్యాండమైజేషన్ నిర్వహించి అవసరమైన సంఖ్యలో రిజర్వు తో సహ ఒక్కొక్క బృందంలో నలుగురు పిఓ , ఏపిఓ ఇద్దరు ఓపిఓ లతో పోలింగు బృందాలు నియమించి ఉత్తర్వులు జారీ చేశారు. మూడు రోజుల్లో ఉత్తర్వులు సంబంధిత పోలింగు సిబ్బందికి అందజేయాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ పాల్గొన్నారు.

## ఎంఎల్‌సి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి:** ఈ నెల 28న జరగనున్న మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గ శాసనమండలి ఉప ఎన్నిక పోలింగుకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి , జిల్లా కలెక్టర్ జి.రవి నాయక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఎంపిడిఓ లో ఏర్పాటు చేసిన పోలింగు కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పరిశీలించారు. పోలింగు కేంద్రం వద్ద 100 మీ ల పరిధి మార్క్ చేసి బారి కేడింగ్ ఏర్పాటు చేయాలని, పోలింగు కేంద్రంలో అవసరమైన ఏర్పాటు చేయాలని అధికారులకు సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్ తో పాటు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, జడ్పిసిఈఓ రాఘవేంద్ర రావు, అర్‌డిఓ నవీన్ పాల్గొన్నారు.

## మొదటివిడత ర్యాండమైజేషన్ పూర్తి

### జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** నాగర్‌కర్నూల్ జిల్లాకు సంబంధించి పార్లమెంట్ ఎన్నికల నిబంధనల ప్రకారం పోలింగ్ సిబ్బందికి సంబంధించి మొదటి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను చేపట్టారు. ఈమేరకు మంగళవారం జిల్లా కలెక్టరేట్ ఎన్ఐసి వీడియో సమావేశమందిరంలో జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎన్నికల సిబ్బందికి సంబంధించి మొదటి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను చేపట్టారు. ఈసందర్భంగా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, కొల్లాపూర్, అచ్చంపేటతోపాటు జడ్చర్ల నియోజకవర్గ పరిధిలోని ఊర్కొండ మండల శాసనసభ నియోజకవర్గాలకు సంబంధించి మొత్తం 909 పోలింగ్‌కేంద్రాలకు సంబంధించి 20శాతం అదనంగా 4552 మందిని మొదటివిడత ర్యాండమైజేషన్ ద్వారా ఎంపిక చేయడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు కుమార్‌దీపక్, కె.సీతారామారావు, కలెక్టరేట్ ఏఓ చంద్రశేఖర్, ఈడియం నరేష్, ఎన్ఐసి సిబ్బంది అర్షద్, శివ, మధు పాల్గొన్నారు.

## అర్ధరాత్రి అంబులెన్స్‌లో ప్రసవం

**ప్రజాపక్షం/అచ్చంపేట :** అర్ధరాత్రి నల్లమల అడవిలో అంబులెన్స్‌లో ప్రసవించిన చెంచుమహిళ సంఘటన అచ్చంపేట నియోజకవర్గంలో జరిగింది. బాధితురాలి భర్త లింగయ్య వివరాల ప్రకారం నల్లమల అభయారణ్యంలోని ఓమారుమూల గ్రామానికిచెందిన మహిళ అర్ధరాత్రి అంబులెన్స్‌లో ప్రసవించిన సంఘటన స్థానికులను కలచివేసింది. అమ్రాబాద్ మండలం ఉప్పునుంతల బికె గ్రామానికిచెందిన వెంకటమ్మకు శనివారం రాత్రి 9గంటలప్రాంతంలో పురిటినొప్పులు ప్రారంభమయ్యాయి. భర్త లింగయ్య కుటుంబసభ్యులతోకలిసి సమీపంలో ఉన్న ప్రైవేట్ ఆటోలో అమ్రాబాద్ ఆస్పత్రికి తీసుకువచ్చారు. అక్కడ డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో సిబ్బందికి అచ్చంపేటకు వెళ్లాల్సిందిగా తెలిపారు. 108వాహనంలో ప్రసవించింది. ప్రసవ సమయంలో డాక్టర్ లేకపోవడంతో అమ్రాబాద్ వైద్య పారామెడికల్ సిబ్బందికూడా వెంటరాకపోవడంతో 108సిబ్బంది మల్లేష్, కిరణ్ డెలివరి చేశారు. వెంకటమ్మకు ఆడపిల్ల జన్మించగా తల్లిబిడ్డను అచ్చంపేట ఆస్పత్రికి తరలించారు. అచ్చంపేట ఏరియా ఆస్పత్రిలో ప్రభుత్వ సిబ్బంది డాక్టర్ కనీసం స్పందించకపోవడంపై బాధితురాలి భర్త తీవ్ర అసహనానికి గురయ్యాడు.

# బ్యాలెట్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి




**ప్రజాపక్షం / వనపర్తి టౌన్ :** పోస్టల్ బ్యాలెట్ , హోం ఓటింగ్ ప్రక్రియను అత్యంత పకడ్బందీగా నిర్వహించేందుకు సన్నాహాలు చేయాలని వనపర్తి జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. 85 సంవత్సరాల వయస్సు పూర్తి అయిన ఓటర్లు, దివ్యాంగులకు హోం ఓటింగ్ తో పాటు పోలింగ్ సిబ్బంది, అత్యవసర సేవల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ఇచ్చే ప్రక్రియ పకడ్బందీగా జరిగేందుకు మంగళవారం ఉదయం జిల్లా ఎన్నికల అధఇకారి కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో పోస్టల్ బ్యాలెట్ , మ్యాన్ పవర్ మేనేజ్మెంట్ నోడల్ అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వివరిస్తూ హోం ఓటింగ్ ఎవరికి ఇవ్వాలని, పోస్టల్ బ్యాలెట్ ఎవరికి వస్తుంది అనేది అధికారులకు స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. 85 సంవత్సరాల వయస్సు పూర్తి అయిన వారు, దివ్యాంగులకు హోం ఓటింగ్ కల్పించడం జరుగుతుందని అందుకు సంబంధిత ఓటర్లకు ఫారం 12డి ఇవ్వాలని తెలిపారు. వచ్చిన దరఖాస్తులకు అనుగుణంగా ఎన్నికల రోజు కంటే ముందే గుర్తించిన హోం ఓటర్ల ఇంటికి వెళ్లి ఓటింగ్ వేయించాల్సి ఉంటుందన్నారు. పోస్టల్ బ్యాలెట్ విషయంలో ఎన్నికల రోజున విధులు నిర్వహించే పోలింగ్ సిబ్బంది, ఈ ప్రక్రియలో పాల్గొనే డ్రైవర్లు, కండక్టర్లు, పోలీస్ సిబ్బంది, మీడియా ప్రతినిధులు, సర్వీస్ ఓటర్లకు ఫారం 12 అందించి దరఖాస్తు చేసుకున్న ఓటర్లకు ఓటర్ ఫెసిలిటేశన్ సెంటర్‌లో ఓటింగ్ వేసే విధంగా ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. ఫెసిలిటేషన్ సెంటర్‌లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయడానికి వచ్చే ఇతర జిల్లా, ప్రాంత సిబ్బందికి ఒక రోజు స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అవగాహన లేకపోవడం చేత పోస్టల్ బ్యాలెట్‌లు కొన్ని చెల్లకుండ ఉంటున్నాయని ఈ సారి ఒక్క ఓటు కూడా చెల్లని ఓటు పడకుండా పోస్టల్ బ్యాలెట్ ఓటర్లకు అవగాహన కల్పించాలని సూచించారు. వయస్సు పైబడి ఆరోగ్యం సహకరించక, దివ్యంగులు పోలింగ్ స్టేషన్ వరకు నడవలేక, లేదా ఎన్నికల విధులు నిర్వహిస్తూ పోలింగ్ స్టేషన్ వెళ్లి ఓటు వేయలేని పరిస్థితిలో ఒక్క ఓటరు మిగిలిపోవద్దని సూచించారు. దీని కొరకు పకడ్బందీగా ఓటర్లను గుర్తించడం వారికి ఫారం 12 లేదా 12 డి అందించి జిల్లాలో అత్యధికంగా ఓటింగ్ శాతం పెంచాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ంచిత్ గంగ్వార్ , అదనపు కలెక్టర్ రెవెన్యూ, ఎం. నగేష్ , పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి సురేష్ , తహసీల్దార్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన తిరుమల మహేష్



**ప్రజాపక్షం / వనపర్తి టౌన్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని వనపర్తి పట్టణ కేంద్రానికి చెందిన బిఆర్ఎస్ నాయకుడు తెలంగాణ కో ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ మాజీ డైరెక్టర్ , ప్రముఖ బిల్డర్ తిరుమలమ మహేశ్ సోమవారం రాత్రి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. మాజీ మంత్రి, ప్రణాళిక సంఘం వైస్ ప్రెసిడెంట్ జి. చిన్నారెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిఇసి పూలమాల బొకేను ఇచ్చి శాలువాతో సన్మానించారు. తిరుమల మహేశ్ చేస్తున్న సామాజిక సేవలను సీఎంకు చిన్నారెడ్డి వివరించారు. దీంతో సీఎం కాంగ్రెస్ పార్టీలోకి తిరుమల మహేశ్‌ను ఆహ్వానించారు. వనపర్తితో పరిచయాలు ఉన్న సీఎం తిరుమల మహేశ్‌ను అప్యాయంగా పలుకరించారు. త్వరలో వనపర్తి ఎమ్మెల్యే మెగారెడ్డి నాయకత్వంలో తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జీ దీప్ దాస్ మున్సి సమక్షంలో తిరుమల మహేశ్ తన అనుచరులతో భారీ ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. బీసీ సామాజిక వర్గంలో బలమైన నేతగా తిరుమల మహేశ్‌కు మంచి పేరుందని చిన్నారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా నాయకురాలు ధనలక్ష్మి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే మెగారెడ్డికి ఆర్యవైశ్య సంఘం సన్మానం



**ప్రజాపక్షం /పెబ్బేరు :** జిల్లా కేంద్రంలో పెబ్బేరు మండలం ఆర్యవైశ్య సంఘం సభ్యులు ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానం చేయడం జరిగింది. పెబ్బేరు మండలం ఆర్యవైశ్య సంఘం టౌన్ అధ్యక్షులు ఎటుకూరి బుచ్చయ్య , మండల అధ్యక్షులు రమేష్ ఆర్యవైశ్య సంఘం సభ్యులు అందరు కలిసి వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి బొకే ఇచ్చి శాలువతో ఘనంగా సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పెబ్బేరు మండల ఆర్యవైశ్య సంఘం టౌన్ అధ్యక్షులు ఇటుకూరి బుచ్చయ్య, మండల అధఅయక్షుడు రమేష్ , పెబ్బేరు మండల ఆర్య వైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## మహిళలకు నిరంతరం అండగా షీటీమ్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** మహిళలకు నిరంతరం అండగా షీటీం ఉంటుందని ఉమెన్‌సేఫ్టీవింగ్ ఆడిషనల్ ఎస్‌పి సిహెచ్ రామేశ్వర్ అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని నెల్లికొండ ప్రభుత్వసైన్స్ డిగ్రీ కళాశాలలో షీటీంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులతో ఫ్రెండ్లీపోలీసింగ్ విధానంలో పలుసూచనలు చేశారు. పోలీసులకు భయపడాల్సిన పనిలేదని తప్పుచేసిన వారుమాత్రమే పోలీసులకు చట్టానికి భయపడతారన్నారు. కావున విద్యార్థులు మంచి భవిష్యత్తు నిర్మించుకునే విధంగా సమాజంలో ఇటు అధ్యాపకులకు అటు తల్లిదండ్రులకు మంచిపేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని పలు ఉదాహారణలతో వివరించారు. చట్టం ఎవరికి చుట్టంకాదని దానికి అందరూ సమానమేనని తెలిపారు. ప్రస్తుత సమాజంలో సోషల్‌మీడియా బారినపడి యువత తప్పుదోవపడుతుందని దయచేసి ఏది మంచో ఏదిచెడో తెలుసుకోవాలని సూచించారు. టెక్నాలజి పెరిగేకొద్ది మహిళలపైదాడులు పెరుగుతున్నాయని అందుకు అనుగుణంగా మహిళలు తెలివిగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. మహిళలు చిన్నారులు ఎలాంటి వేధింపులకుగురైన 8712657676, లేదా 100నెంబర్‌కి కాల్‌చేయాలని తక్షణమే మూడోకంటికి తెలియకుండానే సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎఎస్ఐ విజయలక్ష్మి , వెంకటయ్య, ఉమాదేవి, వనిత, కళాశాల ప్రిన్సిపాల్ కమర్‌షా జహాన్‌సుల్తానా, విద్యార్థినిలు పాల్గొన్నారు.

## క్రికెట్ బెట్టింగులకు పాల్పడితే కఠిన చర్యలు

### జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్

**ప్రజాపక్షం / నారాయణపేట ప్రతినిధి :** ప్రస్తుతం ఐపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ నడుస్తున్నందున చాలా మంది యువత ఈజీగా డబ్బులు సంపాదించడం కోసం క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడటం జరుగుతుందని అలాంటి వారి పట్ల కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. క్రికెట్ బెట్టింగ్ , ప్లేయింగ్ కార్డ్స్ , అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

## బాలల సంరక్షణపై అవగాహన సదస్సు

**ప్రజాపక్షం / శ్రీరంగాపూరం :** మండల కేంద్రంలో మంగళవారం జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్ లైన్ వనపర్తి ఆధ్వర్యంలో గ్రామస్తులకు బాలల సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంరక్షణ అధికారి సురేందర్ మాట్లాడుతూ 18 సంవత్సరాల వయస్సు కంటే తక్కువగా ఉన్న బాల బాలికలందరూ బాలలే అని వారికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉందని తెలిపారు.

## సాహిత్యం సంస్కృతి అంశంపై ఒకరోజు అంతర్జాతీయ కార్యాశాల



**ప్రజాపక్షం/జడ్చర్ల :** స్థానిక బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ లాంగ్వేజెస్ (తెలుగు, హిందీ, ఇంగ్లీష్ , సంస్కృతం) సంయుక్త ఆధ్వర్యంలో సాహిత్యం సంస్కృతి అనే అంశం పై ఒకరోజు అంతర్జాతీయ కార్యాశాల నిర్వహణలో భాగంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పియ చిన్నమ్మ సభకు అధ్యక్షత వహించారు. కళాశాల నాక్ ఏ గ్రేడ్ సాధించిన తర్వాత నిర్వహించే మొట్టమొదటి అంతర్జాతీయ కార్యశాల డిపార్ట్‌మెంట్ ఆఫ్ లాంగ్వేజెస్ నిర్వహించడం ఎంతో శుభదాయకమని ప్రశంసించారు. యన్.సుభాషిని తెలుగు సంస్కృత శాఖ అధ్యక్షులు ప్రధాన వక్తలను సభకు పరిచయం చేస్తూ, వారికి వక్తలకు మధ్యన ఉన్న అనుబంధాన్ని నెమరువేసుకున్నారు. మూలధ్వని అనే అంశం పై న కళాశాల విద్యార్థిని విద్యార్థులతో జిజ్ఞాస ప్రాజెక్టులో భాగంగా కళాశాల విద్యార్థులు జయదీర్ తిరుమలరావు ఆచార్య గూడూరు మనోజ సారధ్యంలో అనేక విషయాలను తెలుసుకున్నారని జిజ్ఞాస విద్యార్థులు ఈ సందర్భంగా తెలియజేశారు. సమావేశంలో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులకు కళాశాల అధ్యాపకులకు కళాశాల ప్రిన్సిపాల్ డా.అభ్యర్థి చిన్నమ్మ చేతుల మీదుగా సర్టిఫికెట్స్ ఇవ్వడం జరిగింది. ఈ సభకు సమన్వయకర్తలు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేసినందుకు యాదయ్య వందన సమర్పణతో కార్యశాల ముగింపు జరిగింది. ఈ సమావేశంలో కళాశాల అధ్యాపక అధ్యాపకేతర విద్యార్థిని విద్యార్థులు అందరూ పాల్గొన్నారు.


## మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం




**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** మండలంలోని ఇప్పపహాడ్ గ్రామానికిచెందిన మురుగని లక్ష్మమ్మ అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాదారం మాజీసర్పంచ్, కాంగ్రెస్‌మండలపార్టీ వర్కింగ్‌ప్రెసిడెంట్ ధ్యాపనిఖిల్‌రెడ్డి మృతురాలి కుటుంబానికి కాంగ్రెస్ నాయకులద్వారా రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. అదేగ్రామానికిచెందిన కానుగుల జంగమ్మ అనారోగ్యంతో మృతిచెందగా ఆమె కుటుంబానికి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఐఎన్‌టియుసి మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్‌పార్టీసేవాదల్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుబ్బయాదయ్య, యువజన కాంగ్రెస్ జిల్లాకార్యదర్శి నాగరాజు, నాయకులు మల్లేష్, చంద్రయ్య, బుచ్చయ్య, సుందర్‌రెడ్డి, లక్ష్మయ్యగౌడ్, విష్ణువర్ధన్ రెడ్డి, కృష్ణయ్య పాల్గొన్నారు.

# విహారయాత్రలు...విజయాన్నిస్తాయా?

### పాలమూరు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు అంతా టూర్లో..! 28న నేరుగా పోలింగ్ కేంద్రాలకు ప్రజాప్రతినిధులు





**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు ఇరు పార్టీలు పోటీ పోటీగా వ్యూహాలు పన్నుతున్నారు. మెజార్టీ ప్రజాప్రతినిధి అంతా టిఆర్ఎస్ పార్టీకి చెందిన వారైనప్పటికీ కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతుంది. కల్వకుర్తి ఎమ్మెల్యేగా ఎన్నికైన కసిరెడ్డి నారాయణరెడ్డి టిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరి ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందారు. దీంతో గతంలో ఎమ్మెల్సీగా ఉన్న కసిరెడ్డి నారాయణరెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. ఖాళీ ఏర్పడిన ఎమ్మెల్సీ స్థానానికి ఉప ఎన్నికలు అనివార్యమైనాయి. దీంతో కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంఎస్ఎన్ ఫార్మా కంపెనీకి చెందిన మన్నే జీవన్‌రెడ్డి ని ప్రస్తుత పార్లమెంటు సభ్యుడు మన్నె జీవన్ రెడ్డిని అభ్యర్థిగా ఎంపిక చేసి రంగంలో దించింది. మన్నే జీవన్‌రెడ్డి ప్రస్తుత పార్లమెంటు సభ్యుడు మన్నె శ్రీనివాస్‌రెడ్డికి స్వయాన అన్న కొడుకు అయినప్పటికి కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా మన్నే జీవన్‌రెడ్డిని ఎంపిక చేసింది. దీంతో ఉప ఎన్నికల్లో మెజార్టీ ఉండి గెలుపొందాల్సిన ఎమ్మెల్సీ స్థానానికి బిఆర్ఎస్ పార్టీ తంటాలే పడుతుంది. టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిషత్ ఉపాధ్యక్షులుగా వ్యవహరిస్తున్న నవీన్ కుమార్ రెడ్డిని ఎంపిక చేశారు. ఇరు పార్టీల అభ్యర్థులు సహితం గెలిచేందుకు భారీగానే ఖర్చు చేయాల్సి వస్తుంది. ఈ మేరకు ఇరు పార్టీల అభ్యర్థులు తమకు మద్దతు తెలిపే ప్రజాప్రతినిందని విహారయాత్రకు తరలించారు. ప్రస్తుతం అందరు క్యాంపుల్లోనే బిజీగా ఉన్నారు. జిల్లాలో మొత్తం 1439 ఓటర్లు ఉన్నారు. ఇందులో ఇద్దరు ఎంపీలు (నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్) 14 మంది ఎమ్మెల్యేలు ఇందులో ఇద్దరు బిఆర్ఎస్ పార్టీకి చెందినవారు, ముగ్గురు ఎమ్మెల్సీలు, 888 మంది ఎంపీటీసీలు, 449 మంది వివిధ మున్సిపాలిటీలో కౌన్సిలర్లుగా ఉన్నారు. మొత్తం 1439 స్థానిక సంస్థల్లో ఓటర్లుగా ఉన్నారు. గత ఎన్నికల్లో టిఆర్ఎస్ మద్దతు గెలిచిన వీరంతా తమకే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేస్తారని టిఆర్ఎస్ పార్టీ నమ్ముతుంది. అయితే ప్రభుత్వం మారడంతో స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులందరూ ఒక్కొక్కరుగా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుంటున్నారు. ప్రస్తుత బలాబలాలను బేరీజు వేస్తే కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులే ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తుంది. ఉప ఎన్నికలు రావడంతో ఒక్కో ప్రజాప్రతినిధి మూడు నుంచి ఐదు లక్షల రూపాయలు డిమాండు చేస్తున్నట్లు తెలుస్తుంది. ప్రజాప్రతినిధులు డిమాండ్లకు అనుగుణంగానే ప్రస్తుత ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎలాగైనా తమ పార్టీ ఎన్నికల్లో గెలవాలని లక్ష్యంగా డబ్బుకు వెనకాడడం లేదు. ఈ కారణంగానే గత పది రోజుల నుండి, ప్రజాప్రతినిధులు అందరిని తమ మద్దతుదారులతో గోవా, కోడైకెనాల్ తదితర ప్రాంతాలకు విహారయాత్రకు వెళ్లినట్టు తెలుస్తుంది. ఈ నెల 28న ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పోలింగు జరగనున్న సందర్భంగా నేరుగా ప్రజాప్రతినిధి లన్దరినీ అదే రోజు పోలింగు కేంద్రాలకు తరలించేందుకు ఇరు పార్టీల నేతలు, మద్దతు దారులు ఏర్పాట్లు చేసుకున్నారు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొట్టమొదటిసారిగా జరగుతున్న ఉప ఎన్నికల్లో తమ సత్తా ఏంటో నిరూపించాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తుంది. అదే విధంగా బిఆర్ఎస్ పార్టీ సైతం తమ పార్టీ మద్దతుదారులే అధిక సంఖ్యలో ఉండడంతో తమ గెలుపు సునాయసమవుతుందని భావిస్తున్నారు. ఎవరి ధీమాలో వారు ఉన్నా చివరకు కాంగ్రెస్ పార్టీని విజయం వరిస్తుందని అందరు భావిస్తున్నారు.

### ఫోన్ ట్యాపింగ్ కేసుతో తనకు

## ఎటువంటి సంబంధం లేదు

### బిఆర్ఎస్ మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఫోన్ ట్యాపింగ్ కేసుతో తనకు ఎటువంటి సంబంధం లేదని బిఆర్ఎస్ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. ప్రణీత్ రావు ఎవరో తనకు తెలియదన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మట్లాడుతూ చరణ్ చౌదరి ఎవరో తనకు తెలియదని, ఆయన బిజెపిలో ఉండి భూ కబ్జాలకు పాల్పడుతున్నారని, ఆయనను పార్టీ నుండి సస్పెండ్ చేశారన్నారు. 40 ఏళ్ల రాజకీయ జీవితంలోతనపై ఎటువంటి మచ్చ లేదన్నారు. ఓటు నోటు కేసుతో కూడా తనకు ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.

## వరుణ్ గాంధీకి కాంగ్రెస్ ఆహ్వానం

**బహరాంపూర్ :** బిజెపి నేత వరుణ్ గాంధీకి కాంగ్రెస్ పార్టీ ఆహ్వానం పలికింది. తమ పార్టీలో చేరాలని సూచించింది. ఇటీవల బిజెపి లోక్‌సభ అభ్యర్థుల 5వ జాబితాలో వరుణ్ గాంధీని తప్పించింది. ఉత్తర్ ప్రదేశ్ పిలిభిత్ ఎంపి స్థానం నుంచి సిట్టింగ్ ఎంపిగా ఉన్న వరుణ్ గాంధీని కాదని, ఆ స్థానాన్ని మాజీ కేంద్ర మంత్రి జితిన్ ప్రసాదకు కేటాయింది. గత కొంత కాలంగా వరుణ్ గాంధీకి ఈ సారి ఎంపి టికెట్ ఇవ్వకపోవచ్చనే ప్రచారం నేపథ్యంలో బిజెపి అన్నంత పనిచేసింది. అయితే, ఆయన తల్లి మేనకాగాంధీని సుల్తాన్ పూర్ నుంచి బిజెపి బరిలోకి దించింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ సీనియర్ నేత అధీర్ రంజన్ చౌదరి, వరుణ్ గాంధీని కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. గాంధీ కుటుంబంతో సంబంధం ఉందనే కారణంగానే ఆయనకు బిజెపి టికెట్ ఇవ్వలేదని అధీర్ ఆరోపించారు. ‘అతను (వరుణ్ గాంధీ) కాంగ్రెస్‌లో చేరాలి. అతను చేరితే మేము సంతోషిస్తాము. అతను బాగా చదువుకున్న రాజకీయ నాయకుడు. మంచి ఇమేజ్ ఉన్న నాయకుడు. గాంధీ కుటుంబంతో సంబంధాలు ఉన్నాయి. దీని కారణంగానే బిజెపి ఆయనకు టికెట్ ఇవ్వలేదు. వరుణ్ గాంధీ కాంగ్రెస్‌లో చేరాలని మేము కోరుకుంటున్నాము’’ అని అధీర్ అన్నారు. అయితే, ఒక వేళ బిజెపి టికెట్ నిరాకరిస్తే ఇండిపెండెంట్‌గా బరిలో దిగేందుకు సిద్ధంగా ఉన్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే తన సహచరుల ద్వారా నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలు, పిలిభిత్‌లో ప్రచారం కోసం వాహనాలు సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. అయితే, దీనిపై వరుణ్ గాంధీ శిబిరం నుంచి ఎలాంటి అధికారిక సమాచారం మాత్రం రాలేదు. గతంలో యూపీలోని యోగి ఆదిత్యనాథ్ సర్కార్‌పై పలు సందర్భాల్లో విమర్శలు చేసిన వరుణ్ గాంధీ, బిజెపితో చాలా అంశాల్లో విభేదిస్తున్నారు.

## నౌక ఢీకొని కూలిన బ్రిడ్జి

### నదిలో పడిన వాహనాలు

**బాల్టిమోర్ల్ :** అమెరికాలో ఘోర ప్రమాదం జరిగింది. మంగళవారం ఉదయం మేరీల్యాండ్‌లోని బాల్టిమోర్‌లోని ఫ్రాన్సిస్ స్కాట్ కీ బ్రిడ్జి కుప్ప కూలిపోయింది. పాతాప్స్కో నదిలో ఒక పెద్ద కంటైనర్ షిప్ ఢీకొనడంతో నిమిషాల్లోనే వంతెన కూలిపోయింది. ఈ ప్రమాదం జరిగినప్పుడు.. కొన్ని కార్లు, కొంతమంది నదిలో పడిపోయినట్లు పడిపోయారు. వారి కోసం అధికారులు గాలిస్తున్నారు. అందులో ఇద్దరిని రక్షించగా, ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు బాల్టిమోర్ ఫైర్ చీఫ్ జెమ్స్ వల్లాస్ తెలిపారు. ఓ భారీ షిప్ వెళ్లాల్సిన దారిలో కాకుండా.. బ్రిడ్జి ఫిల్లర్‌ను బలంగా ఢీకొట్టడంతో ఒక్కసారిగా బ్రిడ్జి సెకన్ల కాలంలో కూలిపోయింది. ప్రమాద సమయంలో వంతెనపై ఉన్న వాహనాలు నదిలో పడిపోయాయి. అంతేకాకుండా ఓడలో కూడా మంటలు చెలరేగాయి. అనంతరం షిప్ కూడా నదిలో మునిగిపోయినట్లు తెలుస్తోంది. దాదాపు 20 మందికి పైగా వ్యక్తులు నదిలో పడిపోయినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. వారి కోసం గాలిస్తున్నట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న అధికారులు సంఘటనాస్థలికి చేరుకుని సహాయ చర్యలు చేపట్టారు. ప్రమాదం తర్వాత రెండు వైపుల నుంచి అన్ని మార్గాలను మూసివేసి ట్రాఫిక్‌ను నిలిపివేసినట్లు మేరీల్యాండ ట్రాన్స్‌పోర్టేషన్ అథారిటీ తెలిపింది. వాహనాలు నీటిలో మునిగి పోవడంతో పలువురు మృతి చెందే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఇదిలా ఉంటే బ్రిడ్జి కూలిపోతున్న వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. బ్రిడ్జిని ఢీకొన్న నౌక సింగపూర్‌కు చెందిన ‘డాలీ’గా గుర్తించారు. ఇది శ్రీలంక రాజధాని కొలంబోకు వెళ్తున్నట్టు తెలుస్తోంది. కాగా 1977లో మేరీల్యాండ్‌లోని బాల్టిమోర్‌లో ఫ్రాన్సిస్ స్కాట్ కీ వంతెనను నిర్మించారు. ఫ్రాన్సిస్ స్కాట్ కీ అనే వ్యక్తి అమెరికాకు జాతీయ గీతాన్ని రాసిన వ్యక్తి. అతని పేరే ఈ బ్రిడ్జికి పెట్టారు.

## మయన్మార్ రాయబారిగా అభయ్ ఠాకూర్

**న్యూఢిల్లీ :** మయన్మార్‌కు భారతదేశ రాయబారిగా అభయ్ ఠాకూర్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖలో స్పెషల్ డ్యూటీ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. ఆయన నియామకంపై విదేశాంగశాఖ మంగళవారం నాడు ఒక ప్రకటన విడుదల చేసింది. 1992 బ్యాచ్‌కు చెదిన ఐఎఫ్ఎస్ అధికారి ఠాకూర్ త్వరలో మయన్మార్ రాయబారిగా బాధ్యతలు చేపడతారు. 2021 ఫిబ్రవరి 1 వ తేదీ నుండీ మయన్మార్‌లో ప్రజాస్వామ్య పునరుద్ధరణను కోరుతూ నిరసనలు, హింస కొనసాగుతున్నాయి. మయన్మార్‌లో తిరిగి శాంతి చేకూరాలని భారత్ కోరుకుంటున్నదని విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ అన్నారు.

## ఆమె శక్తి స్వరూపిణి - మోడీ ప్రశంస

**న్యూఢిల్లీ/కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్‌లో వివాదాస్పదంగా మారిన సందేశ్‌ఖలీ గ్రామంలో మహిళల సమస్యలను ధీరోదాత్తంగా ప్రచారం చేస్తున్న బషిర్‌హత్ నియోజకవర్గ బిజెపి ఎంపి అభ్యర్థి రేఖా పాత్రను ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రశంసించారు. ఆమెను ‘‘శక్తి స్వరూపిణి’’గా అభివర్ణించారు. సందేశ్‌ఖలీ గ్రామంలో స్త్రీలు దారుణమైన అరాచకాలకు గురవుతున్నారంటూ ఆమె భారీ ప్రచారం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆమెను మోడీ ప్రశంసించారు. ఆమె ప్రచారం తీరును అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో మహిళలపై దారుణ అరాచకాలకు పాల్పడిన షాజహాన్ షేక్, అతడిని పెంచిపోషిస్తున్న శక్తులపైన రేఖాపాత్ర విరుచుకుపడుతున్నారు. బెంగాల్‌లో ఉన్న 42 లోక్‌సభ నియోజకవర్గాలలో బసిర్‌హత్ కూడా ఒకటి.మోడీ ఆమెతో మాట్లాడుతూ ఆమెకు మద్దతు తెలియజేశారు.

## ఫిలిప్పైన్స్ సార్వభౌమాధికారానికి భారత్ మద్దతు

**మనీలా :** ఫిలిప్పైన్స్‌దేశ సార్వభౌమాధికారానికి భారతదేశం తన మద్దతు తెలియజేసింది. భారత్-ఫిలిప్పైన్స్ రెండు దేశాలమధ్య రక్షణ, భద్రత సహా వివిధ కొత్త రంగాలలో సహకార అన్వేషణ చేయాలని తాము కోరుకుంటున్నామని భారత విదేశాంగమంత్రి ఎస్.జైశంకర్ అన్నారు. మంగళవారంనాడు జైశంకర్ ఆ దేశంలో పర్యటించారు. ఫిలిప్పైన్స్ విదేశాంగమంత్రి ఎన్‌రిక్ మనాలోతో సమావేశం అనంతరం ఇద్దరూ పత్రికాగోష్టిలో మాట్లాడారు. చైనాతో దక్షిణ చైనా సముద్రంలో మనీలాకు సముద్రపరమైన వివాదం నేపథ్యంలో రక్షణమంత్రి ఆ దేశంలో పర్యటించారు. ఆ దేశ సార్వభౌమాధికారానికి తన మద్దతు తెలియజేశారు. రెండు దేశాల నాయకులమధ్య చర్చల్లో మంచి ఫలితాలు సాధించామని ఆయన అన్నారు. రాజకీయ, రక్షణ, భద్రత, సముద్ర వ్యవహారాలు, వాణిజ్యం, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, విద్య, డిజిటల్ టెక్నాలజీ, సంస్కృతి అభివృద్ధిలో సహకారాన్ని పెంపొందించుకోవడానికి చర్చలు దోహదం చేస్తాయన్నారు. ప్రాంతీయ, ప్రాపంచిక సమస్యలను, ఉగ్రవాద సమస్యలను వారు చర్చించారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో పరిస్థితులు, ఏసియన్ అసోసియేషన్ గురించి రు చర్చించారు. మారుతున్న ప్రపంచంలో భారత్-ఫిలిప్పైన్స్ దేశాలు రెండు మరింత సన్నిహిత సహకారానికి సమాయత్తమయ్యాయన్నారు.

## ఫీజు తగ్గించాలని నిరసన



**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్‌ఫీజును రాష్ట్రప్రభుత్వం రూ.1000 నిర్ణయించిందని వెంటనే ఈపరీక్ష ఫీజును ప్రభుత్వం తగ్గించాలని బిఆర్ఎస్, ఎస్ఎఫ్‌యు విద్యార్థిసంఘాల నాయకులు అన్నారు. టిఆర్ఎస్వి ఎస్ఎఫ్‌యు ఆధ్వర్యంలో పిజిసెంటర్ ముందు విద్యార్థులతో టెట్‌ఫీజును తగ్గించాలని నిరసన చేపట్టారు. ఈసందర్భంగా బిఆర్ఎస్వి జిల్లా నాయకులు డి.శేఖర్ పాలమూరు యూనివర్సిటి విద్యార్థినాయకుడు దాస్‌లు మాట్లాడుతూ 2011నుంచి 2021వరకు టెట్ పరీక్షఫీజు రూ.200లు మాత్రమే ఉండేదని, 2022 సంవత్సరంలో రూ.300, 2023లో రూ.400లు పెంచారు. కాని 2024లో నిర్వహిస్తున్న టెట్‌కు ఏకంగా రూ.1000 పెంచారని ఇది దుర్మార్గపు చర్య అని తక్షణమే ప్రభుత్వం టెట్ ఫీజును తగ్గించి పాతఫీజులను కొనసాగించాలన్నారు. ఇప్పటికైనా టెట్ అభ్యర్థులకు ఆర్థికభారంకాకుండా ఫీజును తగ్గించాలని రాష్ట్రప్రభుత్వం వెంటనే ఉత్తర్వులు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

## ఉపాధిహామీ పనిప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించండి

### వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి సృజన్‌కుమార్ డిమాండ్



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** ఉపాధిహామీ పనిప్రదేశాల్లో కూలీలకు కనీస సౌకర్యాలు, మౌలిక వసతులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధిహామీ పనులు విస్తృతంగా జరుగుతున్న సంధర్భంగా వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పని ప్రదేశాల్లో కూలీలకు మంచినీటి సౌకర్యం, నీడ సౌకర్యం కల్పించడంతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలన్నారు. కూలీల పనుల సమయాన్ని 7 గంటల నుంచి 11 గంటల వరకు కొనసాగించాల ని, ఎక్కువ సమయం వరకు చేయించడం వల్ల ఎండదెబ్బ కొట్టి కూలీలు అనారోగ్యాన్ని గురయ్యే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. దూర ప్రాంతాలకు వెళ్లే కూలీలకు రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు. ఉపాధి హామీ పనులు జరిగే ప్రదేశాలపై క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడిందన్నారు. ఉపాధి కూలీల సమస్యలు తెలుసుకోవడానికి పనిప్రదేశాలకు వెళితే గ్రామాల్లో మెట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు అందుబాటులో ఉండడం లేదని, 12గంటల వరకు ఉండి మేటి వచ్చిన తర్వాత ఫొటోఅప్‌లోడ్ చేసిన తర్వాత కూలీలు ఇంటికి వెళ్లే పరిస్థితి దాపురించిందన్నారు. ప్రభుత్వం ఉపాధి కూలీలకు పనికి ముందు పని అయిపోయిన తర్వాత రెండు సార్లు ఫోటో అప్‌లోడ్ చేసే పద్ధతిని వెనక్కి తీసుకోవాలని, వర్షాలు లేక వ్యవసాయేతన భూములు గట్టిగా మారాయని, అట్టి ప్రదేశాల్లో కొలతలు పెట్టి కూలీలతో పనులు చేయించడం వల్ల భూమి గట్టిగా ఉండడంతో కొలతల ప్రకారం పనులు చేయక సరైన వేతనం పడక కూలీలు శ్రమదోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొలతలు లేకుండా పనులు కల్పించి కూలీలను ఆర్థికంగా ఆదుకోవాలని సృజన్ డిమాండ్ చేశారు.

## ఉపాధి కూలీలకు వేసవిభత్యం

### సిపిఐ సిరిసిల్ల జిల్లా కార్యదర్శి గుంటి వేణు



**ప్రజాపక్షం/సిరిసిల్ల :** ఉపాధి హామీ కూలీలకు వేసవిభత్యం చెల్లించాలని సిపిఐ రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి గుంటి వేణు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సుభాష్ నగర్ సిపిఐ కార్మిక భవనంలో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. వేసవిలో ఉపాధి హామీ కూలీలను ప్రోత్సహించడానికి తీసుకొచ్చిన ప్రత్యేక వేసవి భత్యానికి ఈ సంవత్సరం అదనపు బడ్జెట్ కేటాయించలేదన్నారు. ఈ సంవత్సరం అయినా అమలు చేయాలని కోరారు. అదనపు భత్యానికి సంబంధించి ఇప్పటివరకు ఎలాంటి మార్గదర్శకాలు విడుదల కాలేదన్నారు. ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని ప్రతి సంవత్సరం జనవరిలో వ్యవసాయ పనులు పూర్తవుతాయని ఆ తర్వాత ఫిబ్రవరి నుంచి మే వరకు విపరీతంగా ఎండలు ఉంటాయని ఎండ తీవ్రతకు భయపడి కూలీలు పనిలోకి రాకపోవడంతో వేసవిలో ఉపాధి హామీ కూలీలకు ఇచ్చే కూలితోపాటు అదనంగా మరి కొంత కూలీ ఇచ్చి పనులు చేయించే వారన్నారు. ఫిబ్రవరిలో 20 శాతం, మార్చిలో 25 శాతం ఏప్రిల్ మేలో 30 శాతం, జూన్ లో 25 శాతం అదనంగా బత్యం చెల్లించేవారన్నారు. వేసవి భత్యం చెల్లింపులు నిలిపివేయడంతో జిల్లాలో ఒక లక్ష పదివేల మంది ఉపాధి కార్మికులు లక్షలాది రూపాయలు నష్టపోతున్నారన్నారు. జిల్లాలో గత మూడు నెలల నుంచి ఉపాధి హామీ కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలు సైతం చెల్లించలేదన్నారు. ఉపాధి హామీ కూలీలందరూ ఎస్సీ ఎస్టీ బీసీ పేద వర్గాలకు సంబంధించిన కార్మికులే అన్నారు. వీరి సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. సమావేశంలో బాచుపల్లి శంకర్, అజ్జ వేణు పాల్గొన్నారు.

## సాగునీటి కోసం రోడ్డెక్కిన రైతులు

### ఎస్ఆర్ఎస్‌పి నీటిని విడుదల చేయాలని డిమాండ్



**ప్రజాపక్షం/గంగాధర :** ఎస్ఆర్ఎస్‌పి నుంచి వరద కాలువకు తక్షణమే నీటిని విడుదల చేయాలంటూ మంగళవారం రైతు సంఘాల ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలోని కురిక్యాలలో వరద కాలువ వద్ద గల ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సంధర్భంగా రైతులు మాట్లాడుతూ వరద కాలువపైనే ఆధారపడి సాగుచేసే చొప్పదండి నియోజకవర్గంలోని రైతులకు వరద కాలువ ద్వారా నీటిని అందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. వరద కాలువ ద్వారా నీరు ఇవ్వాలని, ఇప్పటికే పలుమార్లు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు విన్నవించుకున్నా పట్టించుకోకపోవడం అత్యంత బాధాకరమన్నారు. పొలాలు ఎండుతున్నా వరద కాలువకు నీటిని విడుదల చేయకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. రైతు సంక్షేమమే ధ్యేయమనే గొప్పలు చెప్పుకునే ఈ ప్రభుత్వం చొప్పదండి రైతులు కనబడడం లేదా? అని వాపోయారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకుని వరద కాలువకు నీటిని విడుదల చేసేందుకు కృషి చేయాలని రైతులు కోరారు.

## సుధాకర్ సేవలు మరువలేనివి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాలమల్లేష్



**ప్రజాపక్షం/జగద్గిరిగుట్ట :** మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎఐటియుసి అల్వాల్ కమిటీ ఉపాధ్యక్షుడు సుధాకర్ సంతాప సభ మంగళవారం ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు మహేందర్ అధ్యక్షతన అల్వాల్ మున్సిపల్ కార్యాలయం ఎదుట నిర్వహించారు. కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎన్.బాలమల్లేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుధాకర్ అకాల మరణం పార్టీకి, ట్రేడ్ యూనియన్ కు తీరనిలోటన్నారు. సుధాకర్ ఎల్లవేళలా కార్మికులకు అండగా నిలిచి వారి సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరించుటలో ముందుండేవారన్నారు. వారి ఆశయాలను ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలన్నారు. సుధాకర్ కుటుంబానికి ఎళ్లవేళలా అండగా ఉంటామన్నారు. ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు స్వామి, కార్యదర్శి వి.శ్రీనివాస్, అణగారిన హక్కుల పోరాట సమితి ప్రధాన కార్యదర్శి సిఎల్ యాదగిరి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎఐటియుసి అధ్యక్షుడు హరినాథ్, జిల్లా మున్సిపల్ సంఘం అధ్యక్షుడు డిఎన్ శేఖర్, అల్వాల్ కమిటీ ఎఐటియుసి నాయకులు శివశంకర్, శ్రీను తిరుపతి, రాజు, యాదమ్మ, మల్లు బాయ్, పెంటమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ధర్మభిక్షం సాయుధ పోరాటం యువతకు స్ఫూర్తి



### వర్ధంతి సభలో వక్తలు

**ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి :** ప్రజల మనిషిగా సామాన్య జీవితం గడిపిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు బొమ్మగాని ధర్మభిక్షం అందరికీ ఆదర్శప్రాయుడని, ఆయన సాయుధ పోరాట స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శమని సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. మంగళవారం తెలంగాణ సా యుధ పోరాట యోధుడు, మాజీ పార్లమెంటు సభ్యులు, గీత పనివారల సంఘం వ్యవస్థాపకుడు బొమ్మగాని ధర్మభిక్షం 13వ వర్ధంతి సందర్భంగా సిపిఐ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చిట్యాల పిఎసిఎస్ చైర్మన్ సుంకరి మల్లేశంగౌడ్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రావణ్‌కుమార్, గీత పనివారల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పబ్బు వీరాస్వామి, రైతుసంఘం జిల్లా ప్రధానకార్యదర్శి గురిజ రామచంద్రం, మహిళా సమా ఖ్య జిల్లా కన్వీనర్ గిరి రమ, ఖమ్మంపాటి వెంకన్న, విశ్వనాధుల లెనిన్, జిల్లా యాదయ్య, ఎస్‌కెమదార్, యూసుఫ్, దోటి పాండరి, కౌసల్య, సుజాత తదితరులు పాల్గొన్నారు.



### రైతాంగ సాయుధ పోరాట రథసారథి

**మహబూబ్‌నగర్ ప్రతినిధి:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు ధర్మభిక్షం అని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్ అన్నారు. సురవరం వెంకట్రామిరెడ్డి భవన్‌లో ధర్మభిక్షం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాలులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు చాంద్ పాషా, సత్యానారాయణరెడ్డి, కాజా మైనుద్దీన్, కే.హనుమంతు,



బి.బాలరాజు, ఆంజనేయులు, గోపి పాల్గొన్నారు.

### కమ్యూనిజం ముద్దుబిడ్డ

**హుజూర్‌నగర్ :** కమ్యూనిజం ముద్దుబిడ్డ ధర్మభిక్షమని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ అన్నారు. సిపిఐ కార్యాలయంలో ధర్మభిక్షం వర్ధంతిని నిర్వహించారు. ధర్మభిక్షం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు, కంబాల శ్రీనివాస్, దేవరం మల్లీశ్వరీ, ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్, కొప్పోజు సూర్యనారాయణ, దొంతగాని సత్యనారాయణ, జక్కుల రమేష్, పోనుగుపాటి వాసుదేవ రావు, జడ వెంకన్న, చక్రాల స్టాలిన్, సుందరి పద్మ, గుండెబోయిన వెంకన్న, గోపగాని వెంకటేశ్వర్లు, చెన్న



గాని సైదులు, మీసాల గాంధీ, బత్తిని మల్లయ్య, కంచర్ల చిన్ననర్సిరెడ్డి, జక్కుల రమణ పాల్గొన్నారు.

### మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడటమే ధర్మభిక్షానికి నివాళి

**ఖమ్మం అర్బన్ :** మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడటమే ధర్మభిక్షానికి మనమిచ్చే నివాళి అని బాగం హేమంతరావు తెలిపారు. ధర్మభిక్షం వర్ధంతి సభ ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో దూసరి శ్రీరాములు అధ్యక్షతన జరిగింది. సభలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు మాట్లాడుతూ నైజాం నవాబుకు వ్యతిరేకంగా తెలంగాణలో వెట్టిచాకిరి విముక్తి కొరకు జరిగిన పోరాటంలో ధర్మభిక్షం ప్రముఖ పాత్ర పోషించారన్నారు. తొలుత ఆంధ్రమహాసభ నిర్మాణంలోను తెలంగాణ సాయుధ పోరాటంలోను ముందుండి పోరాడి అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. రానున్న ఎన్నికల్లో మతోన్మాద బిజెపిని ఓడించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని అదే ధర్మభిక్షానికి ఇచ్చే సరైన నివాళి అన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, ఎస్‌కె జానిమియా, యర్రా బాబు, శింగు నర్సింహారావు, పోటు కళావతి, రావి శివరామకృష్ణ, తోట రామాంజనేయులు, మేకల శ్రీనివాసరావు, పైడి ఏసు, గాదె లక్ష్మినారాయణ, యానాల సాంబశివరెడ్డి, ఇటికాల రామకృష్ణ, పాటి అప్పారావు, గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు తొండల సత్యనారాయణ గౌడ్, సహాయ కార్యదర్శి బంధం నాగేశ్వరరావు, ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు సింగం సత్తయ్య గౌడ్, సోమయ్య గౌడ్, వాసు గౌడ్, దూసరి కళ్యాణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### నేటి తరానికి ఆదర్శం

**సూర్యాపేట :** తెలంగాణ సాయుధపోరాట యోధుడు ధర్మభిక్షం జీవితం నేటి తరానికి ఆదర్శనీయమని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయం ధర్మభిక్షం భవన్‌లో ధర్మభిక్షం వర్ధంతిని నిర్వహించారు. ధర్మభిక్షం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు అనంతుల మల్లేశ్వరీ, పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, బొమ్మగాని శ్రీనివాస్, దోరపల్లి శంకర్, చామల అశోక్‌కుమార్, నీల శ్రీనివాస్, గోపగాని రవి, ఎడెల్లి శ్రీకాంత్, ధీకొండ శ్రీనివాస్, పెండ్ర కృష్ణ, తాళ్ల సైదులు, సాయిబాబా, దికొండ రవి, పున్నం రమేష్, సేవ్య, కొత్వాల్ సురేందర్, రూపాని విజయ్, హసన్, తొగటి మురళి, వెంకట్‌రెడ్డి, వాడపల్లి వెంకన్న పాల్గొన్నారు.

### జిల్లా కేంద్రంలో ధర్మభిక్షం విగ్రహం

**నల్లగొండ టౌన్ :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు బొమ్మగాని ధర్మభిక్షం విగ్రహాన్ని నల్లగొండ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసి ఆయన జయంతి, వర్ధంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బిసి విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్ధన్‌గౌడ్ ప్రభుత్వానికి కోరారు. ధర్మభిక్షం వర్ధంతిని బిసి విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా, జిల్లాలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఎన్నో ఉద్యమాలు చేసిన గొప్ప నాయకుడు ధర్మభిక్షం పేరును హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారికి పెట్టాలన్నారు. కార్యక్రమంలో బిసి యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కారింగ్ నరేష్‌గౌడ్, అధ్యక్షుడు చింతల విజయ్ కుమార్‌గౌడ్, కొంపెల్లి రామన్నగౌడ్, పొగాకు రవికుమార్ యాదవ్, కనకాలరెడ్డి, బైరగోని అఖిల, పులకరం మౌనిక, వస్పరి రాధిక, మేడి స్వాతి, బండి రమ్యశ్రీ, మాదుగుల అంజలి, గోదా ఇందు పాల్గొన్నారు.

### ప్రజల మనిషి

**దేవరకొండ :** ధర్మభిక్షం ప్రజల మనిషిగా ప్రజలకు విరామమెరగని సేవలందించారని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. ధర్మభిక్షం వర్ధంతి సందర్భంగా దేవరకొండలోని పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో ధర్మభిక్షం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల్పించారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహా, సిపిఐ మండల కార్యదర్శులు ఉప్పునూతల వెంకటయ్య, కుంభం జయరాములు, మండల సహాయ కార్యదర్శి రామస్వామి, పల్లా రంగారెడ్డి, ఆంజనేయులు, యాదయ్య, రాంరెడ్డి, పట్టణ కార్యదర్శి వెంకట్రాములు, ఎఐటియుసి డివిజన్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, సిపిఐ నాయకులు మైనోద్దీన్, వెంకటేశ్వరరావు, శ్రీను, బుచ్చయ్య, వెంకటయ్య, ఆనందచారి, వెంకటయ్య, ప్రభాకర్, బక్కయ్య పాల్గొన్నారు.

### నిజాం నవాబుకు నిరసన తెలిపిన ధైర్యశాలి

**హయత్ నగర్ :** విద్యార్థి దశలోనే నిజాం నవాబు జన్మదిన వేడుకలను బహిష్కరించి నిరసన తెలిపిన గొప్ప ధైర్యశాలి ధర్మభిక్షమని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి కొనియాడారు. సిపిఐ హయత్ నగర్ మండల సమితి ఆధ్వర్యంలో ధర్మభిక్షం వర్ధంతిని పార్టీ కార్యాలయంలో సామిడి శేఖర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ధర్మభిక్షం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ హయత్ నగర్ మండల సహాయకార్యదర్శులు రమావత్, సక్రు శ్రీదేవి, సోమన్న మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి సరిత, అనిత, సౌజన్య, పారిజాత, ఉమారాణి, సుజాత. జ్యోతి,నాగరాజు, ఎఐవైఎఫ్ మండల అధ్యక్షులు శ్రీకాంత్, వెంకట్, ఆదిలక్ష్మి, మమత, శిల్ప, రాములు సురేందర్, శ్రీధర్‌రెడ్డి, బాలరాజు పాల్గొన్నారు.

**అబ్దుల్లాపూర్‌మెట్ :** తెలంగాణ సాయుధ పోరాట







యోధుడు ధర్మభిక్షం ఆశయాలను నేటి తరం యువత ఆదర్శంగా తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర నాయకులు ఆదోజు రవీంద్రాచారి పిలుపునిచ్చారు. పెద్ద అంబర్‌పేట మున్సిపాల్టీ రావినారాయణరెడ్డి నగర్ కాలనిలోని సిపిఐ కార్యాలయంలో ధర్మభిక్షం వర్ధంతిని నిర్వహించారు. ధర్మభిక్షం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు ముత్యాల యాందిరెడ్డి, కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, కేతరాజు నర్సింహ్మా, నవనీత, చిలుకూరి పుల్లయ్య, నారాయణ, దేవమ్మ తదితరులు పాల్గొన్నారు.





## తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు

### నల్లగొండ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన



**ప్రజాపక్షం /నల్లగొండః** గ్రామీణ ప్రాంతాలతో పాటు, పట్టణ ప్రాంతాలలో తాగునీటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు కలెక్టర్ దాసరి హరిచందన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరించారు. జిల్లాలో తాగునీటిని సరఫరా చేసే పథకాలకు ఎలాంటి విద్యుత్ అంతరాయం లేదన్నారు. అవసరమైన చోట చేతి పంపుల మరమ్మత్తుతో పాటు,ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నామని, తాగునీటిపై ఎప్పటికప్పుడు మున్సిపల్ కమీషనర్లు, ఎంపిడిఓలతో సమీక్షిస్తున్నామని తెలిపారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అన్ని జిల్లాల కలెక్టర్లు, పౌరసరఫరాల అధికారులు, మిషన్ భగీరథ అధికారులతో యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, తాగునీటిపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై వివరించారు. అదనపు కలెక్టర్లు టి.పూర్ణచందర్, జె.శ్రీనివాస్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ నాగేశ్వరరావు, జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, డిఆర్డిఓ నాగిరెడ్డి, జెడ్పి సీఈఓ రేణుకరణ్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి మురళి, మిషన్ భగీరథ ఎస్ఈ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలు పరిష్కరిస్తా

### ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



**ప్రజాపక్షం/ఆలేరు :** నియోజకవర్గ వ్యాప్తంగా పల్లెనిద్ర చేసి ప్రజల సమస్యలు పరిష్కరిస్తామని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. మంగళవారం భువనగిరి సమీపంలోని న్యూదీప్తి హోటల్లో ప్రజాపాలనకు వంద రోజులు ప్రజానాయకుడికి 100 ప్రశ్నలు అనే కార్యక్రమంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలో కొలనుపాక జైన్ టెంపుల్ నుండి బచ్చన్నపేట డబుల్ లైన్ రోడ్డు పనులు ప్రారంభించామన్నారు. ఆలేరు పట్టణంలో కొలనుపాక రైల్వే అండర్ బ్రిడ్జి పనులు ప్రత్యేక చొరవ తీసుకొని వేగవంతం చేయడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో పలు గ్రామాలకు అంగన్వాడి కేంద్రాలు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మరియు సిసి రోడ్ల మంజూరు చేసి నిర్మాణాలు ప్రారంభించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జనగాం ఉపేందర్‌రెడ్డి, ఈరసారపు యాదగిరి, సంజీవరెడ్డి అశోక్ శ్రీశైలం, పద్మ, వెంకశ్వరరాజు బాలరాజ్‌గౌడ్, మహేందర్ సంజీవరెడ్డి సుబ్రహ్మణ్యం వెంకటస్వామి పాల్గొన్నారు.

## ఉద్యోగాలపై బిజెపి ప్రజలను తప్పదోవ పట్టిస్తోంది : రాహుల్

**న్యూఢిల్లీ :** బిజెపిపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మరోమారు తీవ్ర విమర్శలు చేశారు. తాము ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీపై కాషాయ పార్టీ ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందని మండిపడ్డారు. దేశ వ్యాప్తంగా యువత తమకు అబద్ధాలు చెప్పిందా అని అడుగుతున్నారన్నారు. బిజెపి సృష్టించిన భ్రమలను ఛేదించి యువత తమ భవితవ్యాన్ని తామే మార్చుకోవాలని, ఎన్నికల ముందు యువతకు చేసిన వాగ్దానమైన 'యువ న్యాయం' ద్వారా ఉపాధి విప్లవానికి కాంగ్రెస్ శ్రీకారం చుట్టిందన్నారు. 'నరేంద్ర మోడీ జీ, మీ వద్ద ఉపాధి కోసం ఏదైనా ప్రణాళిక ఉందా? ఈ ప్రశ్న ఈ రోజు ప్రతి యువకుడి పెదవుల్లో ఉంది. ప్రతి సంవత్సరం 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని అబద్ధం ఎందుకు చెప్పారని ప్రతి వీధి, పల్లెలో బిజెపిని అడుగుతున్నారు' అని రాహుల్ పేర్కొన్నారు. 'యువ న్యాయ్ ఆధ్వర్యంలో ఉపాధి విప్లవం చేపట్టాలని కాంగ్రెస్ సంకల్పించింది. ప్రభుత్వంలోకి వచ్చిన వెంటనే 'పెహ్లీ నౌక్రి పక్కీ' పథకం ద్వారా 30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తాం, చదువుకున్న ప్రతి యువకుడికి ఏడాదికి లక్ష రూపాయల ఉద్యోగం ఇస్తాం' అని హామీ ఇచ్చారు. చట్టాన్ని చేయడం ద్వారా పేపర్ లీక్‌లను తొలగిస్తామని రాహుల్‌గాంధీ హిందీలో 'ఎక్స్'లో పోస్టు చేశారు.

## విజ్ఞతగా ఉపయోగించండి

(మొదటి పేజీ తరువాయి)

గురించి గానీ, అమిత్ షా గురించి గానీ ఆలోచించం. మాకు అవసరం లేదు. ఎందుకంటే వారు రాజకీయ నాయకులు. కానీ మేం వారిని రాజనీతిజ్ఞులుగా భావించాం, అందువల్ల వారు కొంత వ్యక్తిత్వాన్నీ, సౌశీల్యాన్ని ప్రదర్శించాలి, దీర్ఘదర్శులుగా, దార్శనికులుగా ఆలోచించాలి'' అని సోనం వాంగ్ ఛుక్ అన్నారు. వాంగ్ ఛుక్ లేహ్ లో వందలాదిమందితో కలిసి ఆరుబయట నిద్రించారు. గడచిన మూడు వారాలుగా వాంగ్‌ఛుక్‌తోపాటు వందలాదిమంది ఆయనతోపాటే ఆరుబయట దీక్షలో నిద్రిస్తున్నారు.''దేశంకోసం, జాతి ప్రయోజనాలకోసం ఈసారి ఓటర్లు చాలా విజ్ఞతతో, విచక్షణతో ఈసారి తమ ఓటు అనే శక్తిని, అధికారాన్ని ఉపయోగించండి'' అని సోనం వాంగ్‌ఛుక్ పిలుపు ఇచ్చారు. నాలుగు సంవత్సరాలుగా కేంద్ర పాలిత ప్రాంతం లధఖ్‌లో ఉధృతంగా నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయి. లధఖ్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా చేసినప్పటినుండీ ఇక్కడ ఈ ఆందోళనా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. జమ్మూ కశ్మీరు నుండి లధఖ్‌ను వేరుచేసి కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చారు. లధఖ్‌కు రాష్ట్ర ప్రతిపత్తి కల్పించాలని కోరుతూ ఆందోళనలు, ఉద్యమాలు ఉధృతంగా జరుగుతున్నాయి. దీంతో గత ఏడాదిలో కేంద్ర హోమ్ మంత్రిత్వశాఖ ఒక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. లేహ్, కార్గిల్ ప్రాంతాలలోని ప్రముఖులను కమిటీ సభ్యులుగా నియమించి ఈ కమిటీని ఏర్పాటు చేశారు. లధఖ్‌కు రాష్ట్ర ప్రతిపతి కల్పించడంతోపాటు ఈ ప్రాంతంలో వాతావరణ రక్షణ, పర్యావరణ రక్షణకు కూడా పారిశ్రామిక కాలుష్యం లేకుండా భవిష్యత్‌లో గట్టి చర్యలు తీసుకునే విషయాన్ని కూడా ఈ ఉన్నతస్థాయి అధికారాలుగల కమిటీ ఆలోచనలు చేస్తున్నది. అదేవిధంగా రాజ్యాంగంలోని ఆరో షెడ్యూలులో ఈ అంశాలన్నీ చేర్చాలనే విషయం కూడా ప్రధానంగా ఉంది. అదేవిధంగా రాజకీయ ప్రాతినిధ్య అంశాన్ని కూడా ఈ కమిటీ పరిశీలన చేస్తుంది. ఐనప్పటికీ కొన్ని కీలకమైన సమస్యలపై మార్చి 4వ తేదీన వివాదం ఏర్పడటంతో సోనం వాంగ్‌ఛుక్ రెండు రోజుల తర్వాత మార్చి 6వ తేదీన నిరాహార దీక్ష చేపట్టారు. ఆయన కేవలం ఇప్పటివరకూ మంచినీరుతో గొంతు తడుపుకుంటూ డిమాండ్ల సాధనకోసం నిరాహార దీక్ష చేశారు. వాంగ్‌ఛుక్ చేసిన నిరాహార దీక్షకు లధఖ్‌లో ఉన్న వివిధ సాంఘిక, రాజకీయ సంఘాలు, సంస్థలు మద్దతు తెలియజేశారు. ఆయనతోపాటే వందలాదిమంది ఆరుబయట నిద్రించారు ఇన్నాళ్ళుగా. కార్గిల్ డెమోక్రటిక్ అలయెన్స్ (కెడిఎ) కూడా ఆయన దీక్షకు మద్దతు తెలియజేసింది. కెడిఎ సభ్యులు కూడా ఆయనతోపాటు దీక్షలో పాల్గొన్నారు. కార్గిల్‌లో సమ్మె చేస్తున్నారు. మంగళవారంనాటికి ఈ సమ్మె మూడవ రోజుకు చేరుకుంది.

## మాటల యుద్ధం

(మొదటి పేజీ తరువాయి)

ఈనెల 24నబెంగళూరులో మాట్లాడుతూ ఎపివై మోడీ ప్రభుత్వంలోని ముఖ్యమైన సామాజిక భద్రత పథకమని, దీని ద్వారా అనే ప్రయోజనాలు ఉన్నాయని చెప్పారని జైరామ్ రమేశ్ ట్వీట్‌లో ఉటంకించారు. ఆమె మాట్లాడిన మరుసటి రోజే ఈ పథకంలో చేరిన మూడవవంతు చందాదారులు బ్యాంకు అధికారుల బలవంతం మీదనో , బెదిరింపుల ఫలితంగానో చేరారని, వారికి కేటాయించిన కోటా పూర్తి చేసేందుకే ఆపనిచేశారనే వార్తలు వచ్చాయని పే ర్కొన్నారు. మోడీ ప్రభుత్వం హడావుడి చేసే వార్తల 'హెడ్ లైన్ మేనేజ్‌మెంట్' పథకమని, ప్రజలకు కేవలం కొన్ని ప్రయోజనాలు మాత్రమే అందుతున్నాయని ఎద్దేవా చేశారు. ఈ పథకంలో అసంఘటిత కార్మికుల నుండి స్పష్టమైన అంగీకారం లేకుండానే చేర్పించారని ,దీంతో ప్రతి ముగ్గురిలో ఒక చందాదారుడు మధ్యలోనే వదిలేస్తున్నాడని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్సెస్( ఐసిఎస్ఎస్ఆర్) అధ్యయనం తేలిందన్నారు. సుమారు 83 శాతం చందాదారులు కనిష్ఠ పెన్షన్ రూ.వెయ్యిస్లాబ్‌లో ఉన్నారని, అయితే చందా తక్కువ ఉన్న విషయాన్ని కూడా లబ్దిదారులు పట్టించుకోవడం లేదన్నారు. ఈ పథకం కింద వచ్చే పెన్షన్ తక్కువగా ఉండడం, లాభాలు ఆకర్షణీయంగా లేకపోవడం, అవి పెరిగే ధరలకు అనుగుణంగా లేకపోవడంతో ప్రయోజనకరంగా లేకుండాపోతుందన్నారు. కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ దీనిని కౌంటర్‌చేస్తూ ఇది అత్యుత్తమంగా రూపొందించిన పథకమని, చందాదారులు తప్పుకోనంతవరకు ప్రీమియం చెల్లింపు ఆటోమెటిక్‌గా జరిగిపోతుందన్నారు. ప్రతి సంవత్సరం తాము కొనసాగాలా వద్దా అనే నిర్ణయం తీసుకునేలా కాకుండా, కేవలం తాము వద్దనుకునేంత వరకు చందాదారులు పథకంలో కొనసాగుతారని, వారికి తరువాత మంచిలబ్ది చేకూరుతుందని తెలిపారు. బ్యాంకు అధికారుల బెదిరింపులకు పాల్పడి చందాదారులను చేర్పించారనే తన ఆరోపణను కేంద్రమంత్రి అంగీకరించినట్లయిందని జైరామ్ రమేశ్ మరో ట్వీట్ చేశారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com